సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 157

మంగళవారం 27-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



**మార్కెట్‌కు ప్యాకేజీ జోష్..**

ఉద్దీపన చర్యలతో గ్యాప్ అప్ ఓపెనింగ్. సెన్సెక్స్ 793 పాయింట్లు అప్ -బిజినెస్‌లో



**అంత కష్టపడకురా అంటున్నారు**

'సాహో' ప్రభాస్‌తో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ - ఫ్యామిలీలో

# మధ్యవర్తికి తావులేదు

భారత్, పాక్ మధ్య విభేదాలన్నీ ద్వైపాక్షిక సంబంధమైనవే. ఈ విషయాల్లో ఏ ఇతర దేశాన్ని కూడా ఇబ్బందిపెట్టడం మాకు ఇష్టం లేదు. ద్వైపాక్షిక సమస్యలను మేమే చర్చించి పరిష్కరించుకుంటాం. 1947 వరకు ఇరు దేశాలు కలిసే ఉన్నాయి. ప్రస్తుతం ఇరుగు పొరుగు దేశాలుగా ఉన్న మేము అన్ని సమస్యలను చర్చించి పరిష్కరించుకుంటామనే నమ్మకం ఉంది. ప్రధానిగా రెండోసారి ఎన్నికయ్యాక పాక్ ప్రధాని ఇమ్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడా. ఇరు దేశాలు పేదరికం, నిరక్షరాస్యత, అంటువ్యాధులపై పోరాడాల్సి ఉందని చెప్పా. ప్రజల సంక్షేమం కోసం కలసి పనిచేద్దామని కోరా.

–నరేంద్ర మోదీ

కశ్మీర్‌పై ట్రంప్ సమక్షంలో తేల్చిచెప్పిన ప్రధాని మోదీ

ద్వైపాక్షిక అంశాలను పాక్‌తోనే పరిష్కరించుకుంటాం

ఈ అంశంపై ఇతర దేశాలను ఇబ్బంది పెట్టబోమని వ్యాఖ్య

జీ7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్‌తో కలసి మీడియాతో చిట్‌చాట్

- వివరాలు 5లో

కశ్మీర్ అంశంపై మోదీతో సుదీర్ఘంగా చర్చించా. ఈ సమస్యను భారత్, పాకిస్తాన్ సొంతంగానే పరిష్కరించుకుంటాయనే నమ్మకం ఉంది. కశ్మీర్ అంశం పూర్తిగా అదుపులోనే ఉందని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు. ఇద్దరు నేతలతోనూ నాకు సత్సంబంధాలున్నాయి. ఈ సమస్యను వారు స్వయంగా పరిష్కరించుకుంటారని విశ్వసిస్తున్నా. మోదీతో విందు భేటీలో వాణిజ్యం, సైనిక సహా వివిధ అంశాలపై చర్చించా. మా భేటీ గొప్పగా సాగింది. భారత్ గురించి ఎంతో తెలుసుకున్నా.

–ట్రంప్




సోమవారం ఫ్రాన్స్‌లోని బియరిట్జ్‌లో ద్వైపాక్షిక భేటీ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నవ్వులు

# భారత్‌తో అణు యుద్ధానికైనా రెడీ

**మరోసారి బెదిరింపులకు దిగిన పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్**

కశ్మీర్ పరిస్థితులు యుద్ధానికి దారి తీస్తే.. గుర్తుంచుకోండి రెండు దేశాల వద్దా అణ్వాయుధాలు ఉన్నాయి. కశ్మీర్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. కశ్మీర్ కోసం ఎంతవరకైనా వెళతాం. అంతర్జాతీయ సమాజం ఇప్పుడు బాధ్యత తీసుకోవాలి, లేదా పాక్ ఏదైనా చేయగలుగుతుంది



- వివరాలు 5లో

# బడ్జెట్‌పై మాంద్యం ఎఫెక్ట్!

- రాష్ట్ర ఆదాయ, వ్యయాల్లో భారీగా అంతరం
- కేటాయింపులపై ప్రభావం చూపే అవకాశం
- వాస్తవిక కోణంలో బడ్జెట్ తయారీకి సీఎం ఆదేశం
- సంక్షేమం, సాగు అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని సూచన
- పూర్తిస్థాయి బడ్జెట్‌పై కసరత్తు షురూ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా పలు రంగాలపై కనిపిస్తున్న ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్రంపైనా పడింది. ఇది బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపబోతోంది. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు నిధుల కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని సర్కారు ఆందోళన చెందుతోంది. ఖజానాపై ఇప్పటికే ఆర్థిక మాంద్యం ప్రభావం కనపడుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆశించిన మేరకు ఆదాయం రాకపోవడంతో కొన్ని ప్రతిష్టాత్మక పథకాలు, ప్రాజెక్టులు మినహా మిగిలినవాటికి బడ్జెట్‌లో భారీగా కోతలు పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఆర్థికమాంద్యం తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తాజాగా అధికారులను ఆదేశించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. బడ్జెట్ రూపకల్పనపై సోమవారం ఆయన ప్రగతి భవన్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఇతర సీనియర్ అధికారులతో కసరత్తు ప్రారంభించారు. ఈ ఏడాది మార్చిలో ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను త్వరలో అసెంబ్లీలో ప్రవేశ పెడతామని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రకటించారు. ''దేశవ్యాప్తంగా తీవ్రమైన ఆర్థిక మాంద్యం నెలకొని ఉంది. అన్ని రంగాలపై దీని ప్రభావం పడింది. ఆదాయాలు బాగా తగ్గిపోయాయి. అన్ని రాష్ట్రాల్లో ఆదాయం తగ్గింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ఆదాయం–అవసరాలను బేరీజు వేసుకుని బడ్జెట్ రూపకల్పన జరగాలి. వాస్తవ దృక్పథంతో బడ్జెట్ తయారు చేయాలి. ప్రజా సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూనే, ఇతర రంగాలకు అవసరమైన మేర కేటాయింపులుండేలా చూడాలి''అని సీఎం కేసీఆర్ సూచించారు. బడ్జెట్ రూపకల్పనపై మంగళవారం కూడా కసరత్తు జరగనుంది. దీనికి తుదిరూపం వచ్చిన తర్వాత

మిగతా 2వ పేజీలో ▶

## బంగారం రూ.40 వేల పైకి..

- దేశంలో పసిడి మెరిసిపోతోంది. అంతర్జాతీయంగా పటిష్ట ధోరణి, దేశీయంగా రూపాయి బలహీనత వంటి అంశాలు పసిడికి కలిసివస్తున్నాయి. ముంబై స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్లు 10 గ్రాముల ధర రూ.40,100 వద్దకు చేరింది. ఇది సరికొత్త గరిష్టస్థాయి.

- వివరాలు బిజినెస్‌లో

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
చదవండి... గెలవండి
25 కూపన్

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్డు రిటైల్ ధర ₹ 43 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 63 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 123 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 85 కిలో | స్కిన్‌లెస్ | 140 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది



ప్రాణహిత నదిలో నాటు పడవలో ప్రయాణిస్తున్న ఉత్తమ్ తదితరులు

# తమ్మిడిహెట్టి పట్టదా?

**ప్రభుత్వంపై టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ధ్వజం**

- కాళేశ్వరం ప్రాజెక్టు కోసం కోట్లు ఖర్చుపెడుతున్నారు
- తమ్మడిహెట్టిపై బ్యారేజీ మాత్రం నిర్మించడంలేదు
- రీ డిజైన్ పేరుతో 'ప్రాణహిత'ను విస్మరిస్తున్నారు
- తమ్మిడిహెట్టి వద్ద కాంగ్రెస్ బృందం పర్యటన
- ప్రాణహిత నదికి పూజలు, నాటు పడవలో సందర్శన
- కాళేశ్వరం టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణ.. నామినేషన్ల ప్రాతిపదికన వేల కోట్ల పనులను చేపట్టారని మండిపాటు

సాక్షి, ఆసిఫాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.80 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం.. తమ్మిడిహెట్టి వద్ద రూ.100 కోట్లు వ్యయం చేసి బ్యారేజీ ఎందుకు నిర్మించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. వాప్కోస్ సంస్థ 70 ఏళ్ల నీటి లభ్యతను లెక్కగట్టి తమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల నీటి లభ్యత ఉందని చెప్పినప్పటికీ.. రీడిజైన్ పేరుతో ప్రాణహితను పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం టెండర్లలో భారీగా అవకతవకలు జరిగాయని, నామినేషన్ల ప్రాతిపదికన వేల కోట్ల పనులు చేపట్టారని ఆరోపించారు. సోమవారం ఉత్తమ్ నేతృత్వంలోని టీపీసీసీ బృందం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తమ్మిడిహెట్టి గ్రామం వద్ద ప్రాణహిత నదిని సందర్శించింది. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో కాగజ్‌నగర్ చేరుకుని అక్కడ నుంచి రోడ్డు మార్గాన తమ్మిడిహెట్టికి వెళ్లింది. నదికి మంగళహారతి, పాలాభిషేకం, పూజ చేసిన తర్వాత నేతలంతా

మిగతా 2వ పేజీలో ▶

## 'ఎల్లంపల్లి'పై తాత్సారం ఎందుకు?

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రారంభోత్సవంపై సీఎం కేసీఆర్ ఎందుకు తాత్సారం చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ప్రశ్నించారు. రామగుండం రైల్వేస్టేషన్‌లో పార్టీ బృందానికి స్థానిక నేతలు స్వాగతం పలికిన సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో సీఎం కేసీఆర్ లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలోనే జలయజ్ఞంలో భాగంగానే ఎల్లంపల్లి పూర్తి చేశామన్నారు. ఆ తర్వాత తమ్మిడిహెట్టి వద్ద నిర్మించే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాజెక్టుగా నామకరణం చేసి పనులను ప్రతిపాదించామని గుర్తుచేశారు.

## కేంద్రానికి 1.76 లక్షల కోట్లు

**ఆర్‌బీఐ బొనాంజా!**

- కేంద్రానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2019–2020) రూ.1,76,051 కోట్ల నిధుల బదలాయింపు జరగనుంది.



ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోని కమిటీ సిఫారసులకు సెంట్రల్ బ్యాంక్ బోర్డ్ ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో తాజా నిధుల బదలాయింపు జరుగుతోంది.

- బిజినెస్‌లో



మీకు కృతజ్ఞతలు చెప్పడానికి బీజేపీ వాళ్లు క్యూ కట్టార్సార్!!



## మరో 4 రోజులు కస్టడీలోనే..

- ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో చిదంబరం కస్టడీ పొడిగించిన సీబీఐ ప్రత్యేక కోర్టు
- ఈడీ అరెస్టు నుంచి 27 వరకు రక్షణ పొడిగించిన సుప్రీం

- వివరాలు 5లో

# డెంగీ వ్యాక్సిన్‌కు నో ఎంట్రీ!

**యూరప్ సహా పలు దేశాల్లో అందుబాటులో..**

- ఇటీవలే అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం
- మన దేశంలోకి రాకుండా అడ్డుకుంటున్నదెవరు?
- కార్పొరేట్ ఆసుపత్రులు, ఫార్మా కంపెనీల గిరాకీ తగ్గుతుందనేనా?
- ఎన్నో అనుమానాలు.. మరెన్నో వివాదాలు
- వ్యాక్సిన్‌తో రెండోసారి డెంగీ రాకుండా చేయొచ్చంటున్న వైద్య నిపుణులు
- నియంత్రణ చర్యలు లేకపోవడంతో జేబులు గుల్ల చేసుకుంటున్న పేదలు




సాక్షి, హైదరాబాద్

నాలుగైదేళ్లుగా సీజన్ మారగానే దేశానికి డెంగీ జ్వరం పట్టుకుంటోంది. దేశవ్యాప్తంగా లక్షలాది డెంగీ కేసులు నమోదవుతున్నాయ్. మన రాష్ట్రంలోనూ వేల సంఖ్యలో ఆసుపత్రుల్లో చేరుతుండగా.. వందలాది మంది మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. డెంగీ జ్వరాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు, ఫార్మా కంపెనీలు పండుగ చేసుకుంటున్నాయి. అయినా దేశవ్యాప్తంగా డెంగీ నివారణకు తీసుకుంటున్న చర్యలేమీ లేవు. ఈ నేపథ్యంలో ప్రపంచంలో అనేక దేశాలు డెంగీ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినా భారత్ మాత్రం దాన్ని ప్రవేశపెట్టడానికి ముందుకు రాకపోవడంపై విమర్శలొస్తున్నాయి. కార్పొరేట్ లాబీయింగ్ వల్లే డెంగీ వ్యాక్సిన్ ఇంతవరకు భారత్‌లోకి రాలేదనే చర్చ జరుగుతోంది. అయితే.. వ్యాక్సిన్ పనితీరుపై వివాదాలు నెలకొన్నందునే భారత్ ముందడుగు వేయడం లేదని మరికొందరు వాదిస్తున్నారు.

**నాలుగున్నరేళ్లలో 5.24 లక్షల మందికి..**

ప్రపంచంలో అనేక దేశాలను డెంగీ వణికిస్తుంది. భారత్‌లో గత నాలుగేళ్లుగా డెంగీ జ్వరాలు ప్రజలను పీల్చి పిప్పిచేశాయి. కేవలం ఆయా రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేకరించిన సమాచారం మేరకు కేంద్ర ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

## ముగ్గురు కొత్త జడ్జీల ప్రమాణ స్వీకారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ దడకమళ్ల వినోద్ కుమార్, జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి, కూనూరు లక్ష్మణ్‌లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో వారితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి హైకోర్టు జడ్జీలు, న్యాయవాదులు, కొత్త జడ్జీల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం తర్వాత ముగ్గురు కొత్త న్యాయమూర్తులు సీనియర్ జడ్జీలతో కలసి ధర్మాసనంలో కేసులను విచారించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్‌తో.. జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌తో కలసి.. జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావుతో కలసి జస్టిస్ వినోద్ కుమార్ కేసులను విచారించారు.

చిత్రాలు 4లో

# ప్లాస్టిక్ చెత్తను పాతరేద్దాం..



'ఇందుగలదందు లేదన్న సందేహంబు వలదు.. తరచి చూచిన.. ప్లాస్టిక్ ఎందెందు వెదకినా అందందే గలదు'

ఇదీ ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ పరిస్థితి. మనిషికి ప్రియమైన శత్రువుగా మారిపోయిన ఈ ప్లాస్టిక్‌ను వదిలించుకునేందుకు ఇప్పుడిప్పుడే సీరియస్‌గా ప్రయత్నాలు మొదలయ్యాయి. మన ప్రధాని మోదీ సైతం తన 'మన్‌కీ బాత్'లో ప్లాస్టిక్ చెత్తను వదిలించుకోవాలని పిలుపునిచ్చారు. మరి ఈ లక్ష్యాన్ని అందుకోవాలంటే మనం ఏం చేయొచ్చు. ఇతర దేశాల్లో అమల్లో ఉన్న మంచి పద్ధతులేంటి..?

## సగం ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్

జర్మనీ, ఆస్ట్రియా, కొరియాతో పాటు బ్రిటన్‌లోని వేల్స్‌లో ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్ అత్యంత సమర్థంగా జరుగుతోంది. వాడి పడేసిన ప్లాస్టిక్‌లో కనీసం సగం మొత్తాన్ని మళ్లీ వాడుకునేలా చేస్తున్నారు. రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు తగినన్ని ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు.. నిధులు, మౌలిక సదుపాయాలు కల్పించడం ఇందుకు కారణం. ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు సంబంధించి మున్సిపాలిటీలు, పంచాయతీలు సాధించాల్సిన లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించడంతో పాటు అమలు ఆధారంగా ప్రోత్సాహకాలు ఇస్తున్నారు.



## ఈ-వేస్ట్ పనిపడతారు..

వాడేసిన స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల చెత్తను వదిలించుకునే విషయంలో స్పష్టమైన విధానాన్ని ప్రకటించిన తొలిదేశంగా కొలంబియా నిలిచింది. రెండేళ్ల కిందట ప్రకటించిన ఈ విధానం నాలుగు ప్రధాన లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను బాధ్యతాయుతంగా వాడటంపై వినియోగదారుల్లో అవగాహన కల్పించడం.. దిగుమతి చేసుకున్న లేదా దేశీయంగా ఉత్పత్తి చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలను సక్రమంగా రీసైకిల్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవడం.. జాతీయ స్థాయిలో రీసైక్లింగ్ వ్యవస్థలను బలోపేతం చేసుకోవడం.. ఇందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం చేస్తోంది. కొలంబియాలో ఏటా దాదాపు 2.5 లక్షల టన్నుల ఈ-వేస్ట్ ఉత్పత్తి అవుతోంది.

## చెత్త సేకరణకు ఆరోగ్య బీమా..

ఇండోనేసియాలో ప్లాస్టిక్ చెత్తను సేకరించే వారికి 'గార్బేజ్ క్లినికల్ ఇన్సూరెన్స్'కింద ఆరోగ్య సేవలు అందుతాయి. గమాన్ అల్బిసెయిద్ నేతృత్వంలోని 'ఇండొనేసియా మెడికా'అనే కంపెనీ ఈ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దాదాపు 600 మంది ఈ ఇన్సూరెన్స్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. రీసైకిల్ చేసేందుకు అనువైన పదార్థాలను సేకరించి తీసుకురావడం.. ప్రతిఫలంగా మలాంగ్, జకార్తాల్లోని మూడు ఆసుపత్రుల్లో ఆరోగ్య సేవలు పొందడం ఈ పథకం ప్రత్యేకత.

## సింగపూర్ ఆదర్శం..

మొత్తం 40 లక్షల మంది జనాభా మాత్రమే ఉండే సింగపూర్.. చెత్త నిర్వహణ విషయంలో ప్రపంచానికి ఆదర్శంగా ఉన్న విషయం తెలిసిందే. మండించేందుకు అవకాశమున్న చెత్తను ఇంధన ఉత్పత్తికి వాడుకోవడం.. తడిచెత్తను క్రమపద్ధతిలో ల్యాండ్‌ఫిల్స్‌లో నింపి అక్కడ పచ్చదనాన్ని పెంచే ప్రయత్నం చేయడం సింగపూర్ మోడల్‌లో చెప్పుకోదగ్గ విశేషాలు. భవన నిర్మాణ వ్యర్థాలను అత్యంత సమర్థంగా తగ్గించుకునే విషయంలో సింగపూర్ మిగిలిన దేశాల కంటే ఎంతో ముందుంది. 2005 నాటికే ఈ చిన్న దేశం 94 శాతం భవన నిర్మాణ వ్యర్థాలను రీసైకిల్ చేసేసింది.

**10,376 టన్నులు..** ఎవరూ సేకరించకుండా మిగిలిపోయే ప్లాస్టిక్ చెత్త!

**80 టన్నులు..** 2017 నాటి ఓకీ తుపాను వల్ల సముద్రంలో కలిసిన ప్లాస్టిక్

**11 కేజీలు** భారత్‌లో తలసరి ప్లాస్టిక్ వినియోగం

**80 శాతం** వస్తువులు, ఆహారాన్ని ప్యాక్ చేసేందుకు వాడే ప్లాస్టిక్

**25,940 టన్నులు..** భారత్‌లో రోజూ ఉత్పత్తి అయ్యే ప్లాస్టిక్ చెత్త..







- ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రణాళికను జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన అతికొద్ది రాష్ట్రాల్లో ఏపీ కూడా ఒకటి.
- పాల ప్యాకెట్లలో వాడే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ఒడిశాలో ఇటీవలే పాల ఏటీఎంలు మొదలయ్యాయి. క్యాన్లు, పాత్రలు తీసుకెళ్లి ఈ ఏటీఎంల నుంచి పాలు తెచ్చుకోవాల్సి ఉంటుంది.
- చెత్త సేకరించే వారు తెచ్చే ప్లాస్టిక్‌కు బదులు భోజనం పెట్టే పథకం ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్ పట్టణంలో అమలవుతోంది. కిలో ప్లాస్టిక్ చెత్తకు ఒక పూట భోజనం అందిస్తున్నారు. అరకిలో చెత్తతో బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు.
- అండమాన్ నికోబార్ దీవుల్లో పనిచేస్తున్న ఓ అటవీ అధికారి.. మొక్కల పెంపకానికి ప్లాస్టిక్ కవర్ల స్థానంలో వెదురుబొంగులు వాడటం మొదలుపెట్టారు.
- బెంగళూరులోని 6 హోటళ్లలో ఆహారం పార్సిల్ చేసేందుకు ప్లాస్టిక్ వాడట్లేదు. వినియోగదారులే పాత్రలు తీసుకెళ్లాల్సి ఉంటుంది.
- కేరళలోని కొంతమంది జాలర్లు వేట నుంచి తిరిగొచ్చేటప్పుడు చేపలతో పాటు సముద్రంలోని ప్లాస్టిక్ చెత్తను ఒడ్డుకు చేరుస్తున్నారు.
- తమిళనాడులో కొంతమంది ఔత్సాహికులు ప్లాస్టిక్ స్ట్రాలకు బదులు బొప్పాయి ఆకు కాడలను స్ట్రాలుగా వాడటం మొదలుపెట్టారు.
- జొన్న చొప్పతో ప్లాస్టిక్‌ను తయారు చేసేందుకు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం కొత్త పద్ధతిని అభివృద్ధి చేస్తోంది.
- గొంగడి పురుగులు ప్లాస్టిక్ చెత్తను ఇష్టంగా తిని జీర్ణం చేసుకోగలవని పుణేలోని డాక్టర్ రాహుల్ మూడేళ్ల కిందటే గుర్తించారు. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందమున్న ప్లాస్టిక్‌ను కొన్ని రకాల గొంగడి పురుగులు తినేయడంతో పాటు వాటి విసర్జితాలు ఎరువుగానూ ఉపయోగపడతాయని గుర్తించారు.

## క్లుప్తంగా...

### జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా లోకేష్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డీఎస్ లోకేష్‌కుమార్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దాదాపు ఏడా దిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ పదవితోపాటు జల మండలి ఇన్‌చార్జి ఎండీగా ఉన్న దానకిశోర్, ఇకపై జల మండలి ఎండీ బాధ్యతలకు మాత్రమే పరిమితం కానున్నారు. లోకేష్ కుమార్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నియమించిన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.హరీష్‌కు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

### సంగీతం, నృత్య కోర్సుల ఫలితాలు విడుదల

హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2018–19వ విద్యా సంవత్సరానికి అనుబంధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 13 ప్రభుత్వ సంగీతం, నృత్య పాఠశాలలు, కళాశాలల్లో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు వివిధ అంశాల్లో నిర్వహించిన వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ http://telugu university.ac.inలో చూడవచ్చని రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల వెల్లడించారు.

### మెడికల్ యాజమాన్య కోటాకు తుది నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాలో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం తుది విడత (మాప్ అప్ రౌండ్) నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్ (బీ, సీ) కోటా కింద సీట్ల భర్తీకి ఇప్పటికే రెండు విడతలలో కౌన్సిలింగ్ పూర్తి అయింది. మిగిలిన ఖాళీలను ఈ మాప్ అప్ రౌండ్ ద్వారా భర్తీ చేయనున్నారు. మొదటి నుంచి చివరి ర్యాంక్ వరకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28న హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ సెంటర్‌కు నిర్దేశించిన సమయాల్లో హాజరుకావాలని వర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్స్ www.knruhs.in, www.knruhs. telangana. gov.inలో చూడవచ్చని వెల్లడించాయి.

### ఈ నెల 26 నుంచి వైద్య పరీక్షలు: టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, లాంగ్వేజ్ పండిట్ పోస్టుల భర్తీకి సంబంధించి వినికిడి లోపమున్న అభ్యర్థులు ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4 వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరు కావాలని టీఎస్‌పీఎస్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. వైద్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట సదరం సర్టిఫికెట్, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, హాల్‌టికెట్, రూ. 400 ఫీజుతో హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలకు హాజరుకావాలని పేర్కొంది. వైద్య పరీక్షలకు స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత తేదీలలో హాజరు కావాలని, పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

# ..మాంద్యం ఎఫెక్ట్!

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రివర్గ ఆమోదం తీసుకోవడం, అసెంబ్లీని సమావేశపరిచి, బడ్జెట్ ప్రతిపాదించడం తదితర ప్రక్రియలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.

**రాష్ట్రంపై ఆర్థిక ఒత్తిడి తీవ్రం!**

రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరిలో రూ.లక్షా 82 వేల కోట్ల అంచనాలతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడున్న పరిస్థితులు ప్రస్తుతం లేవు. దేశంలో తీవ్ర ఆర్థిక మాంద్యం ముంచుకొస్తోందని, గత 70 ఏళ్లలో ఎన్నడూ ఇంత తీవ్రమైన ఆర్థిక మాంద్యాన్ని దేశం చూసి ఉండదని ఇప్పటికే నీతి ఆయోగ్ ప్రకటించింది. దేశ ఆర్థికాభివృద్ధి మందగించింది. అమ్మకాలు పడిపోయి ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్, స్టీల్, వస్త్ర, ఆహార తదితర రంగాల పరిశ్రమలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించడంతో వివిధ రకాల పన్నుల ద్వారా కేంద్ర, రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయం సైతం తగ్గిపోయింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో పోల్చితే.. ఇటీవల ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయించాల్సిన కేంద్ర ప్రన్నుల్లో రాష్ట్ర వాటాలో రూ.840 కోట్ల మేర కోత పడింది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. రాష్ట్ర పన్నుల ఆదాయం కొంత వరకు తగ్గింది. ఇక మిషన్‌భగీరథ పథకం రుణాలను వడ్డీతో సహా తిరిగి చెల్లించే ప్రక్రియ ఈ ఏడాది ప్రారంభం కానుండడంతో రాష్ట్రంపై మరింత భారం పడింది. దీంతో రుణాల తిరిగి చెల్లింపుకే బడ్జెట్‌లో రూ.17 వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. **భారీ కోతలు ఖాయం..** ఆర్థిక మాంద్యం ప్రభావం నేపథ్యంలో గత ఐదేళ్లుగా రాష్ట్రానికి వచ్చిన రాబడులు, బడ్జెట్ కేటాయింపులపై ప్రభుత్వం అధ్యయనం జరుపుతోంది. రాష్ట్ర ఆదాయవృద్ధి రేటు సరళిపై అంచనా వచ్చిన తర్వాతే బడ్జెట్ కేటాయింపులు చేయాలని భావిస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో పోల్చితే త్వరలో ప్రవేశపెట్టబోతున్న పూర్తి స్థాయి బడ్జెట్ కేటాయింపుల్లో భారీ కోతలు ఖాయమని తెలుస్తోంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు మాత్రం రూ.10 వేల కోట్ల వరకు ప్రత్యేకంగా కేటాయించే అవకాశముంది.

# తమ్మిడి హెట్టి పట్టదా?

▶ మొదటి పేజీ తరువాయి

నాటుపడవలో వెళ్లి నదిని పరిశీలించారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు డా.బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టారని, 16లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు 152 మీటర్ల ఎత్తుతో తమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారని వివరించారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును 148 మీటర్ల ఎత్తులో కాళేశ్వరంలో నిర్మిస్తామని చెప్పి మహారాష్ట్ర ప్రభుత్వంతో 100 మీటర్లకే ఒప్పందం చేసుకుని సంబరాలు చేసుకున్నారని విమర్శించారు. ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని దేశంలో పెద్ద పెద్ద సాగునీటి ప్రాజెక్టులు కట్టింది తమ పార్టీయేనని పేర్కొన్నారు. అయితే, కాళేశ్వరంతో పాటు ప్రాణహితపై కూడా బ్యారేజీ నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాలకు తక్కువ ఖర్చుతో సాగు, తాగు నీరందించవచ్చని వివరించారు. కేవలం 15 మీటర్ల ఎత్తులో ఒక లిఫ్ట్ ఏర్పాటు చేసి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతి చుక్కకు అధిక వ్యయం చేస్తున్నారని దుయ్యబట్టారు. భారీ వ్యయంతో కాళేశ్వరాన్ని నిర్మిస్తున్న ప్రభుత్వం.. తక్కువ ఖర్చుతో ఒకేసారి మూలధనంతో నిర్మించే ప్రాణహితను మాత్రం విస్మరిస్తోందని విమర్శించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చాక తమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తామని ఉత్తమ్ వెల్లడించారు.

**ఒక్క ఎకరానికైనా నీరిచ్చారా?: భట్టి**

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మండిపడ్డారు. 20 శాతం పనులు మాత్రమే పూర్తి చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిచేసినట్టు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు సాగునీరిస్తామని చెప్పి, ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎంపీ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగునీటి పేరుతో సీఎం కేసీఆర్ మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం నీళ్ల కోసమే వచ్చిందని, ఇందు కోసం ఎంతోమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. బీజేపీ, టీఆర్‌ఎస్ ఆడుతున్న నాటకాలకు తెలంగాణ ప్రజలు బలవుతున్నారని ఆరోపించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రాణహిత బదులు వార్ధా నదిపై బ్యారేజీ కడతామని చెబుతున్నారని విమర్శించారు. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే కాళేశ్వరం వద్ద నీటి లభ్యత ఉండదని సీఎం కేసీఆర్‌కు తెలుసన్నారు. ప్రాజెక్టుల విషయంలో బీజేపీ, టీఆర్‌ఎస్ రెండింటి తీరు ఒకేలా ఉందని దుయ్యబట్టారు. ఈ పర్యటనలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, పార్టీ సీనియర్ నేతలు జానారెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్ అలీ, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీలు వీహెచ్, బలరాం నాయక్, పొన్నం ప్రభాకర్, రమేశ్ రాథోడ్, చిన్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# నక్సలిజాన్ని నియంత్రించగలిగాం

## హోంమంత్రి మహమూద్ అలీ

సాక్షి, న్యూఢిల్లీ: టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి పథకాల ద్వారా రాష్ట్రంలో నక్సలిజాన్ని నియంత్రించగలిగినట్లు రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. వామపక్ష తీవ్రవాద ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో గతంలో కంటే ఎక్కువగా రోడ్ల అభివృద్ధి, అధిక సంఖ్యలో పోలీసు నియామకాలు జరిగాయని చెప్పారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన 'నక్సల్ ప్రభావిత ప్రాంతాలు-శాంతి భద్రతలు'అంశంపై సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ తరపున హోంమంత్రి మహమూద్ అలీ హాజరయ్యారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటివరకు 100 మీటర్ల బ్రిడ్జీలను కేంద్రం కేటాయించిందని, వీటిని 800 మీటర్లకు పెంచాలని కోరినట్లు తెలిపారు. కొత్త రహదారుల నిర్మాణం విషయంలో 5.5 మీటర్ల వెడల్పును 7.5 మీటర్లకు పెంచాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 3 కంపెనీల బలగాలు కశ్మీర్ భద్రతకు వెళ్లాయని, వీటికి అదనంగా రాష్ట్రానికి 3 కంపెనీల బలగాలను కేటాయించాలని కోరగా.. అమిత్ షా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.




# జాబిల్లి సిత్రాలు

సూళ్లూరుపేట: చంద్రయాన్– 2 మిషన్‌లో భాగంగా ఆర్బిటర్‌కు అమర్చిన టెరియన్ మ్యాపింగ్ కెమెరా (టీఎంసీ– 2) మరోమారు చంద్రుడిని ఫొటోలు తీసింది. సోమవారం వాటిని ఇస్రో విడుదల చేసింది. ఈ నెల 23న బెంగళూరు సమీపంలోని బైలాలు భూ నియంత్రణ కేంద్రం నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. చంద్రుడికి దగ్గరగా 109 కిలోమీటర్లు, దూరంగా 4,375 కిలోమీటర్లు దీర్ఘ చతురస్రాకారంలో పరిభ్రమిస్తూ ఉత్తర వైపు ధ్రువంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ చిత్రాలను తీసింది. చంద్రయాన్ –2 మిషన్‌లో ల్యాండర్‌ను అమర్చిన ఉపకరణాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని ఇస్రో ప్రకటించింది. ఈ నెల 28న ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోయే ప్రక్రియను చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారు.

# డెంగీ వ్యాక్సిన్‌కు నో ఎంట్రీ!

▶ మొదటి పేజీ తరువాయి

డెంగీ కేసులను లెక్కగట్టగా.. ఒక్క 2015లోనే దేశంలో లక్ష మందికి డెంగీ సోకింది. అందులో 220 మంది చనిపోయారు. 2016లో 1.26 లక్షల మందికి డెంగీ జ్వరం రాగా.. ఇందులో 245 మంది చనిపోయారు. 2017లో 1.88 లక్షల మందికి డెంగీ రాగా, అందులో 325 మంది చనిపోయారు. 2018లో 1.01 లక్షల మంది బాధితుల్లో.. 172 మంది చనిపోయారు. ఈ ఏడాది ఇప్పటివరకు దేశంలో 5,504 మందికి డెంగీ రాగా ఐదుగురు చనిపోయినట్లు తేల్చారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 967మంది చనిపోయారు. తెలంగాణలో ఈ నాలుగున్నరేళ్ల కాలంలో 17,476 మందికి డెంగీ సోకగా.. 8 మంది మాత్రమే చనిపోయినట్లు కేంద్ర నివేదికలో పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదయ్యే డెంగీ కేసులను మాత్రమే కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. ప్రైవేటుతో కలిపితే ఈ సంఖ్య ఏకంగా 5రెట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో డెంగీ కేసులు నమోదవుతుంటే వ్యాక్సిన్‌పై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.



**వ్యాక్సిన్‌తో డెంగీకి చెక్!**

'డెంగ్వాక్సియా'అనే వ్యాక్సిన్ 2016లోనే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో అందుబాటులోకి వచ్చింది. అయితే అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) మాత్రం ఈ ఏడాది మాత్రమే ఈ వ్యాక్సిన్‌కు ఆమోదం తెలిపింది. అలాగే గతేడాది చివర్లో యూరోపియన్ కమిషన్ కూడా.. యూరప్‌లోని డెంగీ ప్రభావిత ప్రాంతాలలో ఈ టీకా వాడేందుకు అనుమతిచ్చింది. మరో 19 దేశాలలో ఈ వ్యాక్సిన్‌కు పచ్చజెండా ఊపారు. తాజాగా లాటిన్ అమెరికా సహా ఆసియాలోని 10 దేశాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఈ వ్యాక్సిన్‌ను వాడేందుకు కొన్ని రకాల పరిమితులున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన నిపుణులు 'డెంగ్వాక్సియా వ్యాక్సిన్'ను గతంలో ఓసారి డెంగీకి గురైన వ్యక్తులకు మాత్రమే ఇవ్వాలని సూచిస్తున్నారు. అలా చేయడం ద్వారా మరోసారి వారికి డెంగీ రాదని చెబుతున్నారు. గతంలో కనీసం ఒక డెంగీ ఇన్ఫెక్షన్ సోకిన 9–45 ఏళ్ల మధ్య వయసున్న వారికి మాత్రమే ఈ వ్యాక్సిన్ వాడేందుకు అనుమతుంది. అంటే డెంగీ లేని కొత్త వ్యక్తులకు ఈ వ్యాక్సిన్ ఇవ్వకూడదని ఎఫ్‌డీఏ స్పష్టం చేసింది.

**కార్పొరేట్ లాబీని తలొగ్గేనా?**

లక్షలాది మందికి ఇప్పటికే ఓసారి సోకినప్పటికీ మన దేశంలో ఈ వ్యాక్సిన్‌ను ఎందుకు ప్రవేశపెట్టడంలేదన్న చర్చ జరుగుతోంది. వ్యాక్సిన్‌కు అనుమతిస్తే డెంగీ ద్వారా వచ్చే వ్యాపారమంతా పోతుందన్న భావనలో కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు, ఫార్మా కంపెనీలు వ్యక్తం చేసినట్లు వైద్య నిపుణులు విమర్శిస్తున్నారు. దేశంలో వ్యాక్సిన్ లేకపోవడం వల్ల లక్షలాది మంది నుంచి కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు వందల కోట్ల రూపాయలను దోచుకుంటుండగా.. ఫార్మా కంపెనీలూ అదేస్థాయిలో బిజినెస్ చేస్తున్నాయి.

**తెలంగాణలో నాలుగున్నరేళ్లలో సోకిన డెంగీ జ్వరాలు (అధికారిక లెక్కలు)**

| సంవత్సరం | కేసుల సంఖ్య |
|---|---|
| 2015 | 1,831 |
| 2016 | 4,037 |
| 2017 | 5,369 |
| 2018 | 4,592 |
| 2019 | 1,647 |
| మొత్తం | 17,476 |

### భారత్‌లో వ్యాక్సిన్ ట్రయల్స్‌లో ఉంది

డెంగీ వ్యాక్సిన్ ప్రస్తుతం మన దేశంలో నాలుగో దశ ట్రయల్స్‌లో ఉంది. ఎఫ్‌డీఏ అనుమతి వచ్చినందున నాలుగో దశ ట్రయల్ తర్వాత ఇది ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. దీనిపై ప్రభుత్వం నుంచి పూర్తి సమాచారం రావాల్సి ఉంది.
*– డాక్టర్ సందీప్‌రెడ్డి, సన్‌షైన్ ఆసుపత్రి, హైదరాబాద్.*

### మధ్య వయస్కుల వారికే ప్రయోజనం

డెంగీ వ్యాక్సిన్‌పై కొన్ని వివాదాలున్నాయి. ఒకసారి డెంగీ జ్వరం వచ్చిన వారికి మాత్రమే ఈ వ్యాక్సిన్‌ను వేయాలన్న షరతుంది. వారికి మరోసారి రాకుండా మాత్రమే వ్యాక్సిన్ ఉపయోగపడుతుంది. కొత్తవారికి మాత్రం ఈ వ్యాక్సిన్‌తో ప్రయోజనం లేదు.
*– డాక్టర్ రవీంద్రనాథ్, యలమంచిలి పాలీ క్లినిక్, ఖమ్మం.*

### ఫ్లూ వ్యాక్సిన్ మాత్రమే ఉంది

ప్రస్తుతం దేశంలో డెంగీ వ్యాక్సిన్ అందుబాటులో లేదు. దాని ప్రవేశానికి తీసుకుంటున్న చర్యల గురించి తెలియదు. ప్రస్తుతం కేవలం ఫ్లూ రాకుండా వ్యాక్సిన్ మాత్రమే అందుబాటులో ఉంది. *– డాక్టర్ శ్రీనివాసరావు, సంచాలకులు, ప్రజారోగ్యం, తెలంగాణ ప్రభుత్వం*

# కాలుష్య 'గండం'

**రామగుండంకు పొంచి ఉన్న ముప్పు**
- కాలుష్యంలో దేశంలో ఆరోస్థానం
- బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలే కారణమని నిర్ధారించిన నాసా
- ప్రమాదకర స్థాయిలో ఎస్‌ఓటూ విడుదల చేస్తున్నట్లు గుర్తింపు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు
- 2022 వరకు నియంత్రించాలని విద్యుత్ సంస్థలకు కేంద్రం ఆదేశాలు

**గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లాలోని పారిశ్రామిక నగరం రామగుండం కాలుష్య గుండంగా మారుతోంది. స్థానికంగా ఉన్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువులతో వాతావరణం పూర్తిగా కలుషితమవుతోంది. ఈ కారణంగానే ఏటా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రమాదకర ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలుతాయని, మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామగుండం అత్యంత ప్రమాదకర కాలుష్య నగరాల్లో దేశంలో ఆరో స్థానంలో నిలిచింది. వాతావరణ కాలుష్యంపై నాసా విశ్లేషించిన నివేదిక ఆధారంగా గ్రీన్‌పీస్ సంస్థ దేశంలోని ఆరు ప్రాంతాల్లో వాతావరణం అత్యంత ప్రమాదకరంగా మారిందని నిర్ధారించింది. సల్ఫర్ వాతావరణంలోకి అత్యంత ప్రమాదకర స్థాయిలో విడుదలవుతోందని గుర్తించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆయా ప్రాంతాల్లో జీవరాశి మనుగడ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

**బొగ్గు మండించడంతో..**
దేశంలోని సింగ్రౌలి, తాల్చేర్, జర్సిగూడ, చెన్నై, విశాఖపట్నం, రామగుండం ప్రాంతాల్లో గాలిలో అత్యంత ప్రమాదకర స్థాయిలో సల్ఫర్ డై ఆక్సైడ్ వాయువు కలుస్తోందని నాసా విశ్లేషించినట్లు జాతీయ గ్రీన్‌పీస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సాధారణంగా గాలిలో సల్ఫర్ శాతం 80లోపే ఉండాలని, పైన తెలిపిన ప్రాంతాల్లో 150 నుంచి 500 వరకు ఉన్నాయని పేర్కొంది. ఇది మానవ మనుగడకు అత్యంత ప్రమాదకరమని తెలిపింది. కాలుష్యకారక ప్రాంతాలన్నింటిలో బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఉండటం మూలంగానే సల్ఫర్‌డై ఆక్సైడ్ (ఎస్‌ఓటూ) వాయువు ప్రమాదకర స్థాయిలో వాతావరణంలో కలుస్తుందని పేర్కొంది. బొగ్గును మండించడం ద్వారానే విషవాయువు విడుదలవుతుందని నిర్ధారించింది.

**పారిశ్రామిక ప్రాంతంలో..**
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని థర్మల్‌విద్యుత్ కేంద్రాలు, పాలకుర్తిలోని సిమెంట్ కర్మాగారంలో నిత్యం బొగ్గును మండిస్తున్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అత్యధికంగా బొగ్గును మండించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. వీటి ద్వారానే ఎస్‌ఓటూ వాయువు గాలిలో కలుస్తోందని గుర్తించినట్లు గ్రీన్‌పీస్ నివేదించింది. వీలైనంత త్వరగా ప్రమాదకర ఎస్‌ఓటూ నియంత్రించాలని సూచించింది. ప్రమాదకర ఆరు కాలుష్య ప్రాంతాల్లో చెన్నై నగరం ఎస్‌ఓటూ నియంత్రణకు వేగంగా చర్యలు చేపడుతున్నట్లు గ్రీన్‌పీస్ సంస్థ నిర్ధారించింది.


రామగుండంలోని బి-థర్మల్ విద్యుత్ కేంద్రం

**క్రానిక్ బ్రాంకైటిస్ వచ్చే ప్రమాదం**

బొగ్గు మండించడం ద్వారా వచ్చే సల్ఫర్, నైట్రేట్, కార్బన్‌డైఆక్సైడ్ గాలిలో కలవడం మూలంగా బ్రాంకై టీస్, క్రానిక్ బ్రాంకై టిస్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. శ్వాసకోస సంబంధ వ్యాధులు తలెత్తే ప్రమాదం ఉంది. ముక్కు నుంచి ఊపిరితిత్తుల మధ్యలో ఉండే శ్వాస నాళాలపై ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉంది. – బి.రామ్మోహన్, ఫిజీషియన్

**నియంత్రణ ఇలా..**
గాలిలో ఎస్‌ఓటూ నియంత్రణకు వెంటనే దానిని డయల్యూట్ చేసే చర్యలు తీసుకోవాలని గ్రీన్‌పీస్ సూచించింది. దీని కోసం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఎక్కువగా విషవాయువులు వదులుతున్న పరిశ్రమలు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. దీనికోసం ఎఫ్‌జీడీ (ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్) ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ప్రమాదకర స్థాయిలో విషవాయువులు ఉన్నందున 2022 నాటికి మరింత ప్రమాదకరంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేసింది.

**ఊపిరితిత్తులపై ప్రభావం**
గాలిలోని ఎస్‌ఓటూ వాయువు జీవుల ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మనం పీల్చే గాలిలో ఇది 80 వరకు ఉంటే ఎలాంటి హాని ఉండదని అంతకు మించి ఉంటే ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధుల వస్తాయని హెచ్చరిస్తున్నారు. బొగ్గు, ప్లాస్టిక్ మండించడం ద్వారా ఎస్‌ఓటూ(సల్ఫర్) వాయువు గాలిలో కలుస్తుందని పేర్కొంటున్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో దీని పరిమాణం గాలిలో 157 వరకు ఉండటం ఆందోళనకరమే అని పేర్కొంటున్నారు.

**దేశంలోనే ప్రమాదకర ప్రాంతాలు**

| | |
|---|---|
| సింగ్రౌలి | 507 |
| తాల్చేర్ | 347 |
| జర్సిగూడ | 201 |
| చెన్నై | 215 |
| విశాఖపట్నం | 171 |
| రామగుండం | 157 |

**గడిచిన ఆరేళ్లలో రామగుండంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు**

| | | |
|---|---|---|
| 2013 | – | 46.8 |
| 2014 | – | 45.0 |
| 2015 | – | 46.8 |
| 2016 | – | 46.6 |
| 2017 | – | 46.0 |
| 2018 | – | 44.4 |
| 2019 | – | 47.2 |

# ప్రసాద తయారీ యంత్రాలు

**యాద్రాద్రిలో లడ్డూ, పులిహోర వాటితోనే.. రోజూ లక్ష లడ్డూలు**

**యాదగిరికొండ:** యాదాద్రికి లడ్డూ ప్రసాదాల తయారీ యంత్రాలు చేరుకున్నాయి. రాబోయే రోజుల్లో యాదాద్రికి ఎంతమంది భక్తులొచ్చినా లడ్డూ, పులిహోర ప్రసాదాల కొరత లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నాలుగంతస్తుల భవనం నిర్మించారు. అందులోని కింది అంతస్తులో శనగపప్పును గ్రైండింగ్ చేస్తారు. ఇక్కడ పెద్ద పెద్ద గ్రైండర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కోటి సుమారు 500 కేజీల పప్పును రుబ్బుతుంది. రెండో అంతస్తులో సుమారు 1,500 కేజీల నెయ్యిని కరగబెట్టేందుకు ప్రత్యేక బాయిలర్లు ఉంటాయి. అక్కడ బూంది, నెయ్యిని ఒక్కటిగా చేసే ప్రత్యేక తయారీ విభాగం ఉంటుంది. మూడో అంతస్తులో లడ్డూల తయారీ విభాగం ఉంటుంది. కింద భవనాల్లో తయారుచేసిన బూంది, నెయ్యి వస్తువులను కలిపిన మిశ్రమాన్ని ముద్దగా చేసి నాలుగో అంతస్తుకు తరలిస్తారు. అక్కడ లడ్డూ తయారీ, ప్యాకింగ్ జరుగుతుంటుంది. కింది అంతస్తు నుంచి పై అంతస్తు వరకు యంత్రాలే పనిచేస్తాయి.


లడ్డూ ప్రసాద తయారీ యంత్రం

**నిర్మాణంలో ఇతర దేశాల టెక్నాలజీ**
నాలుగు అంతస్తులున్న ప్రసాదాల భవనంలోని ప్రతి నిర్మాణం జర్మనీ, ఇతర దేశాల టెక్నాలజీతో చేపడుతున్నట్లు కూలీలు తెలిపారు. కింద ఉన్న ఫ్లోరింగ్ పూర్తిగా జర్మనీ టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. విద్యుత్, ఫ్లోరింగ్‌కే రూ.పది కోట్లు కేటాయించారు.

**రోజూ లక్ష లడ్డూల తయారీ**
యాదాద్రిలో లడ్డూ ప్రసాదాల విక్రయం లక్షల్లో ఉంటుంది. ఈ యంత్రాలతో రోజూ లక్ష లడ్డూలను సునాయసంగా తయారు చేయొచ్చని అధికారులు తెలిపారు.

**నాలుగు కౌంటర్లు**
పై అంతస్తులో సుమారు నాలుగు ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి శని ఆదివారాలలో వచ్చే భక్తులకు ప్రసాదాల కొనుగోలులో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నాలుగు టికెట్ కౌంటర్లు, నాలుగు ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. లడ్డూ పులిహోర ప్రసాదాల ట్రేలను యంత్రాలు తీసుకెళుతాయి.

**తిరుపతిలో కూడా లేదు..**
యంత్రాలతో ప్రసాదాలను తయారుచేసే పద్ధతి యాదాద్రిలోనే మొదటిది కావడం విశేషం. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లో కూడా లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ దేవాలయంలో కూడా లేకపోవడం గమనార్హం.

# ఇంటికి ఆరు మొక్కలు

**హరితహారం సక్సెస్ కోసం కలెక్టర్ వినూత్న ఆలోచన**

**సాక్షి, జనగామ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జనగామ జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి వినూత్న ఆలోచన చేశారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేసి వాటిని నాటించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మొక్కలు నాటిన ఇంటికి 'నేను ఆరు మొక్కలు నాటాను'అనే స్టిక్కర్ అంటిస్తారు. అలాగే గ్రామంలో ఎన్ని ఇళ్లలో మొక్కలు నాటారనే వివరాలను తెలిసేలా పంచాయతీ కార్యాలయం దగ్గర ప్రత్యేకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయనున్నారు. మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసి నర్సరీల నుంచి గ్రామాలకు మొక్కలను తరలించడానికి సన్నాహాలు ప్రారంభించారు. మొక్కలు నాటిన తర్వాత అధికారులతో తనిఖీలు నిర్వహిస్తారు. ఇందుకుగాను గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీ పరిధిలో జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయనున్నారు.



క్యాంపు కార్యాలయం ఎదుట స్టిక్కర్

**కలెక్టర్‌తోనే మొదలు**
ఇంటికి ఆరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తనతోనే ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆరు మొక్కలు నాటిన అనంతరం కార్యాలయం ఎదుట 'నేను ఆరు మొక్కలను నాటాను.. హరిత తెలంగాణ ఉద్యమంలో భాగస్వామినయ్యాను'అని రాసి ఉన్న స్టిక్కర్ అంటించారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**క్లుప్తంగా...**

## నేడు ఎయిమ్స్ కళాశాల ప్రారంభం

**బీబీనగర్:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రంగాపురం గ్రామ పరిధిలో గల నిమ్స్ భవనంలో ఏర్పాటు చేసిన ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్)ను మంగళవారం ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు భోపాల్ ఎయిమ్స్ డైరెక్టర్ శర్వాసింగ్ కళాశాలను ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా పగలు రాత్రి తేడా లేకుండా భవనంలో పనులను కొనసాగించారు. వసతి గృహాల్లో ఫర్నిచర్‌తో పాటు తరగతి గదుల్లో బోధన సామగ్రి, కాన్ఫరెన్స్ హాల్‌లో కుర్చీలు, క్యాంటిన్‌లో వంట సామగ్రి సమకూర్చారు. వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేకమైన వంట మనుషులను ఏర్పాటు చేశారు. ఏ బ్లాక్‌లోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ, కమ్యూనిటీ ఫ్యామిలీ మెడిసిన్, మ్యూజియం, లైబ్రరీ, రిసర్చ్ ల్యాబోరేటరీ తదితర విభాగాలను ఏర్పాటు చేశారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో అడ్మిషన్ పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులు సోమవారం కళాశాలలో చేరారు.

## 30 ఏళ్ల తర్వాత పాస్‌బుక్

**వేములవాడరూరల్:** దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ వ్యక్తికి పట్టాదారు పాసుపుస్తకం లభించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన సోమినేని నర్సయ్యకు ఈ అనుభవం ఎదురైంది. గ్రామంలోని సర్వేనంబర్ 177/బి గల భూమిలో సోమినేని బాలయ్యకు 2.29 ఎకరాలు ఉంది. బాలయ్య ముగ్గురు కుమారులు ఆ భూమిని తమ పేరిట విరాసత్ చేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు, చిన్నకుమారుడు కొంతకాలం క్రితం మృతి చెందారు. రెండో కుమారుడు సోమినేని నర్సయ్య.. తనతండ్రి ద్వారా వచ్చే ఆస్తి 36 గుంటలు తన పేరిట పట్టా చేయాలని రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నాడు. అయినా వారు పట్టించుకోలేదు. దాదాపు 30ఏళ్ల తర్వాత.. ఇటీవల గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. నర్సయ్య తన బాధను అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. తండ్రి పేరిట ఉన్న రికార్డులు పరిశీలించిన అధికారులు.. గ్రామస్తుల సమక్షంలో విచారణ జరిపారు. తహసీల్దార్ మునీందర్.. బాలయ్య కుమారుడు నర్సయ్యకు చెందాల్సిన 36 గుంటల స్థలాన్ని విరాసత్ చేశారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన పాస్‌బుక్‌ను సోమవారం నర్సయ్యకు అందజేశారు.

## తెలంగాణ విజయగాథ పుస్తకావిష్కరణ

**ఖమ్మం సహకారనగర్:** తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ రచించిన 'తెలంగాణ విజయగాథ'పుస్తకాన్ని ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో సాధించిన పురోగతిని తెలంగాణ ప్రజలకు అక్షర క్రమంలో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో సాగునీటి రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు.

# మృత్యుంజయుడు

- మరో ట్రాక్‌పైకి వెళుతుండగా దూసుకొచ్చిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- రెప్పపాటులో రైలు ఇంజన్ కింద దూరిన కీమెన్ దుర్గయ్య
- చావు నోట్లోకెళ్లి బయటపడిన వైనం



**రామగుండం:** నిజంగా ఈ కీమెన్ మృత్యువును జయించాడు. గూడ్సు రైలు వస్తుందని ఒక రైల్వే ట్రాక్‌పై నుంచి మరో ట్రాక్‌పైకి వెళ్లడం.. అంతలోనే అటువైపు నుంచి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అతనిపైకి దూసుకురావడం.. క్షణాల్లో అతను రైలు ఇంజన్ కిందికి దూరిపోవడం.. అయ్యో.. నుజ్జునుజ్జయి ఉంటాడని ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారంతా ఆందోళన చెందడం.. ఇంతలోనే చావు నోట్లోకెళ్లి ప్రాణాలతో బయటపడటం.. ఇదంతా చూస్తుంటే ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది కదూ.. ఔను, ఈ కీమెన్ మృత్యు కోరల్లోకెళ్లి ప్రాణ గండం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటన సోమవారం పెద్దపల్లి జిల్లా రామగుండం రైల్వే స్టేషన్ సమీపంలోని కుందనపల్లి రైల్వేగేటు వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కుందనపల్లి రైల్వేగేటు వద్ద కీమెన్ కత్తుల దుర్గయ్యతోపాటు మరికొంత మంది కార్మికులు రైల్వే ట్రాక్ నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు. మూడు రైల్వే ట్రాకుల్లో ఒక ట్రాక్‌పై పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా గూడ్సు రైలు వస్తుండటంతో మరో ట్రాక్ మీదకు కార్మికులు చేరుకున్నారు. అప్పటికే అతి దగ్గరలో ఉన్న రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ క్షణాల్లో కీమెన్ దుర్గయ్యపై దూసుకొచ్చింది. అప్రమత్తమైన ఆయన ఇంజిన్ కిందకు దూరిపోయాడు. రెండు బోగీలు అతని పైనుంచి వెళ్లాయి. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారు భయాందోళన చెందారు. రైలు కో పైలెట్ చాకచక్యంగా వ్యవహరించాడు. సడెన్ బ్రేక్ వేసి రైలును కొద్ది దూరంలో నిలిపివేశాడు. అప్పటికే కీమెన్ పైనుంచి రెండు బోగీలు వెళ్లడంతో బాధితుడు నుజ్జునుజ్జు అయి ఉంటాడని అందరూ భావించారు. కానీ దుర్గయ్య పట్టాల మధ్యలో ప్రాణాలు బిగపట్టుకొని పడుకుని ఉన్నాడు. ఎడమ కాలి ఎముక విరిగి ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అతడిని రైలు కింద నుంచి బయటకు లాగి హుటాహుటిన స్థానిక రైల్వే ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దుర్గయ్యకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.


దుర్గయ్యను రైలు కింది నుంచి బయటికి లాగుతున్న దృశ్యం

# ప్రీపెయిడ్ మీటర్లు వచ్చేశాయ్!

**దశల వారీగా అన్ని కేటగిరీ కనెక్షన్లు బిగింపు**
- ఎన్‌పీడీసీఎల్ పరిధిలో పూర్వ ఐదు జిల్లాల్లో అమలు
- బకాయిలను నిలువరించేందుకు సరికొత్త వ్యూహం

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** రోజురోజుకు బకాయిలు పెరిగిపోయి విద్యుత్ సరఫరా భారంగా మారుతున్న తరుణంలో ప్రభుత్వం ప్రీ పెయిడ్ మీటర్ల వైపు మొగ్గు చూపుతోంది. దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమల్లో చేయాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎన్‌పీడీసీఎల్) పరిధిలో మైనర్ పంచాయతీల్లో రూ.789.59 కోట్ల మేరకు బకాయిలు పేరుకుపోయాయి. మేజర్ పంచాయతీలలో రూ.271.47 కోట్లు, మున్సిపాలిటీల్లో రూ.115.15 కోట్లు, ఐ అండ్ క్యాడ్ రూ.342.58 కోట్లు.. పాత వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.2,960.45 కోట్ల మేరకు బిల్లులు రావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి విద్యుత్ బకాయిలు పేరుకుపోతుండటంతో బకాయిల భారాన్ని తగ్గించుకునేందుకు విద్యుత్ శాఖ ప్రీపెయిడ్ మీటర్లను బిగించాలని నిర్ణయించింది. తొలివిడత ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని బిగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వాటి ద్వారా విద్యుత్ సరఫరా చేయనున్నారు.

**తొలివిడతగా 20,244 మీటర్లు**
తొలి తొలివిడతగా ఎన్‌పీడీసీఎల్ వరంగల్ పరిధిలోని పూర్వ ఐదు జిల్లాలకు 20,244 మీటర్లను అధికారులు సరఫరా చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా మీటర్ల బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ విధానం అమలైతే ఇక నుంచి అవసరం మేరకు విద్యుత్‌ను ముందుగానే కొనుక్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లు రీచార్జి చేసుకున్నట్లే మీటర్లలో చిప్ ఏర్పాటు చేస్తారు. ఎన్ని యూనిట్లు అవసరం ఉంటే.. ఆ మేరకు రీచార్జి కార్డును కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల నెలనెలా బిల్లులు బకాయిలు.. వసూళ్లకు ఇబ్బంది పడే పరిస్థితి నుంచి విద్యుత్‌శాఖ బయటపడుతుంది. ఈ ఫార్ములా ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వృథా, బకాయిలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న ప్రీపెయిడ్ మీటర్లను విద్యుత్ పంపిణీ సంస్థ తెరపైకి తీసుకొచ్చింది. కాగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రీ పెయిడ్ విద్యుత్ మీటర్లను వినియోగంలోకి తెస్తామని ఎన్‌పీడీసీఎల్ వరంగల్ కార్పొరేట్ కార్యాలయానికి చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు.


ప్రీపెయిడ్ మీటరు

**ఏ జిల్లాలో ఎన్ని (పూర్వ జిల్లాల వారీగా)**

| జిల్లా | బిగించాల్సిన మీటర్లు | ఇప్పటి వరకు బిగించినవి | ఇంకా బిగించాల్సినవి |
|---|---|---|---|
| వరంగల్ | 1,738 | 1,271 | 467 |
| కరీంనగర్ | 5,899 | 2545 | 3,354 |
| ఖమ్మం | 3,194 | 2,406 | 788 |
| ఆదిలాబాద్ | 5,405 | 2,057 | 3,348 |
| నిజామాబాద్ | 4,008 | 2,684 | 1,324 |
| | 20,244 | 10,963 | 9,281 |

# నిరుద్యోగులపై 'కెనడా' వల

- ఉపాధి పేరిట నిరుద్యోగులను దోచుకున్న ఏజెంట్లు
- ఒక్కొక్కరి వద్ద రూ. 3 లక్షల నుంచి 4 లక్షలు వసూళ్లు

**మోర్తాడ్ (బాల్కొండ):** కెనడా దేశంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిరుద్యోగులకు ఆశ చూపిన ఏజెంట్లు అందినకాడికి దండుకుని మొండి చేయి చూపిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మార్కెట్‌లో బ్రూనే డాలర్ ధర ఎక్కువగా ఉండటంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించుకోవాలనే ఉద్దేశంతో నిరుద్యోగులు మోసగాళ్లు పన్నిన కుట్రకు బలయ్యారు. కెనడా వీసా కోసం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించిన నిరుద్యోగులు ఆ వీసాల కోసం ఏజెంట్ల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. చివరకు తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. హైదరాబాద్‌తో పాటు చెన్నై కేంద్రంగా సాగిన కెనడా వీసాల రాకెట్‌లో తెలంగాణ జిల్లాలకు చెందిన దాదాపు 150 మంది నిరుద్యోగులు మోసపోయారు. ఇందులో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి చెందిన నర్సయ్య చెన్నై ఏజెంటుపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కెనడా వీసాల అక్రమాల రాకెట్ వెలుగులోకి వచ్చింది. గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ఒక వేళ ఉపాధి లభించినా గతంలో కంటే తక్కువ వేతనాలు అందడంతో గల్ఫ్ దేశాలకు ప్రత్యామ్నాయంగా ఇతర దేశాల్లో ఉపాధి కోసం నిరుద్యోగులు మొగ్గు చూపుతున్నారు. నిరుద్యోగుల అవసరాన్ని గుర్తించిన ఏజెంట్లు కెనడాలో ఉపాధి ఆశ చూపి వీసాల పేరిట భారీ మొత్తంలో నొక్కేశారు. కెనడా వీసాలు ఇస్తామని నిరుద్యోగుల నుంచి మోసగాళ్లు కాజేసిన మొత్తం రూ.4.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**థాయిలాండ్ జైలులో మనవారు**
కెనడాకు మన దేశం నుంచి నేరుగా పంపిస్తే ఇమిగ్రేషన్ సమస్యలు తలెత్తుతాయని నమ్మించిన ఏజెంట్లు థాయిలాండ్‌లో ఇమిగ్రేషన్ చేయించుకోవాల్సి ఉందని సూచించారు. అక్కడ ఇమిగ్రేషన్ నిబంధనలు కఠినం కావడం మనోళ్ల వద్ద సరైన ధ్రువపత్రాలు లేక పోవడంతో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన 8 మంది నిరుద్యోగులను మూడు నెలల కింద థాయిలాండ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరికి ఏడాది వరకు జైలు శిక్షను థాయిలాండ్ కోర్టు విధించినట్లు తెలిసింది. వీరిని థాయిలాండ్‌లోని సముత్ పర్కాన్ జైలులో బందీగా ఉంచారు.



# డ్రోన్‌తో పిచికారి

**దేవరుప్పుల:** సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం వల్ల రైతులకు పంటల సాగులో శ్రమ, సమయం, ఆర్థిక భారం లాంటివి తగ్గించేందుకు డ్రోన్‌ను తయారు చేశాడు జనగామ జిల్లా నీర్మాల గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి. అమెరికాలో క్రిస్టాల్‌బాల్ సంస్థలో ఇంజనీర్ డిజైన్ మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పత్తి, మిర్చి వంటి పంటలపై డ్రోన్‌లను ప్రదర్శించేందుకు ఆ కంపెనీ తరపున కోఆర్డినేటర్‌గా సందీప్‌రెడ్డి బృందం ఇక్కడికి వచ్చింది. సోమవారం నీర్మాల గ్రామంలో పత్తి చేలను చిన్న డ్రోన్‌తో పరిశీలించింది. తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు ఎక్కడ.. ఎంత మోతాదులో క్రిమిసంహారక మందు పిచికారి చేయాలనే విషయమై డిజైన్ రూపొందించి ప్రయోగించింది.

తెలంగాణ ప్రభుత్వం
**సాగునీటి పారుదల వలయము, నిర్మల్, నిర్మల్ జిల్లా**
**టెండరు ప్రకటన**
టెండరు నోటీసు నంబర్లు 11/2019-20, 12/2019-20, తేది: 21-08-2019 లభ్యమగు తేది: 22-08-2019 నుండి 29-08-2019 వరకు మరియు 13/2019-20, 14/2019-20, 15/2019-20 మరియు 16/2019-20, తేది:21-08-2019 పనులకు గాను రూ.552.59 లక్షలకు లభ్యమగు తేది:23-08-2019 నుండి 06-09-2019 వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ https://tender.telangana.gov.inలో చూడగలరు. పర్యవేక్షక అభియంత, సాగునీటి పారుదల వలయము, నిర్మల్.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, నిర్మల్
DIPR Ro.No.328-PP/CL/Advt/1/2019-20, Dt:26-08-2019

తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజినీర్, PR సర్కిల్, ఖమ్మం**
**సవరణ**
**T.No.107,108,110/2018-19, సవరణ తేదీ: 21.08.2019 & 02/2019-20 తేదీ: 21.08.2019**
దిగువ పనుల కొరకు నమోదిత కాంట్రాక్టర్లు(అర్హతను GOMs.No.66, I&CAD (రీఫార్మ్స్) Dept., తేదీ: 20.04.2015 ప్రకారం పరిగణించబడును) నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **పని పేరు:** PR సర్కిల్, ఖమ్మంలో మణుగూరు (మం.)లో గ్రీనరీ ఫెసిలిటీస్‌తో సమితి సింగారం చెరువుపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో అభివృద్ధి కార్యకలాపాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, RCC నర్సరీల నిర్మాణం మొ॥ పనులు. **మొత్తం ECV : రూ.261.50 లక్షలు.** పై టెండరు ప్రకటనకు టెండర్ నిబంధనలు, SBD మరియు BoQ 27.08.2019 నుండి ఇ-మార్కెట్‌ప్లేస్‌లో లభిస్తాయి. టెండర్ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది: 03.09.2019. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR సర్కిల్ :: ఖమ్మం
DIPR Ro.No.1007-DP/CL/Advt/1/2019-20, Dt: 26.08.2019

**ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్**
APMSIDC, ప్లాట్ నం. 9, సర్వే నం. 49, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522 503
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫామ్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.
**టెండర్ ప్రకటన నం: 42(19-20)/APMSIDC/Medicine Wing/2019-21, తేది: 26.08.2019.** తయారీదారులు మరియు డైరెక్ట్ ఇంపోర్టర్ల నుండి జనరల్ మెడిసిన్స్ సేకరణ. పూర్తి వివరాల కోసం, 27.08.2019 నుండి వెబ్‌సైట్: https://tender.apeprocurement.gov.in దర్శించండి.
ఏ కారణాలు తెలియజేయకుండా ఏ సమయంలోనైనా టెండరును రద్దు చేయు హక్కు APMSIDC కి కలదు.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR Ro.No. 104PP/CL/ADVT/1/1/2019-20, Dt: 26/08/2019

**ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డ్**
4వ అంతస్తు, ఇందాద్ ఘర్ వక్ఫ్ కాంప్లెక్స్, కాళేశ్వర రావు మార్కెట్ ఎదురుగా, విజయవాడ
F.No.06/DM/SPSRNLR/AUC/2016 సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 25.08.2019
వక్ఫ్ బోర్డుచే వేలం వేయబడే ఐటంల చార్జి అప్పగించే తేదీ నుండి ప్రారంభించు ఒక సంవత్సర కాలానికి దర్గా మిట్ట, SPSR నెల్లూరు సిటీ మరియు జిల్లా వద్ద గల D.Hzt.బారా షహీద్‌లో ఐటంలు 1.ఘులక్ (హుండీలు), 2. కొబ్బరి చిప్పలు, 3. తలనీలాలు, 4. షాపులు మరియు హోటళ్లు, 5.ఘలాఫ్ (వస్త్రం), 6. బందిష్ కొబ్బరి మరియు నిమ్మకాయ, 7.ఝూలా మరియు ఎగ్జిబిషన్, 8. లడ్డు ప్రసాదం కొరకు బిడ్‌లో పాల్గొనుటకు ఆసక్తి గల బిడ్డర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.
బిడ్డర్లు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, AP స్టేట్ వక్ఫ్ బోర్డు, విజయవాడ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ.10.00 లక్షలు (పది లక్షల రూపాయలు మాత్రమే) బయానాతో సహా టెండరును దాఖలు చేయాలి. అప్సెట్ ధర రూ.65.00 లక్షలు (అరవై ఐదు లక్షల రూపాయలు మాత్రమే) టెండర్లను 29.08.209న ఉ.11.00 గం. నుండి మ.3.00 గం. మధ్య దాఖలు చేయవలెను మరియు వాటిని అదేరోజున సా.4.00 గం.కు తెరువబడును బిడ్డర్లు టెండరు యొక్క నియమ నిబంధనలు పాటించవలెను. వేలం అత్యధిక బిడ్డరు పేరున కొట్టివేయబడును. APS వక్ఫ్ బోర్డు టెండరును రద్దుచేయు లేదా వాయిదావేయు హక్కులను కలిగి ఉన్నారు.
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు

సాక్షి ఉద్యోగ అవకాశాలు
**విలేకరులు కావలెను**
రాష్ట్రవ్యాప్తంగా ప్రసారం కానున్న మా B.K.చానల్ కు నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు, జిల్లా కో ఆర్డినేటర్లు స్టేట్‌బ్యూరో, యాంకర్స్ అన్ని జిల్లా ఆఫీసులలో పనిచేయుటకు రిసెప్షనిస్టులు కావలెను.
ఆసక్తిగల అభ్యర్థులు RESUME ఈ మెయిల్ చేయగలరు.
Email: job.bkchannel@gmail.com
Ph : 9963838083, 7075389322
BALAKRISHNA COMMUNICATIONS PVT.LTD.

## క్లుప్తంగా...

### లైంగిక వేధింపుల విచారణకు ఇంటర్నల్ కమిటీలు

**సాక్షి, హైదరాబాద్:** పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులపై జరిగే లైంగిక వేధింపులపై విచారణ జరిపేందుకు ఇంటర్నల్ కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య కమిషనర్ విజయ్‌కుమార్ ఆదేశించారు. దీనికి అవసరమైన అన్ని చర్యలను వెంటనే చేపట్టాలని ఆర్జేడీ, డీఈవోలను ఆదేశించారు. జిల్లా, డివిజన్ స్థాయిల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. 10 మందితో ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటి ఏర్పాటులో నిర్లక్ష్యం వహించినా లేక ఏర్పాటు చేయకపోయినా రూ.50 వేల వరకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

### బీసీలకు ప్రాధాన్యమివ్వాలి



**సాక్షి, హైదరాబాద్:** త్వరలో మంత్రివర్గ విస్తరణ చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ప్రస్తుతం ఉన్న 11 మంది మంత్రుల్లో కేవలం ముగ్గురే బీసీలు ఉన్నారని, జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు పదవుల్లో కూడా సగభాగం కేటాయించాలన్నారు. అదేవిధంగా బీసీ డిక్లరేషన్‌పైనా స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు రెండేళ్ల క్రితం బీసీ డిక్లరేషన్‌పై సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేసినా.. ఇప్పటివరకూ అమలుకు నోచుకోలేదన్నారు.

### బీసీ నేతలకు పొగ..



**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ పార్టీలో బీసీ నేతలకు పొమ్మనకుండా పొగపెడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆ పార్టీని తెలంగాణ రెడ్ల సమితిగా మారుస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. త్యాగాలు చేసిన వారంతా బీసీలని, కానీ ఆ ఫలాలు మాత్రం ఇతర కులాలకు దక్కుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వినోద్‌కుమార్‌కు కేబినెట్ హోదా పదవి ఇచ్చిన సీఎం కేసీఆర్.. బూర నర్సయ్యగౌడ్‌కు మాత్రం ఎలాంటి పదవి ఇవ్వ కుండా అవమానించారన్నారు. కట్టుకథలతో మంత్రి ఈటల రాజేందర్‌ను ఆ పార్టీ నేతలు అవమానిస్తున్నారని అన్నారు. టీఆర్ఎస్‌లో దళితులు, బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వ కుంటే మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

### 'రెవెన్యూ విలీన ప్రతిపాదన విరమించుకోవాలి..'

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూ వ్యవస్థ రద్దు, ఉద్యోగులను ఇతర శాఖల్లో విలీనం చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని వీఆర్వో, వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను జేఏసీ నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్థాయిలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందిని తొలగించాలనే ఆలోచన సరికాదన్నారు. సమగ్ర భూసర్వే నిర్వహించి రికార్డులను సరిచేస్తే రెవెన్యూ ఉద్యోగులకు ఆదరణ లభించేదని, అలాకాకుండా రికార్డుల మార్పుతో సరిపెట్టడంతో కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. జేఏసీ నేతలు గరిక ఉపేందర్‌రావు, హరాలే సుధాకర్‌రావు, లక్ష్మీనారాయణ, సుదర్శన్, రవినాయక్, ఎం.డి.రఫీ, అమ్ముల బాలనర్సయ్య తదితరులు ఇందులో పాల్గొన్నారు.

### ముఖేశ్ కుటుంబానికి కవిత పరామర్శ



**సాక్షి, హైదరాబాద్:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నేత, మాజీమంత్రి ముఖేశ్‌గౌడ్ కుటుంబాన్ని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ముఖేశ్‌గౌడ్ నివాసానికి ఆమె భర్త అనిల్‌తో కలిసి వెళ్లారు. ఆయన సతీమణితోపాటు కుమారుడు విక్రమ్‌గౌడ్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముఖేశ్‌గౌడ్ మృతి తనను ఎంతో బాధించిందని, ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు.

### నేడు కలెక్టర్లకు వరంగల్‌లో వర్క్‌షాప్

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కొత్త రెవెన్యూ చట్టం, సంస్కరణల అమలుపై మంగళవారం జిల్లా కలెక్టర్లతో కీలక సమావేశం నిర్వహించనుంది. వరంగల్‌లో ఈ మేరకు వర్క్‌షాప్ ఏర్పాటు చేసింది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి రెవెన్యూశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తోపాటు ఇతర అధికారులు హాజరుకానున్నారు. తొలిరోజు సమావేశంలో పాల్గొనే కలెక్టర్లు రాత్రి వరంగల్‌లోనే బస చేస్తారు. బుధవారం ఉదయం వరంగల్ నుంచి బయలుదేరి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తారు. ప్రపంచంలోకెల్లా అత్యంత పెద్దదైన ఎత్తిపోతల పథకం ప్రత్యేకతలను స్వయంగా తెలుసుకోనున్నారు.



సోమవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

# 93 నిమిషాలకో ప్రాణం!

- రాష్ట్రవ్యాప్తంగా రక్తమోడుతున్న రోడ్లు
- ఈ ఏడాది 3,833 మంది దుర్మరణం..
- రోజుకు సగటున 18 మంది బలి
- మితిమీరిన వేగం.. తీవ్ర నిర్లక్ష్యంతోనే!



**సాక్షి, హైదరాబాద్:** మితిమీరిన వేగం, వాహనాలు నడపడంలో నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తప్పొప్పులు, కారణాలతో సంబంధం లేకుండా ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. 2015లో దేశవ్యాప్తంగా జరిపిన ఓ సర్వే ప్రకారం.. ఆ ఏడాది 1,50,000 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. ఆ తర్వాత ఏడాదికేడాది యాక్సిడెంట్లలో చనిపోతున్న వారి సంఖ్య పెరుగుతూ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ లెక్కల ప్రకారం తెలంగాణలో సగటున 6వేల మందికి పైగా ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 3,833మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. 13,588 మంది గాయపడ్డారు. ఈ లెక్కన రాష్ట్రంలో రోజుకు 18 మంది, నెలకు 479 మంది చొప్పున ప్రాణాలు కోల్పోతుండగా.. రోజుకు 64 మందిచొప్పున గాయపడుతున్నారు. దీని ప్రకారం.. ప్రతీ 93 నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నారు.

**మరణాల్లో సైబరాబాద్ టాప్**

రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో సైబరాబాద్ కమిషనరేట్ అత్యధిక మరణాలతో మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఈ కమిషనరేట్ పరిధిలో ఏకంగా 467 మంది మరణించారు. రాచకొండ (427), సంగారెడ్డి (259), వరంగల్ (197), నల్లగొండ (188), ఖమ్మం (166), సిద్దిపేట (165) తరువాతి స్థానాల్లో నిలిచాయి. జిల్లాల విషయానికొస్తే.. ములుగు, నారాయణపేట్ జిల్లాలు చెరో మూడు మరణాలతో అత్యల్ప ప్రమాద మృతులు నమోదైన జిల్లాలుగా నిలిచాయి. వనపర్తి (46), సిరిసిల్ల (41), కుమరంభీం (34) జిల్లాలు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

**ఆగస్టు 6 వరకున్న ప్రమాద వివరాలు**

| | |
|---|---|
| ఒకరోజు జరిగిన ప్రమాదాలు | 56 |
| మరణాలు | 18 |
| క్షతగాత్రులు | 64 |

**ప్రమాదాల వివరాలు**

| | 2018 | 2019 |
|---|---|---|
| మరణాలు | 6,603 | 3,833 |
| క్షతగాత్రులు | 23,613 | 11,933 |
| ఘోర ప్రమాదాలు | 6,051 | 3,600 |
| సాధారణ ప్రమాదాలు | 13,856 | 8,333 |
| మొత్తం ప్రమాదాలు | 19,901 | 11,933 |

# 'సభ్యత్వ' సమరం

- సభ్యత్వ నమోదు లెక్కలపై టీఆర్ఎస్, బీజేపీ మాటల యుద్ధం
- గులాబీవి బోగస్ గణాంకాలంటూ కమలదళం ఆరోపణ
- బీజేపీవి మిస్డ్‌కాల్ లెక్కలంటూ టీఆర్ఎస్ ప్రత్యారోపణ

**సాక్షి, హైదరాబాద్:** సభ్యత్వ నమోదు అంశం అధికార టీఆర్ఎస్, విపక్ష బీజేపీ మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది. బోగస్ సభ్యత్వాలు అంటూ పరస్పరం నిందారోపణలు చేసుకుంటూ ఇరు పార్టీల నేతలు సవాళ్లు విసురుకుంటున్నారు. సభ్యత్వ నమోదు గణాంకాలపై ఇరు పార్టీలు విమర్శలు చేసుకుంటున్న నేపథ్యంలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయోత్సవ సభను నిర్వహించడం ఆసక్తి రేపుతోంది. రెండేళ్లపాటు అమల్లో ఉండే పార్టీ సభ్యత్వాల సేకరణ కార్యక్రమాన్ని టీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఈ ఏడాది జూన్ 27న ప్రారంభించారు. కోటి మందిని పార్టీ సభ్యులుగా చేర్చాలని లక్ష్యం నిర్దేశించుకోగా సుమారు నెలన్నర వ్యవధిలో 60 లక్షల మందికి టీఆర్ఎస్ సభ్యత్వం ఇచ్చారు. ఇందులో 20 లక్షల మంది క్రియాశీల సభ్యులని ప్రకటించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సభ్యత్వ నమోదు ద్వారా పార్టీ ఖాతాకు రూ. 25 కోట్ల మేర నిధులు సమకూరే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ నెల 31 వరకు పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు ప్రక్రియను కూడా పూర్తి చేసేందుకు టీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సగటున 50 వేల సభ్యత్వాల ద్వారా దేశంలోనే ఎక్కువ మంది సభ్యులు ఉన్న పార్టీగా టీఆర్ఎస్ నిలిచిందని కేటీఆర్ ప్రకటించారు.

**బోగస్ లెక్కలు మీవే.. కాదు మీవే**

రాష్ట్రంలో రాజకీయంగా బలోపేతం కావాలని బీజేపీ కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ ఏడాది జూలై 6న ప్రారంభించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్వయంగా రాష్ట్రానికి వచ్చి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ, టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంటున్న క్రమంలో ఇరు పార్టీలు 'బోగస్ సభ్యత్వాలు'అంటూ పరస్పర నిందారోపణలు చేసుకుంటున్నాయి. టీఆర్ఎస్‌వి బోగస్ సభ్యత్వాలు అని, పార్టీ నేతలే జాబితాలు తయారు చేశారని బీజేపీ విమర్శించింది. అయితే బీజేపీ 'మిస్డ్‌కాల్'ద్వారా చేసిన సభ్యత్వాలను కూడా కలుపుకొని పార్టీ సభ్యుల సంఖ్య 13 లక్షలు అని చెప్పుకుంటోందని టీఆర్ఎస్ ప్రతివిమర్శలు చేసింది. బీజేపీ తరహాలో మిస్డ్‌కాల్ సభ్యత్వాలు చేయాలనుకుంటే గంట వ్యవధిలో 3 కోట్లు చేస్తామని ఎద్దేవా చేసింది. సభ్యత్వాల సేకరణ, సంఖ్యను ఇరు పార్టీలు తాము రాష్ట్రంలో బలంగా ఉన్నామనే సందేశాన్ని జనంలోకి పంపడం లక్ష్యంగా ఉపయోగించుకుంటున్నాయి.

**హైదరాబాద్‌లో టీఆర్ఎస్ విజయోత్సవ సభ..**

రాష్ట్రంలో 60 లక్షలకుపైగా సభ్యత్వాలను సేకరించామనే అంశానికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా బీజేపీ విమర్శలకు అడ్డుకట్ట వేయాలని టీఆర్ఎస్ భావిస్తోంది. మంగళవారం హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో సభ్యత్వ నమోదు విజయోత్సవ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. సమావేశం కోసం ఇండోర్ స్టేడియాన్ని ముస్తాబు చేయగా 8 వేల మందికిపైగా పార్టీ కార్యకర్తలు సభకు హాజరవుతారని జంట నగరాల టీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే జీహెచ్ఎంసీ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొంత మందకొడిగా సాగింది. దీంతో జీహెచ్ఎంసీ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయిన కేటీఆర్.. సికింద్రాబాద్, కూకట్‌పల్లి నియోజకవర్గాల పార్టీ కార్యకర్తల సమావేశంలోనూ పాల్గొని సభ్యత్వ నమోదు వేగవంతం అయ్యేలా చొరవ చూపారు. జీహెచ్ఎంసీ పరిధిలో బీజేపీ ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు సేకరించడంతో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయోత్సవ సభ నిర్వహణ ఆసక్తికరంగా మారింది.

# ఎమ్మెల్సీగా గుత్తా ప్రమాణం



గుత్తాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతి విద్యాసాగర్, మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** శాసనసభ్యుల కోటాలో శాసన మండలికి ఏకగ్రీవంగా ఎన్నికైన గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి సభ్యుడిగా ప్రమాణం చేశారు. సోమవారం మండలి ఆవరణలోని చైర్మన్ చాంబర్‌లో డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, కిషోర్, మల్లయ్య యాదవ్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు హాజరయ్యారు. అనంతరం మండలి మీడియా పాయింట్ వద్ద భాస్కర్‌రావు, గొంగిడి సునీతతో కల సి గుత్తా విలేకరులతో మాట్లాడారు. తనకు వచ్చిన ఈ అవకాశాన్ని ప్రజాసేవ కోసం సద్వినియోగం చేస్తానని, మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో నల్ల గొండ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన మండలి ఎమ్మెల్యే కోటా ఉపఎన్నికలో ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన 2021 జూన్ 3వరకు పదవిలో కొనసాగుతారు.

# విద్యుత్ అవినీతిపై సీబీ'ఐ'కి సిద్ధమా?

- పీపీఏలపై ఆధారాలిస్తాం.. సమాధానమిస్తారా?
- ప్రభాకర్‌రావుతో కాదు.. దమ్ముంటే మీరు చెప్పండి
- సీఎంకు బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ సవాల్
- 18 వేల కోట్ల నష్టం ముమ్మాటికీ నిజమని ఆరోపణ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యుత్తు శాఖలో అవినీతి, అక్రమాలు, దుబారాపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు, సీబీఐ విచారణకు సీఎం కేసీఆర్ సిద్ధమేనా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ సవాల్ విసిరారు. పీపీఏల్లో లొసుగులు, లోపాలపై ఆధారాలు అందజేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ లేవనెత్తిన అంశాలపై జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతో సమాధానం చెప్పించడం కాదని, దమ్ముంటే ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. సీబీఐ విచారణకు సిద్ధమని ప్రభాకర్‌రావు చెప్పారని, దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్తు సంస్థలో రూ.8వేల కోట్ల వరకు అవినీతి జరిగిందని, మరో రూ.10వేల కోట్లకు పైగా నష్టంవాటిల్లిందని, ఇదీ ముమ్మాటికి నిజమన్నారు. అవినీతిలో రాష్ట్ర ప్రభుత్వం డాక్టరేట్ పొందిందని, అధిక ధరలతో పీపీఏలు చేసుకోవడంలో మతలబేంటో? అవన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, అవినీతి, అక్రమాలు, సీఎం అహంకారం వల్లే విద్యుత్తు సంస్థలు కుప్పకూలి పోయాయని, ఆ రంగం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తాము విద్యుత్తు రంగంలో అవినీతి గురించి మాట్లాడితే అధికారులతో మాట్లాడిస్తున్నారని, వారిని బలి పశువులను చేయడం ఎందుకని, దమ్ముంటే సీఎం సూటిగా సమాధానం చెప్పాలన్నారు. విద్యుత్తు సంస్థలకు రూ.10వేల కోట్ల బకాయిలున్నది వాస్తవమా? కాదా? చెప్పాలన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులు, ఇతరాలకు రూ.7వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం ఎగ్గొట్టింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌కు రూ.1800 కోట్లు, సోలార్ సంస్థలకు రూ.3వేల కోట్లు బ బకాయి పడింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సోలార్ సంస్థలకు ఇవ్వాల్సిన రూ.300కోట్ల సబ్సిడీలు ఇవ్వలేదని వెల్లడించారు. గ్రామ పంచాయతీల బిల్లులు కట్టకపోతే సర్పంచులను పీకేస్తామని అంటున్న సీఎంను విద్యుత్తు బకాయిలు చెల్లించనందుకు ఏం చేయాలని లక్ష్మణ్ ప్రశ్నించారు. ప్రభుత్వానికి కొనసాగే హక్కు ఉందా? అని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.3.50కే యూనిట్ విద్యుత్తు లభిస్తుంటే ఛత్తీస్‌గఢ్‌తో రూ.4.50కు యూనిట్ చొప్పున ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందో చెప్పాలన్నారు.

**సోలార్ విద్యుత్‌లోనూ చేతివాటమే!**

యూనిట్ సోలార్ విద్యుత్‌ను రూ.4.50 కంటే తక్కువకే కొనుగోలు చేయాలని 2015లో కేంద్రం స్పష్టం చేసిందని, ఒకవేళ బిడ్డింగ్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తే 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్'కింద ఎక్కువ మొత్తాన్ని తాము భరిస్తామని కేంద్రం విధానపరమైన నిర్ణయం చేసినా పట్టించుకోకుండా యూనిట్‌కు రూ.5.50 చొప్పున 2వేల మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు ఎందుకు ఒప్పందం చేసుకున్నారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ పీపీఏలు సంతకాలు చేసే సమయానికి టీటీడీ రూ.4.49లకు, రాజస్తాన్ ప్రభుత్వం రూ.4.34లకు ఒప్పందం చేసుకున్నాయన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం యూనిట్‌కు ఒక రూపాయి అధికంగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకోవడం వల్ల రాష్ట్రానికి రూ.8వేల కోట్ల నష్టం వాటిల్లిందని లక్ష్మణ్ వెల్లడించారు. ఇదీ ఛార్జీల రూపంలో ప్రజలపై పడే భారం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కృత్రిమ విద్యుత్తు కొరతను సృష్టించి అనేక షార్ట్ టర్మ్ అగ్రిమెంట్లు చేసుకున్నారన్నారు. అందులో ఎన్నింటికి ఈఆర్‌సీ ఆమోదముందని.. ఎన్నింటికి ఓపెన్ బిడ్డింగ్ ద్వారా ఒప్పందం చేసుకున్నారో బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 2016లో ఒప్పందాలు అయ్యాక 6నెలల్లో విద్యుత్తు ఇవ్వాల్సి ఉన్నా, 2018 వరకు అమలు కాకపోయినా ఎలాంటి పెనాల్టీ వేయకుండా వాటికి ఎందుకు గడువు ఇస్తున్నారని ప్రశ్నించారు. మార్కెట్‌లో సోలార్ విద్యుత్తు రూ.2.50–రూ.3లకు లభిస్తుంటే వాటి నుంచి రూ.5.75లకు ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు.

# సిరియా వైమానిక దాడుల్లో హైదరాబాదీ మృతి

- భార్య ఫోన్ కాల్‌తో ఆలస్యంగా వెలుగులోకి...
- ఐసిస్‌కు ఆకర్షితుడై సిరియాలో స్థిరపడిన ఇంజనీర్

**సాక్షి, హైదరాబాద్:** నగరంలో మరోసారి ఐసిస్ కలకలం రేగింది. సౌదీ అరేబియాలో స్థిరపడిన హైదరాబాద్‌కు చెందిన ఓ ఇంజనీర్ సిరియాలో జరిగిన వైమానిక దాడుల్లో చనిపోయాడు. విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఈ ఉదంతం తాజాగా అతడి భార్య బంధువులకు చేసిన ఫోన్‌కాల్‌తో వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సిరియాలోని ఓ శరణార్థి శిబిరంలో ఉన్న తనను, పిల్లల్ని హైదరాబాద్‌కు తీసుకువెళ్లాల్సిందిగా అతడి భార్య తన బంధువుల్ని కోరింది. ఈ అంశాన్ని పోలీసు, నిఘా వర్గాలు వివిధ కోణాల్లో విశ్లేషిస్తున్నాయి. పశ్చిమ మండల పరిధిలో ఉన్న టోలిచౌకి అజీజ్‌బాగ్ కాలనీకి చెందిన ఓ కుటుంబం 30 ఏళ్ల క్రితం సౌదీ అరేబియాలో స్థిరపడింది. ఈ కుటుంబానికి చెందిన ఓ యువకుడు అక్కడే పుట్టి పెరిగినప్పటికీ సౌదీ నిబంధనల ప్రకారం ఇతడికి భారత పౌరసత్వమే ఉంది. ఆ యువకుడు కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి అజీజ్‌బాగ్ కాలనీలో ఉండి ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని వెళ్లాడు. సౌదీ అరేబియాలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న అతడు హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం కలిగిన తర్వాత 2015లో సెలవులు గడపడానికి కుటుంబంతోసహా దుబాయ్ వెళ్లాడు. అక్కడే ఐసిస్‌కు ఆకర్షితుడై టర్కీ మీదుగా సిరియా వెళ్లి స్థిరపడ్డాడు. ఐసిస్ క్యాడర్‌తో కలిసి దాదాపు మూడేళ్లు పనిచేశాడు. సిరియాలో ఉండగా అతడికి మరో ఇద్దరు పిల్లలు పుట్టారు. గత ఏడాది నవంబర్‌లో సిరియాలో జరిగిన వైమానిక దాడుల్లో అతడు ప్రాణాలు కోల్పోయాడు. అప్పటినుంచి అతడి భార్య, నలుగురు పిల్లలు అక్కడి ఓ శరణార్థి శిబిరంలో దుర్భర జీవితం గడుపుతున్నారు. ఇటీవల ఆమెకు ఫోన్ చేసుకునే అవకాశం రావడంతో నగరంలో ఉన్న తన కుటుంబాన్ని సంప్రదించింది. తాను అనుభవిస్తున్న పరిస్థితుల్ని వివరించి హైదరాబాద్ తీసుకువెళ్లడానికి చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే సిరియా వెళ్లి ఐసిస్‌లో పనిచేస్తూ మంచిర్యాలకు చెందిన ఇంజనీర్ హనీఫ్ వశీం, ఆంధ్రప్రదేశ్‌లోని రేపల్లెకు చెందిన రెహ్మాన్ చనిపోయారు.

# భగీరథలో సగం ఖర్చు కేంద్రం భరించాలి

- కేంద్రానికి తెలంగాణ వినతి
- జల్ జీవన్ మిషన్ పథకంపై జలశక్తి శాఖ సమావేశం
- హాజరైన మంత్రి ఎర్రబెల్లి



**సాక్షి, న్యూఢిల్లీ:** ఇంటింటికీ నల్లా నీరు అందించేందుకు వీలుగా నిర్మించిన 'మి షన్ భగీరథ'పథకానికి అయ్యే వ్యయంలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం భరించాలని తెలంగాణ ప్రభుత్వం మరోసారి కేంద్రాన్ని కోరింది. కేంద్ర తాగునీరు, పారిశుధ్య శాఖ ఢిల్లీలో 'జల్ జీవన్ మిషన్'పథకంపై అన్ని రాష్ట్రాలతో సమావేశం నిర్వహించింది. తెలంగాణ తరపున మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. 'మిషన్ భగీరథపై సమగ్ర నివేదికను సమర్పించాం. ఆగస్టు 15న ప్రధాని నరేంద్రమోదీ ప్రతి ఇంటికీ తాగునీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో 'జల్ జీవన్ మిషన్'ను ప్రకటించారు. కేంద్ర జల్ శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన దీనిపై అన్ని రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం జరిగింది. తెలంగాణలోని మహిళలు తాగునీటి కోసం పడే కష్టాలను తొలగించడంతోపాటు ప్రతి ఒక్కరికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేయడం లక్ష్యంగా సీఎం కేసీఆర్ మిషన్ భగీరథను చేపట్టారు. ఇది దేశానికి ఆదర్శంగా నిలిచింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్రం 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని చేపట్టింది. 2024కల్లా పూర్తి చేయాలన్నది లక్ష్యం. కేంద్ర జల్ శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు దీనిపై వినతి పత్రాన్ని కూడా ఇచ్చాం. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న మిషన్ భగీరథ, 'జల్ జీవన్ మిషన్'ఒక్కటే కాబట్టి మిషన్ భగీరథకు సాయం చేయాలని కోరాం. ఈ అంశంపై జూన్‌లోనే మంత్రికి స్వయంగా లేఖ ఇచ్చాం. మిషన్ భగీరథ అంచనా వ్యయం రూ. 45,028 కోట్లు. దీంట్లో 80 శాతం నిధులను నాబార్డు నుంచి రుణంగా తీసుకున్నాం. మిగిలిన 20 శాతాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. మిషన్ భగీరథను ప్రధాని మోదీ తన 'మన్ కీ బాత్'లో ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ పథకాన్ని ప్రధాని 2016 ఆగస్టు 7న స్వయంగా ప్రారంభించారు. అన్ని రాష్ట్రాలకు మార్గదర్శంగా నిలిచిన మిషన్ భగీరథ హడ్కో అవార్డుకు కూడా ఎంపికైంది. ఈ దృష్ట్యా భగీరథలో 50 శాతం నిధులను కేంద్రం భరించాలని మరోసారి కోరాం. దీని నిర్వహణకు ఏటా రూ. 2,110 కోట్ల మొత్తం అవసరమవుతుంది. ఈ ఖర్చు మొత్తాన్ని సైతం కేంద్రం చెల్లించాలని కోరాం..'అని వివరించారు.

**రాష్ట్రానికి రావాల్సిన నిధులివ్వండి**

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలను వేగవంతం చేయాల్సిందిగా ఆ శాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి, టీఆర్ఎస్ ఎంపీలు కోరారు. మంత్రి ఎర్రబెల్లి ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండ ప్రకాశ్‌లతో కలసి గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై రాష్ట్రానికి రావాల్సిన నిధులపై వివరాలందించారు.

# గ్రానైట్ మైనింగ్‌లో అక్రమాలు: సంజయ్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రానైట్ మైనింగ్‌లో అవకతవకలు జరిగాయని, ప్రభుత్వ అండదండలతోనే కంపెనీలు అక్రమాలకు పాల్పడ్డాయని బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆ వ్యవహారంలో అధికారులు, రాజకీయ నేతలు, యజమానులు భారీగా లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు అక్రమ మైనింగ్‌పై ఆరోపణలు చేసిందని, ఇపుడు అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందే టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా చేస్తోందన్నారు. మైనింగ్‌తో ప్రభుత్వానికి ఆదాయం రావాలని, బాధిత గ్రామా లు అభివృద్ధి చెందాల్సి ఉండగా అవేమి జరగడం లేదన్నారు. ఈ వ్యవహారంలో మైనింగ్ మంత్రులుగా పనిచేసిన వారి పాత్ర ఉందన్నారు. ఒక మంత్రిని తొలగించి మరో మంత్రిని నియమించడం అంటే దాని వెనుక ఏముందో తేల్చాలన్నా రు. ఈ అక్రమాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సీబీఐ విచారణకు ఆదేశించాలని కోర్టులో పిల్ వేస్తున్నామన్నారు.

# మధ్యవర్తికి తావులేదు

**కశ్మీర్‌పై ట్రంప్ సమక్షంలో తేల్చిచెప్పిన మోదీ • ఇతర ద్వైపాక్షిక అంశాలను భారత్, పాక్‌లే పరిష్కరించుకుంటాయని వ్యాఖ్య**



ట్రంప్‌తో భేటీ సందర్భంగా మీడియాతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

**బియార్రిట్జ్/లండన్:** కశ్మీర్ విషయంలో మూడో దేశం మధ్యవర్తిత్వానికి ఎటువంటి అవకాశం లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కశ్మీర్‌తో పాటు ఇతర ద్వైపాక్షిక అంశాలను భారత్, పాక్‌లు చర్చించుకుని పరిష్కరించుకుంటాయని, ఈ విషయంలో మరో దేశాన్ని ఇబ్బందిపెట్టడం తమకు ఇష్టం లేదని పేర్కొన్నారు. ఫ్రాన్సులోని బియార్రిట్జ్‌లో జరుగుతున్న జీ–7 దేశాల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ పరిణామాలపై జీ–7 భేటీ సందర్భంగా ట్రంప్‌తో చర్చించినట్లు ఆయన వెల్లడించారు. 'భారత్, పాకిస్తాన్‌ల మధ్య విబేధాలన్నీ ద్వైపాక్షిక సంబంధమైనవే. ఈ విషయాల్లో ఏ ఇతర దేశాన్ని కూడా ఇబ్బందిపెట్టడం మాకు ఇష్టం లేదు. ద్వైపాక్షిక సమస్యలను మేమే చర్చించి, పరిష్కరించుకుంటాం' అని తెలిపారు. '1947 వరకు రెండు దేశాలు కలిసే ఉన్నాయి. ప్రస్తుతం ఇరుగుపొరుగు దేశాలుగా ఉన్న మేం అన్ని సమస్యలను చర్చించి పరిష్కరించుకుంటామనే నమ్మకం ఉంది. ప్రధానిగా రెండోసారి ఎన్నికయ్యాక పాక్ ప్రధాని ఇమ్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడా. భారత్, పాకిస్తాన్‌లు పేదరికం, నిరక్షరాస్యత, అంటువ్యాధులతో పోరాటం సాగించాల్సి ఉంది. ప్రజల సంక్షేమం కోసం కలిసి పనిచేద్దామని కోరా' అని తెలిపారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'మోదీతో వాణిజ్యం, సైనిక అంశాలు సహా పలు విషయాలపై చర్చించాం. కశ్మీర్ సమస్యను రెండు దేశాలు సొంతంగానే పరిష్కరించుకుంటాయనే నమ్మకం ఉంది. ఇరు దేశాల నేతలతోనూ నాకు మంచి సంబంధాలున్నాయి. తమంతట తామే ఈ సమస్యను వారు పరిష్కరించుకుంటారని విశ్వసిస్తున్నా' అని పేర్కొన్నారు. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేస్తూ ఈ నెల 5వ తేదీన కేంద్రం నిర్ణయం తీసుకున్న అనంతరం ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే ప్రథమం. ఇద్దరు నేతలు ప్రధానంగా ఇంధనం, వాణిజ్యం అంశాలపైనే 40 నిమిషాల పాటు చర్చలు జరిపారని విదేశాంగ శాఖ తెలిపింది. ట్రంప్ తాజా వ్యాఖ్యలు కశ్మీర్‌పై అమెరికా విధానంలో వచ్చిన భారత్ అనుకూల మార్పుగా భావిస్తున్నారు.

### ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రధాని ప్రస్తావన

ప్లాస్టిక్ వస్తువులను వాడి పారేసే విధానానికి స్వస్తి పలికేందుకు, నీటి సంరక్షణ, సౌరశక్తి వినియోగం, పర్యావరణ పరరిక్షణ దిశగా భారత్ చేపడుతున్న చర్యలను జీ–7 భేటీలో మోదీ ప్రస్తావించారు. జీవ వైవిధ్యం దెబ్బతినకుండా భారత్ తీసుకుంటున్న చర్యలు, వాతావరణ మార్పులు, నీటి వనరులపై ఒత్తిడి, సముద్రాల్లో కాలుష్యం' అంశాలపై మోదీ మాట్లాడారని విదేశాంగ శాఖ తెలిపింది. డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకుని సమ్మిళిత, సాధికారికతల ద్వారా సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కృషి చేస్తున్నట్లు మోదీ తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ సెనెగల్ అధ్యక్షుడు మాకీ సాల్‌తో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, సహకారం, ఉగ్రవాదంపై పోరాటంపై చర్చించారు. కాగా, మూడు దేశాల పర్యటన ముగించుకుని మోదీ సోమవారం భారత్‌కు తిరుగుపయనమయ్యారు.



జీ7 సదస్సులో భాగంగా పర్యావరణ అంశంపై భేటీలో పాల్గొన్న జర్మనీ చాన్స్‌లర్ మెర్కెల్, భారత ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని గుసెప్పీ, బ్రిటన్ ప్రధాని జాన్సన్

## మోదీ ఇంగ్లిష్‌లో బాగా మాట్లాడతారు. కానీ..: ట్రంప్

**భా**రత ప్రధాని నరేంద్ర మోదీ ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడతారనీ, కానీ, ఇంగ్లిష్‌లో మాట్లాడేందుకు ఇష్టపడరని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. జీ–7 భేటీ సందర్భంగా ఇరువురు నేతలు మీడియా ముందుకు వచ్చి, కరచాలనం అనంతరం కలిసి మాట్లాడారు. నేతలకు ప్రైవేట్‌గా మాట్లాడుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా విలేకరులను కోరిన మోదీ వారు అడిగిన పలు ప్రశ్నలకు హిందీలో సమాధానాలు ఇచ్చారు. 'ఆయన(మోదీ) వాస్తవానికి చాలా బాగా ఇంగ్లిష్ మాట్లాడగలరు. కానీ, ఆయనకు ఇంగ్లిష్ మాట్లాడటం ఇష్టం ఉండదు. మోదీతో సమావేశం గొప్ప విషయం. భారత్ గురించి చాలా విషయాలు తెలిశాయి' అని ఈ సందర్భంగా ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్, మోదీ ఒకరి చేతులు మరొకరు చేతులు పట్టుకుని ఉండగా సమావేశం జరుగుతున్న గదిలో ఉన్న నేతలంతా పెద్ద పెట్టున నవ్వారు. స్నేహితుడు ట్రంప్‌తో జరిపిన సమావేశం చాలా ముఖ్యమైందని మోదీ పేర్కొనడం గమనార్హం.


ఆచీ మసాలా సైంటిఫిక్ ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీని సందర్శించిన కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల సహాయమంత్రి రామేశ్వర్ తేలిని సత్కరిస్తున్న దృశ్యం. ఈశాన్య రాష్ట్రాల్లో తయారీ యూనిట్లను నెలకొల్పాలని ఆచీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విన్ పాండ్యన్‌కు సూచించారు

# భారత్‌తో అణు యుద్ధానికైనా రెడీ

- కశ్మీర్‌పై ఎంతవరకైనా వెళ్తాం
- పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్



**ఇస్లామాబాద్:** కశ్మీర్ విషయంలో భారత్‌తో అణు యుద్ధానికైనా సిద్ధమేనని పాక్ ప్రధాని ఇమ్రాన్ మరోసారి బెదిరింపులకు దిగారు. సోమవారం ఆయన జాతినుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన.. 'కశ్మీర్ పరిస్థితులు యుద్ధానికి దారి తీస్తే.. గుర్తుంచుకోండి రెండు దేశాల వద్దా అణ్వాయుధాలు ఉన్నాయి. కశ్మీర్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. కశ్మీర్ కోసం ఎంతవరకైనా వెళతాం. అంతర్జాతీయ సమాజం ఇప్పుడు బాధ్యత తీసుకోవాలి, లేదా పాక్ ఏదైనా చేయగలుగుతుంది'అని స్పష్టంచేశారు. అంతర్జాతీయంగా జరిగే ప్రతి సమావేశంలోనూ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తుతానన్నారు. ఈ విషయంలో భారత్‌తో చర్చలు జరపడానికి ప్రయత్నించినా సరైన స్పందన రాలేదని తెలిపారు. భారత్‌లో ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వంతో చర్చలు జరపవచ్చని భావించానని అయితే మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దుతో చారిత్రాత్మక తప్పు చేసిందని అన్నారు. ఈ క్రమంలో భారత్ తమ సొంత రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను, ఐక్యరాజ్యసమితి సూచనలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. సెప్టెంబర్‌లో జరిగే ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానన్నారు. ముస్లిం దేశాలు పాక్‌కు మద్దతివ్వడం లేదన్న విషయంపై స్పందిస్తూ.. 'ఆర్థిక సంబంధాల వల్ల వారు ముందుకు రాకపోవచ్చు. కానీ వారంతా కచ్చితంగా కాలంతోపాటు కలిసి రావాల్సిందే. కశ్మీరీలను కాపాడతామని ఐక్యరాజ్య సమితి చెప్పింది. ఇది ఇప్పుడు వారి బాధ్యత. పుల్వామా వంటి దాడులను సాకుగా చూపి కశ్మీర్ అంశం నుంచి అంతర్జాతీయ సమాజ దృష్టిని మార్చే పనిలో భారత్ ఉంది'అన్నారు.

# తీవ్రవాదంపై ఉమ్మడి పోరు

- వామపక్ష తీవ్రవాదం నిర్మూలనకు కట్టుబడి ఉన్నాం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 10 మావోయిస్టు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీ



సమావేశంలో అమిత్ షా, కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ:** ఉమ్మడి పోరాటం, వ్యూహాలతో వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలను దీటుగా ఎదుర్కోవాలని కేంద్రం, మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు నిర్ణయించాయి. 10 మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఇతర రాష్ట్రాల సీఎంలు నితీష్ కుమార్ (బిహార్), నవీన్ పట్నాయక్ (ఒడిశా), యోగి ఆదిత్యనాథ్ (యూపీ), కమల్‌నాథ్ (మధ్యప్రదేశ్), రఘుబర్ దాస్ (జార్ఖండ్), భూపేష్ భఘేల్ (ఛత్తీస్‌గఢ్), ఉన్నతాధికారులు హాజరయ్యారు. మావోయిస్టుల ఏరివేతకు తీసుకుంటున్న చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇందులో సమీక్షించారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించిన సమావేశం ఫలప్రదమైంది. భద్రత, అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించాం. ప్రజాస్వామ్య విధానాలకు తీవ్రవాదం విఘాతం కలిగిస్తుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో తీవ్రవాదం నిర్మూలనకు కట్టుబడి ఉన్నాం'అని సమావేశం అనంతరం అమిత్ షా ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అమిత్ షా హోంశాఖ పగ్గాలు చేపట్టిన అనంతరం ఇలాంటి సమావేశం జరగడం ఇదే తొలిసారి. హోంశాఖ, పారా మిలటరీ బలగాల ఉన్నతాధికారులు కూడా దీనికి హాజరయ్యారు.

### తీవ్రవాదం తగ్గుముఖం

- కేంద్ర హోంశాఖ గణాంకాల ప్రకారం 2009–13లో మావోయిస్టు హింసాత్మక చర్యలకు సంబంధించి 8,782 కేసులు నమోదు కాగా 2014–18లో 43.4 శాతం తగ్గిపోయి 4,969 కేసులు నమోదయ్యాయి.
- 2009–13 మధ్య కాలంలో మావోయిస్టుల హింసకు 3,326 మంది (భద్రతా సిబ్బందితో కలిపి) బలయ్యారు. 2014–18లో తీవ్రవాదుల చేతుల్లో 1,321 మంది మృతి చెందారు.
- 2009–18 వరకు 1,400 మందికిపైగా మావోయిస్టులు మరణించారు.
- ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో దేశవ్యాప్తంగా మావోయిస్టుల హింసకు సంబంధించి 310 ఘటనలు నమోదు కాగా 88 మంది ప్రజలు చనిపోయారు.

## క్లుప్తంగా..

### మన్మోహన్‌కు ఎస్పీజీ భద్రత ఉపసంహరణ

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ప్రస్తుతం అందిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) భద్రతను కేంద్రం ఉపసంహరించింది. దీనికి బదులుగా ఆయనకు జెడ్ ప్లస్ సెక్యూరిటీని కల్పిస్తూ కేంద్ర హోం శాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని ప్రముఖుల భద్రతను సమీక్షించే విభాగం నివేదికల ఆధారంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. నిఘా సంస్థల నివేదికల పరిశీలన తర్వాతే మన్మోహన్‌కు భద్రతను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.

### రూపాయికే న్యాప్కిన్

**న్యూఢిల్లీ:** మహిళల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఇకపై శానిటరీ న్యాప్కిన్‌లను రూపాయికే అందజేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతంలో నాలుగు ప్యాడ్లు ఉన్న ప్యాకెట్ ధర 10 రూపాయలకు లభించేది. ఇకపై అది రూ. 4కే లభించనుంది. 'కేంద్రం ఆగస్టు 27 నుంచి పర్యావరణహిత శానిటరీ న్యాప్‌కిన్‌లను విడుదల చేస్తోంది. సువిధా బ్రాండ్ పేరుతో ఉన్న ఈ న్యాప్‌కిన్లు దేశవ్యాప్తంగా 5,500 జన్ ఔషధి కేంద్రాలలో లభిస్తాయి'అని మాండవియా చెప్పారు.

### ఈపీఎఫ్‌వోలో ఈ–తనిఖీ!

**బెంగళూరు:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) తనిఖీ ప్రక్రియలను సులభతరం చేసేందుకు గాను త్వరలో ఈ–తనిఖీ(ఆన్‌లైన్ ఇన్‌స్పెక్షన్) విధానాన్ని తీసుకురానుంది. చందాదారులకు వేధింపులను తగ్గించేందుకు గాను దర్యాప్తు సమయాన్ని గరిష్టంగా రెండేళ్ల లోపు ఉంచేలా ఈపీఎఫ్‌వో చట్టంలో సవరణ చేయాలని ప్రతిపాదించినట్లు కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ సునీల్ బార్త్‌వాల్ వెల్లడించారు. సమాచారంలో తప్పుల వల్ల కొద్ది శాతం మంది ఉద్యోగులు యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) క్రియేట్ చేసుకోలేకపోతున్నారని తెలిపారు. దీనిని పరిష్కరించేందుకు ఉద్యోగుల సమాచార డేటాబేస్‌ను ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు.

### భూతాలను ప్రయోగించారు: ప్రజ్ఞా

**భోపాల్:** 'మా పార్టీ సీనియర్ నేతలు ఒకరి తర్వాత ఒకరు చనిపోతున్నారు. దీనంతటికీ కారణం ప్రతిపక్షాలు మాపై మరక్ శక్తి (దెయ్యపు శక్తి)ని ప్రయోగించడమే'. అంటూ బీజేపీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ సోమవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్‌ల మరణాలను ఉద్దేశించి ఆమె ఈ మాటలన్నారు. ఇలా జరుగుతుందని ఓ స్వామీజీ తనకు లోక్‌సభ ఎన్నికల సమయంలోనే చెప్పారని అన్నారు. అనంతరం ఆ విషయం మరచిపోయాయని, కానీ ఇప్పుడు జరిగిన మరణాలు చూస్తే ఆ స్వామీజీ చెప్పింది నిజమేనని అనిపిస్తోందని అన్నారు.

### విమానాల్లో 'యాపిల్ మాక్‌బుక్ ప్రో' తేవద్దు



**న్యూఢిల్లీ:** విమాన ప్రయాణం చేసే ప్రయాణికులు యాపిల్ మాక్ బుక్ ప్రో 15 అంగుళాల మోడల్ ల్యాప్‌టాప్‌ను తీసుకురావద్దని విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ ప్రయాణికులను కోరింది. ఆ మోడల్‌లోని కొన్ని ల్యాప్‌టాప్‌ల బ్యాటరీలు అధికంగా వేడికి గురవుతున్నాయని, ప్రయాణికుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. ఇదే విషయమే జూన్ 20వ తేదీన యాపిల్ సంస్థ సైతం తమ వెబ్‌సైట్‌లో ఈ మోడల్ ల్యాప్‌టాప్‌లకు సంబంధించి ఓ హెచ్చరిక నోటీసును అందుబాటులో ఉంచింది. దీని ప్రకారం సెప్టెంబర్–2015 నుంచి ఫిబ్రవరి 2017 మధ్య కాలంలో విక్రయించిన ల్యాప్‌టాప్‌ల్లో బ్యాటరీ అధిక వేడికి గురవుతుందని పేర్కొంది. అలాగే ఈ ల్యాప్‌టాప్‌ల్లో బ్యాటరీలను ఉచితంగానే మార్పు చేయాలని నిర్ణయించామని యాపిల్ సంస్థ తెలిపింది. బ్యాటరీని మార్పు చేసుకునే వరకు ప్రయాణికులు ఆ మోడల్ ల్యాప్‌టాప్‌లను తీసుకోరావద్దని డీజీసీఏ చీఫ్ అరుణ్ కుమార్ ట్వీట్ చేశారు.


**రెడీ 1..2..3..** సోమవారం జమ్మూలో కంబైన్డ్ ఆర్మీ ట్రైనింగ్ క్యాంప్‌లో శిక్షణ సందర్భంగా గురిపెట్టి కాలుస్తున్న ఎన్‌సీసీ విద్యార్థిని

# చిదంబరం సీబీఐ కస్టడీ మరో 4 రోజులు

- ఆదేశాలు జారీ చేసిన ఢిల్లీ ప్రత్యేక కోర్టు
- ఈడీ అరెస్టు నుంచి 27 వరకు రక్షణ పొడిగించిన సుప్రీం

**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో మాజీ ఆర్థిక మంత్రి చిదంబరంను మరో నాలుగు రోజులపాటు విచారించేందుకు ఢిల్లీ స్పెషల్ కోర్టు సీబీఐకి అనుమతించింది. చిదంబరం నుంచి మరిన్ని కీలక వివరాలు రాబట్టాల్సి ఉన్నందున కస్టడీని మరో 5రోజులపాటు పొడిగించాలంటూ సీబీఐ విజ్ఞప్తి చేసింది. సీబీఐ వినతి న్యాయబద్ధంగా ఉందన్న స్పెషల్ జడ్జి అజయ్ కుమార్ ఈ 30వ తేదీ వరకు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, ఐఎన్‌ఎక్స్ మీడియా మనీ ల్యాండరింగ్ కేసులో చిదంబరంను ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అరెస్టు చేయకుండా తాత్కాలిక రక్షణను సుప్రీంకోర్టు మంగళవారం వరకు పొడిగించింది. ఇదే కేసులో తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించటాన్ని సవాల్ చేస్తూ చిదంబరం వేసిన పిటిషన్‌పై వాదనలు వినేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. అప్పటికే(ఆగస్టు 21) చిదంబరం అరెస్టయినందున దీనిపై విచారణ నిష్ప్రయోజనమని వ్యాఖ్యానించింది. అయితే, ఈ కేసులో చట్టబద్ధమైన పరిష్కారం కోరే స్వేచ్ఛ ఆయనకు ఉందని పేర్కొంది. దీంతో ఈడీ కౌంటర్ అఫిడవిట్‌కు సమాధానం(రిజాయిండర్) ఇస్తామని చిదంబరం తరఫున సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ తెలిపారు. నిష్పాక్షిక విచారణ, దర్యాప్తు అనేవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో అంతర్భాగమని, చిదంబరం ప్రాథమిక హక్కులను న్యాయస్థానం కాపాడాలని పేర్కొన్నారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం ఈ పిటిషన్‌పై వాదనలు కొనసాగించేందుకు ధర్మాసనం అంగీకరించింది.

### వోరా, హూడాలపై ఈడీ చార్జిషీట్లు

**న్యూఢిల్లీ:** హరియాణాలోని పంచ్‌కులలో కాంగ్రెస్ హయాంలో అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) పేరిట భూకేటాయింపుల అవకతవకలపై మాజీ సీఎం భూపీందర్ హూడా, సీనియర్ పార్టీ నేత మోతీలాల్ వోరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చార్జిషీట్లు నమోదు చేసింది. మనీలాండరింగ్ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో వేసిన మొదటి చార్జిషీటులో ఈడీ..'భూ సేకరణ, కేటాయింపు ప్రక్రియలో అక్రమాలకు సంబంధించి వోరా, హూడాలకు నేరుగా సంబంధం ఉంది' అని పేర్కొంది. పంచ్‌కులలోని రూ.65 కోట్ల విలువ చేసే భూ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయనేది ఈడీ ఆరోపణ.

# బ్రెజిల్ అధ్యక్షుడికి అమెజాన్ సెగలు






**పోర్టో వెల్హో(బ్రెజిల్):** అమెజాన్ అడవుల్లో రేగిన కార్చిచ్చు సెగలు బ్రెజిల్ అధ్యక్షుడు జెయిర్ బోల్సోనారోకి తగులుకుంటున్నాయి. అడవులు తగలబడిపోతుంటే ఆయన స్పందించిన విధానంపై స్వదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమెజాన్ అడవుల్లో కార్చిచ్చులు సర్వసాధారణమే అయినప్పటికీ గతంతో పోల్చి చూస్తే ఈ ఏడాది 85 శాతం పెరిగిపోయాయి. అయితే ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీయడానికి సామాజిక సంస్థలే అడవుల్ని తగలబెట్టి ఉంటాయని బోల్సోనారో చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. బ్రెజిల్ వ్యాప్తంగానూ, ప్రపంచ దేశాల్లో బ్రెజిల్ దౌత్యకార్యాలయాల ఎదుట వందలాది మంది నిరసన ప్రదర్శనలకు దిగారు. సొంత దేశంలోనే కొందరు యువకులు ''బోల్సోనారో మా భవిష్యత్‌ని మసి చేస్తున్నారు'' అంటూ ప్ల కార్డులు ప్రదర్శించారు. పోప్ ఫ్రాన్సిస్ కూడా తన నిరసన గళాన్ని వినిపించారు. ఊపిరితిత్తుల్లాంటి అడవులు మన భూమికి అత్యంత ముఖ్యమంటూ ప్రకటన జారీ చేశారు. ప్రేఫర్అమెజాన్ అంటూ సోషల్ మీడియాలో ఉద్యమం ప్రపంచంలోనే ట్రెండింగ్ అంశంగా మారింది.

### బ్రెజిల్‌తో వ్యాపార సంబంధాలు నిలిపివేస్తాం

బ్రెజిల్ అధ్యక్షుడు వాణిజ్య ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన అటవీ విధానాలే కార్చిచ్చు రేపాయని, ఇవి ఇంకా కొనసాగితే బ్రెజిల్, ఇతర దక్షిణ అమెరికా దేశాలతో వ్యాపార సంబంధాలు రద్దు చేసుకుంటామని యూరోపియన్ నాయకులు హెచ్చరించారు. బ్రెజిల్ అధినేత అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలను తోసి రాజని అడవుల నరికివేత, పశువుల మేతకు చదును చేయడం, అక్రమ మైనింగ్‌ను ప్రోత్సహించడం వల్లే ఈ పరిస్థితులు తలెత్తాయని ప్రపంచ దేశాల అభిప్రాయంగా ఉంది. గతంలో కూడా బోల్సోనారో అమెజాన్ వర్షారణ్యాలు బ్రెజిల్ ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారాయని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలతో బోల్సోనారోపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగింది. దీంతో ఆయన దిగివచ్చారు. పర్యావరణ విధానాల్ని సవరించుకుంటామని హామీ ఇచ్చారు. మంటల్ని ఆర్పడానికి 44వేల మంది సైనికుల్ని పంపిస్తానని వెల్లడించారు. అంతేకాదు కార్చిచ్చు రేగడానికి గల కారణాలపై విచారణ జరిపి బాధ్యుల్నిశిక్షిస్తామని అధినేత చెప్పినట్టుగా ఆ దేశ న్యాయశాఖ మంత్రి, పర్యావరణ విధానాలను సమీక్షించే అధికారం ఉన్న సెర్గియో మోరో ట్విటర్‌లో వెల్లడించారు.

### బ్రెజిల్‌లో ఈ ఏడాదిలో కార్చిచ్చు ఘటనలు




- అమెజాన్ వర్షారణ్యాల్లో 40,341 ఘటనలు
- ఉష్ణమండల అడవుల్లో 22,875 ఘటనలు
- అట్లాంటిక్ అడవుల్లో 8,275 ఘటనలు
- ఇతరత్రా 5,229 ఘటనలు

మొత్తం కార్చిచ్చు ఘటనలు **76,720**


బ్రెజిల్ అధ్యక్షుడు జెయిర్ బోల్సోనారో

### ఆర్పడానికి జీ7 అండ

**అ**మెజాన్ అడవుల్లో కార్చిచ్చుని ఆర్పడానికి అన్నివిధాల సాయపడడానికి జీ7 దేశాలు ముందుకొచ్చాయి. 2.2 కోట్ల అమెరికా డాలర్లు సాయం చేస్తామని ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. మంటలనార్పే విమానాలు పంపడానికి ఈ డాలర్లని వినియోగించాలని తెలిపింది. బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికాలతో కూడిన జీ7 సదస్సు అడవుల పునరుద్ధరణ ప్రణాళిక అంశంలో కూడా బ్రెజిల్‌కు ఆర్థిక సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది.

సాక్షి
మంగళవారం, ఆగస్టు, 27

# సింధు విజయం స్ఫూర్తిదాయకం

'విజేతల పతకాలు తయారయ్యేది చెమట, పట్టుదల, సాహసమనే అరుదైన మిశ్రమ లోహంతో'అని అమెరికన్ మల్లయోధుడు, ఒకనాటి ఒలింపిక్స్ స్వర్ణ విజేత డాన్ గేబుల్ అంటాడు. స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ఆదివారం ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాన్ని ఒడిసిపట్టి చరిత్ర సృష్టించిన తెలుగు తేజం సింధుకు ఈ మాటలు అక్షరాలా వర్తిస్తాయి. ఇంతక్రితం బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రెండుసార్లు త్రుటిలో చేజారిన స్వర్ణాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందుకోసం ఆమె నిర్విరామంగా శ్రమించిన తీరు అత్యద్భుతం. కనుకనే భారత బ్యాడ్మింటన్ చరిత్రలో స్వర్ణం సాధించిన తొలి క్రీడాకారిణిగా సింధు నమోదైంది. రెండుసార్లు కాంస్య పతకాలు, మరో రెండుసార్లు రజత పతకాలు గెల్చుకున్నా ఆమె సంతృప్తి పడలేదు. ఇప్పుడు బ్యాడ్మింటన్‌లో ప్రపంచ విజేతగా అవతరించిన ఈ క్షణంలో కూడా ఆమె వచ్చే ఏడాది జరగబోయే ఒలింపిక్స్‌లో సైతం తన సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. అక్కడ సైతం సమున్నత విజయాన్ని సొంతం చేసుకోవాలని కోరుకుంటోంది. సింధు చెప్పినట్టు ఈ చరిత్రాత్మక విజయం ఆమె బాధ్యతను మరింత పెంచింది. ఈ ఆట ఆమెపై ఉన్న అంచనాలను అనేక రెట్లు పెంచింది. బాసెల్‌లో జరిగిన పోరు వాస్తవానికి ఏకపక్షంగా సాగింది. కేవలం 37 నిమిషాల్లోనే తన ప్రత్యర్థి ఒకుహరను సింధు మట్టికరిపించింది. రెండేళ్లక్రితం అదే క్రీడాకారిణి తనను ఎదుర్కొన్న తీరు తలుచుకుని ఆద్యంతమూ దూకుడుగా ఆడింది. ఒకుహరకు ఈసారి ఏమాత్రం అవకాశమీయరాదన్న రీతిలో చెలరేగింది. కనుకనే తొలి గేమ్ 16 నిమిషాల్లోనే ఆమె వశమైంది. ఆ తర్వాత కూడా సింధు ఎక్కడా తగ్గలేదు. రెండో గేమ్‌లో సైతం ప్రత్యర్థికి ఊపిరాడనీయలేదు. సింధు ఆడిన తీరును గమనిస్తే అందులో ఆమె సాధించిన నైపుణ్యం కళ్లకు కడుతుంది. 2017లోనూ అంతే. అప్పుడు ఒకుహర విజయం సాధించి ఉండొచ్చుగానీ, ఆమెను సింధు చివరివరకూ ముప్పుతిప్పలు పెట్టింది. 110 నిమిషాలు సాగిన ఆ మ్యాచ్ ప్రపంచ క్రీడాభిమానులందరినీ ఎంతగానో అలరించింది. ఆనాటి చాంపియన్‌కు సింధు ఇప్పుడేమాత్రం అవకాశమీయలేదు. కేవలం 37 నిమిషాల్లోనే అంతా ముగించింది. వరస స్మాష్‌లతో, రిటర్న్‌లతో ఆమెను కోలుకోనీయలేదు. 2006లో 21 పాయింట్ల విధానాన్ని ప్రవేశపెట్టాక ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇంత ఏకపక్షంగా ముగిసిన మ్యాచ్ మరిలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది.

విజయాలు ఊరికే రావు. అందుకోసం ఎంతో కష్టపడాలి. త్యాగాలకు సిద్ధపడాలి. తినే తిండి మొదలుకొని ప్రతి విషయంలోనూ కఠోర నియమాలు పాటించాలి. అన్నిటికన్నా ముఖ్యం రోజూ సూర్యుడికన్నా చాలా ముందే మేల్కొని ఆటలో మెలకువలు నేర్చుకోవాలి. లోపాలను గుర్తించాలి. వాటిని పరిహరిస్తున్నామా లేదా అన్న స్పృహ ఉండాలి. ఈ క్రమంలో ఎక్కడా ఏకాగ్రత దెబ్బతినకూడదు. అప్పుడే నిండైన ఆత్మవిశ్వాసం కలుగుతుంది. ప్రత్యర్థి ఆట స్థాయిని అధ్యయనం చేసి, వారి అనుకూలతలనూ, ప్రతికూలతలనూ పసిగట్టడం, తాను ఎలాంటి మెలకువలు ప్రదర్శించాలో అంచనా వేసుకోవడం, అందుకు తగిన నైపుణ్యం సాధించడం చిన్న విషయం కాదు. క్రీడారంగం ఒక సమ్మోహన ప్రపంచం. అందులో విజేతగా నిలిచినంతకాలం జనం నీరాజనాలు పడతారు. పతకాలు, రివార్డులు వెదుక్కుంటూ వస్తాయి. ఆర్జన సరేసరి. అదే సమయంలో ప్రతి అడుగునూ పరిశీలిస్తూ, అదును చిక్కితే చాలు...విమర్శించడానికి సిద్ధపడేవారుంటారు. 'ఆమె టోర్నీలు చాలా బాగా ఆడుతుంది.కానీ ఫైనల్స్‌కొచ్చేసరికి గెలుపు చిక్కదు' అని నిట్టూర్చినవారెందరో! నిజమే...ఒలింపిక్స్, ఆసియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్‌షిప్స్, కామన్వెల్త్ గేమ్స్, సూపర్ సిరీస్, గ్రాండ్ ప్రిక్స్...ఆఖరికి నేషనల్స్‌లో సైతం సింధు ఫైనల్స్ వరకూ రావడం, ఆగిపోవడం రివాజుగా మారింది. మరొకరైతే వీటికి నిరాశ పడేవారు. ఇక విశ్రాంతి తీసుకుందామనుకునేవారు. కానీ అటు కీర్తిప్రతిష్టలనూ, ఇటు విమర్శలనూ సింధు సమంగానే తీసుకుంది. ఇవి తనపై ఏ ప్రభావమూ చూపలేకపోయాయి. తనలో పట్టుదల తగ్గలేదు. ఏకాగ్రత చెదరలేదు. స్వర్ణం సాధించాలన్న స్వప్నం కొడిగట్టలేదు. ఎవరికీ ఎలాంటి అంచనాలూ లేని 2013లో ప్రపంచ చాంపియన్‌షిప్ బరిలోకి దిగినప్పుడు చూపిన ఏకాగ్రతనే ఈనాటికీ కొనసాగిస్తూ వచ్చింది. వీటన్నిటి పర్యవసానమే ఆదివారం బాసెల్‌లో చేజిక్కిన విజయం.

మన దేశంలో క్రీడలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదు. చదువు పేరుతో, క్రమశిక్షణ పేరుతో పిల్లలను అదుపాజ్ఞల్లో ఉంచడం ఇంట్లోనూ, బళ్లోనూ కూడా కొనసాగుతోంది. వారు పెరిగి పెద్దయి రెండు చేతలా సంపాదించాలని, దర్జాగా బతకాలని కలలు కనడమే తప్ప...ఇతరేతర రంగాల్లో, ప్రత్యేకించి క్రీడల్లో తమ పిల్లలు రాణించాలని కోరుకునేవారి సంఖ్య అతి స్వల్పం. విషాదమేమంటే ఈ కొద్దిమందికీ కూడా మన దేశంలో అవకాశాలు తక్కువ. మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారిని సానబెట్టి మెరికల్లా తీర్చిదిద్దాలన్న కాంక్ష ప్రభుత్వాల్లో కలగడం లేదు. వివిధ క్రీడలకున్న సంఘాలకైనా సర్కారీ ప్రోత్సాహకాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. క్రీడాభివృద్ధి కోసం ప్రపంచ దేశాల్లో అనేకం భారీగా ఖర్చు చేస్తున్నాయి. అమెరికాలో క్రీడలకు తలసరి రోజుకు రూ. 22, బ్రిటన్ 50 పైసలు ఖర్చు చేస్తుంటే, ఆఖరికి జమైకాలాంటి చిరు దేశం కూడా తలసరి 19 పైసలు కేటాయిస్తుంటే మన దేశంలో మాత్రం కేవలం మూడు పైసలు మాత్రమే వ్యయం చేస్తున్నామని రెండేళ్లక్రితం అప్పటి కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ చెప్పారు. ఈ ధోరణి మారాలి. ప్రభుత్వాలు ఆ దిశగా ప్రయత్నిస్తే తల్లిదండ్రుల ఆలోచనల్లో కూడా మార్పు వస్తుంది. పిల్లల్ని ఆటలవైపు మళ్లిస్తే ఆరోగ్యపరమైన లాభాలతోపాటు వేర్వేరు క్రీడల్లో ప్రతిభావంతులు రూపుదిద్దుకుంటారు. ఇప్పుడు సింధు సాధించిన బంగారు విజయం అందరికీ స్ఫూర్తిదాయకమవుతుందని ఆశించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణ మాసం, తిథి బ.ఏకాదశి రా.12.44 వరకు,తదుపరి ద్వాదశి
నక్షత్రం ఆరుద్ర రా.11.48 వరకు,తదుపరి పునర్వసు
వర్జ్యం ఉ.8.32 నుంచి 10.06 వరకు, దుర్ముహూర్తం ప.12.26 నుంచి 1.16 వరకు, తదుపరి ప.2.56 నుంచి 3.46 వరకు
అమృతఘడియలు..ప.2.00 నుంచి 3.45 వరకు.

**సూర్యోదయం :** 5.48
**సూర్యాస్తమయం :** 6.17
**రాహుకాలం :** ఉ. 7.30 నుంచి 9.00 వరకు
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు

# గుల్లగా మారిన 'డొల్ల' ఆర్థికం!


ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''ఆర్థిక మందగమన పరిస్థితులు దేశ ఆర్థిక రంగంలో వివిధ రంగాలకు వేగంగా విస్తరిస్తున్నాయి. ఫలితంగా దేశంలో ఉద్యోగాలకు, సంపదకు విఘాతం కలుగుతున్నది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కుంగిపోతుండడం ప్రభుత్వానికి ఆందోళన కల్గిస్తోంది''

– భారత స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రజలనుద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం.(15.08.19)

''ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవలసిన ప్రజలు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను దేశాధినేత ఎంత గొప్పవాడైనా అతని పాదాక్రాంతం చేయకూడదు. అలాగే త్యాగాలతో నిర్మించుకున్న ప్రజాస్వామ్య సంస్థల్ని కూల్చేయగల అధికారాన్ని అలాంటి నేత చేతిలోనూ పెట్టరాదు. ఎందుకంటే ఇండియాలో మితిమీరిన భక్తి భావన లేదా వీరారాధన తత్వమనేది రాజకీయాల్లో చొరబడే లక్షణాలు ఎక్కువ. రాజకీయాల్ని ప్రభావితం చేసే ఈ చెడు లక్షణం ప్రపంచంలోని ఏ ఇతర దేశంలోనూ లేదు. రాజకీయాల్లో 'భక్తి' అనే ఆరాధనాతత్వం పతన దశకు తద్వారా నియంతృత్వానికి నిస్సందేహంగా రాచమార్గం''

– రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రాజ్యాంగ నిర్ణయ సభలో చేసిన ఆఖరి ప్రసంగంలో హెచ్చరిక(25.11.1949)

కునారిల్లుతున్న దేశ ఆర్థిక పరిస్థితుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ, ఆరెస్సెస్ నేతలు మొదటి అయిదేళ్ల పాలనలో దేశ ప్రజలకు వాస్తవాలు కనబడకుండా దాచిపెట్టినా, రెండోసారి(2019) పరిపాలనా పగ్గాలు చేపట్టిన తొలి మాసాల్లోనే కఠోర సత్యాలను గుర్తించక తప్పని పరిస్థితులు ఎదురయ్యాయి. దీనికితోడు ఏలినాటి శనిగా మారిన 'కశ్మీర్ కొరివి'తో తలగోక్కోటానికి మన పాలకులు అలవాటు పడ్డారు. పాత, కొత్త పాలకులకు 'అభివృద్ధి' అనేది ఒక మంత్రంగా మారినంత మాత్రాన దేశ ప్రజాబాహుళ్యం ఆర్థిక పరిస్థితులలో, జీవనవిధానంలో, విద్య, వైద్యం,ఆరోగ్య విషయాలలో పెనుమార్పులు రావు. కనుకనే వారు 'పూత మెరుగులతో' కాలక్షేపం చేస్తూ రావటం జరుగుతోంది. అధ్వానమవుతున్న దేశ ఆర్థిక పరిస్థితులకు ప్రస్తుత పాలకులు గత పాలకుల్ని ఆడిపోసుకోవడం ద్వారానో, లేక సంక్షోభానికి బయటి శక్తుల్ని కారణంగా చూపడం ద్వారానో కాలక్షేపం చేస్తున్నారు. 2014 నుంచి కడచిన అయిదేళ్ల పాలన మత విద్వేషాలు రెచ్చగొట్టడం, వేధింపులు, హత్యలు వగైరాలతో గడిచిపోయింది. ''అభివృద్ధి'' మంత్రం నోట్ల రద్దుతో ప్రారంభమై చిన్న, మధ్య తరగతి వ్యాపార వర్గాల, రైతు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసి, కొన్ని ఆత్మహత్యలకు దారితీసింది. బ్యాంకులు, ఏటీఎంలు డబ్బు కొరత వల్ల పలుసార్లు మూతపడటంతో చిన్న వ్యాపారులు, సన్నకారు రైతాంగం అల్లల్లాడారు. బాగుపడిందెవరయ్యా అంటే బడా వ్యాపారులు, ప్రయివేట్ రంగంలో కోటికి పడగలెత్తినవారూ! ఇంతకీ పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రయోజనం పొందింది ఎవరన్న ప్రశ్నకు రెండురకాల వదంతులు బలంగా వ్యాప్తిలోకి వచ్చాయి. (1) పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 80–84 సీట్లతో ఏ పార్టీకి ఆధిక్యం వస్తే ఆ పార్టీకి పార్లమెంటులోనూ మెజారిటీ లభిస్తుంది. అలాగైతేనే దక్షిణాది రాష్ట్రాలపైనా పెత్తనం చెలాయించడం సాధ్యమవుతుంది. ఉత్తరప్రదేశ్‌లో మెజారిటీ ఎంపీ స్థానాలు దక్కాలంటే ఆ రాష్ట్రంలో సొంత ప్రభుత్వం ఉండటం అవసరం. కనుక ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో నెగ్గడానికి అవసరమైన డబ్బు ప్రవహింపజేయడం కోసం పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నారని, (2) కశ్మీర్ సరిహద్దుల్లో ''ఆకస్మిక దాడుల'' నిర్వహణకు భారీ మొత్తంలో నిధులు మళ్లాయనీ–వదంతులు వ్యాపించాయి. ఆకస్మికంగా నోట్ల రద్దును ప్రకటించి, కొత్త నోట్లకు తెరలేపడానికే బీజేపీ పాలకులు రూ. 20,000 కోట్లు ఖర్చు పెట్టాల్సివచ్చిందని పత్రికల వార్తలు వెల్లడించాయి!

ఇలాంటి పెక్కు వివాదాస్పద నిర్ణయాలతో బీజేపీ తొలి అయిదేళ్ల పాలన ముగియనున్న తరుణంలో దేశవ్యాప్తంగా, ప్రజల్లో ఏర్పడిన తీవ్ర అసంతృప్తిని చల్లార్చడానికి సరిహద్దుల రక్షణలో ''ఆకస్మిక దాడుల''ను (సర్జికల్ స్ట్రయిక్స్) చూపించి దేశ రక్షణకు బీజేపీయే శ్రీరామరక్ష అన్న వాదనను పాలకులు సమర్థవంతంగా ప్రజల్లోకి నెట్టగలిగారు. తొలిసారి పాలనలో అభివృద్ధి నామమాత్రం కావడంతో 2019 ఎన్నికల కోసం బీజేపీ పన్నిన వ్యూహం, ఎత్తుగడలు ఓ పెద్ద కలగూర గంప రాజకీయ వ్యూహాన్ని తలపించాయి. దేశ ఆర్థిక పరిస్థితిలో అభివృద్ధి మాట వచ్చేసరికి కాంగ్రెస్ పాలకులు

### రెండో మాట



జంకిన కొన్ని విషయాల్లో బీజేపీ పాలకులు 'ముందంజ' వేశారు! ఎలాగంటే, ఒకప్పుడు తొలి ప్రధాని పండిట్ నెహ్రూ దేశ స్వాతంత్ర్యానికి కొలది మాసాల ముందుగా ఒక ప్రకటన చేస్తూ 'స్వాతంత్ర్యానంతరం కూడా దేశాన్ని కొల్లగొట్టిన విదేశీ గుత్త పెట్టుబడి సంస్థల్ని కొనసాగించడం దేశాభివృద్ధికి ఆటంకమ'ని చెప్పగా ఇప్పుడు బీజేపీ పాలకులు దానికి విరుద్ధమైన బాణీ అందుకున్నారు. అది 'విదేశీ వాణి'గానే ఉందిగానీ, దేశీయవాణిగా లేదు! మరీ విడ్డూరమూ, అసత్యమూ, అభ్యంతరకరమూ అయిన అంశం–రెండోసారి పాలనకు వచ్చిన ప్రధాని మోదీ కొన్ని రోజులనాడు విదేశీ పర్యటనలకు వెళ్లిన సందర్భంలో పారిస్‌లో చేసిన ఒక ప్రసంగంలో చెప్పిన మాటలు: 'అవినీతికి, బంధుప్రీతికి తావులేకుండా, ప్రజాధనం లూటీ కాకుండా చూడ్డంలో బీజేపీ పాలన విజయం సాధించింది. ఈ విజయం మేము నవభారత నిర్మాణంలో భాగంగా చేశాం'అని. ఇది హాస్యాస్పద ప్రకటన. ఎందుకంటే, విదేశీ బ్యాంకుల్లో భారతీయ పెట్టుబడిదారులు దాచుకున్న దొంగ డబ్బు విలువ రు. 25 లక్షల కోట్లనీ, ఆ అక్రమ ధనరాశుల్ని ఇండియాకు రప్పించి దేశంలోని పేద కుటుంబాలకు రూ. 15లక్షల చొప్పున పంచేస్తానని 2014 ఎన్నికలకు ముందు బాహాటంగా ప్రకటించిన వ్యక్తి మోదీ! కానీ జరిగిందేమీ లేదు. బహుశా అందుకే ఈ చిత్రవిచిత్ర భారతదేశ పరిస్థితుల్ని పిన్న వయస్సులోనే పసిగట్టకల్గిన వీర భగత్సింగ్ 1920 నాటికే ముందస్తుగా ఒక హెచ్చరిక చేసి ఉరికంబమెక్కాడు. ''దేశ స్వాతంత్ర్యానంతరం ఒక్క విదేశీ గుత్త పెట్టుబడి వర్గాలే గాక, దేశీయ గుత్తపెట్టుబడివర్గాలు కూడా జోడుకూడి, జమిలిగా భారత ప్రజల్ని దోచుకుతింటార''ని హెచ్చరించిన క్రాంతదర్శి అతను!

రెండోసారి పాలనకు వచ్చిన బీజేపీ పాలకులు దేశ ఆర్థిక పరిస్థితులు ఎందుకు మెరుగుపడలేదని అడిగితే 'తాడిచెట్టు ఎందుకెక్కావంటే దూడ మేత కోసం' అన్న చందాన జవాబిస్తున్నారు. ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ప్రబలుతున్నందువల్లనే ఆర్థిక పరిస్థితి సరిగా లేదని చెబుతున్నారు. అయినా 'ఉట్టికెక్కలేనివాడు స్వర్గానికి నిచ్చెన వేసినట్లు'గా తొలి అయిదేళ్ల పాలన మరచిపోండి, వచ్చే అయిదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ 'అయిదు ట్రిలియన్ డాలర్ల విలువ'(అయిదు లక్షల కోట్ల డాలర్ల)కు చేరుస్తామ'ని అంటున్నారు. ఒకవేళ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను అమెరికా తన డాలర్‌తో శాసిస్తోందని అనుకున్నా దాన్నుంచి బయటపడే మార్గం గురించి ఆలోచించి నిర్ణయాలు చేయలేనంతకాలం సంక్షోభాలు, ఆర్థిక మాంద్యాల బెడదనుంచి భారత్‌లాంటి దేశాలు తప్పించుకోలేవు. ఇక్కడ చైనా ఉదాహరణ చెప్పుకోవాలి. అమెరికా పాలకుడు ట్రంప్ చైనా నుంచి వచ్చే సరుకులపై సుంకాలు బాగా పెంచేసి ఆ దేశాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. కానీ అసలు రహస్యం–చైనా నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులన్నీ చైనాకు ఎగబాకిన అమెరికన్ కంపెనీలవే! చైనా వనరులపై ఆధారపడి అక్కడే ఉత్పత్తి చేసి ఆ సంస్థలు అమెరికాకు పంపుతున్నాయి. ఈ వాస్తవాన్ని ట్రంప్ 'ఉల్టా' చేసి ప్రపంచానికి చూపుతున్నాడు. ఇదే నిజం కాకపోతే చైనా ఉత్పత్తులపై సుంకాలు పెంచికూడా, వాణిజ్యయుద్ధం చేస్తున్నామని చెబుతూ కూడా అమెరికా ఆ దేశంతో ఎందుకు రాజీ పడుతున్నట్టు? చైనా అనుసరించిన ఈ వ్యూహాన్నే మన పాలకులు ఎందుకు అమలు చేయలేకపోతున్నారు? మొన్నటి దాకా అమెరికా నుంచి వస్తున్న వస్తువులపై మనం విధిస్తున్న సుంకాలను మనపై ఒత్తిళ్లు తెచ్చి ఆ దేశం తగ్గించుకుంది. ఇంకా మరిన్ని వస్తువులపై తగ్గించాలని ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారు. కాగా మనం ఏం చేస్తున్నాం? నోరు మూసుకుని 'చిత్తం, అలాగే' అంటున్నాం! మన పాలకులు ఏమాత్రం విదేశీ గుత్త కంపెనీలపైన సుంకాలు పెంచినా, ఆ కంపెనీలు స్టాక్ మార్కెట్లనుంచి అర్ధంతరంగా పెట్టుబడులను ఉపసంహరించుకుని ఉడాయించి మార్కెట్లను దెబ్బతీస్తున్నారు. ఇలా ఆకస్మికంగా తరలించుకుపోయిన పెట్టుబడులు (ఒక్క రోజులోనే)విలువ రూ. 25,000 కోట్లు. దీంతో జరిగిన పనేమిటి, బీజేపీ పాలకులు చూపిన విరుగుడేమిటి? విదేశీ గుత్త పెట్టుబడి కంపెనీలపైన పెంచిన సర్‌చార్జి ఆదాయపు పన్నును రద్దు చేస్తూ లొంగిపోవడం!

బహుశా అందుకే సుప్రసిద్ధ రాజ్యాంగ వ్యాఖ్యాత, అమెరికన్ అటార్నీ, మానవ హక్కుల పరిరక్షణా సంస్థ ప్రతినిధి జాన్ వైట్‌హెడ్ ''మూడే మూడు మాటలతో'' ప్రారంభమయ్యే అన్ని దేశాల రాజ్యాంగాల గురించి ఇలా అన్నాడు: ''ఆ మూడు అందమైన మాటలు– ''మేము అంటే ప్రజలం''అని. మనం లేకుండా, మన శ్రమ లేకుండా సంపదైశ్వర్యాలు... మనం సృష్టించే ఆర్థిక వ్యవస్థ లేకుండా ప్రభుత్వాలు, పాలకులు ఉండరు. అయినా విచారకరమైన 'పచ్చి' వాస్తవం–మన మనస్సులను కుదిపి కదపలేకపోవటం! ఎందుకని? దేశ పాలనా రథానికి రథికులు(డ్రైవర్లు)అయినవారు నిద్రపోవటం వల్ల వాస్తవాలు కనుమరుగవుతున్నాయి. మనం ప్రశ్నించడం మానుకున్నాం, మనం శాసనవేదికలకు పంపిన ప్రతినిధులు రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి ఉండేలా కట్టడి చేయడంలో విఫలమవుతున్నాం, ఫలితంగా పాలకులు మన నెత్తిపైన ఎక్కి అసాధారణ అధికారాన్ని చెలాయిస్తున్నారు. ప్రజలను అణిచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజలు నిద్రమత్తు వదలకపోతే మన మీద విరుచుకుపడ్డానికి కాచుక్కూర్చున్న మృగాన్ని అదుపు చేయటం కష్టమని గ్రహించాలి''(ఏ గవర్నమెంట్ ఆఫ్ వోల్వ్స్–తోడేళ్ల ప్రభుత్వాలు)!!

abkprasad2006@yahoo.co.in

## సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### సోషల్ మీడియా

### వాస్తవం



"నేను ఇప్పుడే కశ్మీర్ నుంచి వచ్చా. అక్కడ అంతా సాధారణంగానే ఉందని వస్తున్న కథనాల గురించి ముఖ్యంగా చెప్పాలనుకుంటున్నా. కశ్మీర్ పూర్తిగా స్తంభించిపోయింది. దుకాణాలు, ఇంటర్నెట్, పాఠశాలలు, ఫోన్లు.. ఏమీ లేవు. ఏదీ తెరుచుకోవడం లేదు, చేయడానికేమీ లేదు, ఎక్కడికీ వెళ్లడానికి లేదు. శ్రీనగర్‌లో చాలా ప్రాంతాలు ఖాళీ. ఆలోచించగలిగే పౌరులు కళ్లు తెరిచి ఏం జరుగుతోందో చూడండి. సంకుచితతత్వంతో సాగుతున్న ప్రచారాన్ని ఖండించండి. వీలైతే ఓసారి కశ్మీర్ వెళ్లి రండి. మీ అందరి ఆమోదం ఉందంటూ ప్రభుత్వం ఏం చేస్తోందో చూడండి. "

– రాజేష్ వేణుగోపాల్, విద్యావేత్త

### స్థాయి



"భారత్ పాక్ సంబంధాలపై ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోదీ హిందీలో సమాధానాలు ఇవ్వడంపై స్పందిస్తూ వాస్తవానికి ఆయన మంచి ఇంగ్లిష్ మాట్లాడతారు. కానీ ఆయనకు మాట్లాడటం ఇష్టం లేదంతే అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. అధికార రాజకీయాల దగ్గరకు వచ్చేసరికి ప్రపంచంలోని రాజకీయ నేతలంతా ఒకరినొకరు బాగానే అర్థం చేసుకుంటారు కదా."

– సాగరికా ఘోష్, జర్నలిస్ట్

### తప్ప



"తప్పుల తర్వాత తప్పుల వరుస పెట్టి చేస్తున్న ప్రభువులకు ఏం చేయాలో పాలుపోదు. అందుకని వాళ్లు మళ్లీ తప్పులు చేస్తూనే ఉంటారు. తమ తప్పుల్ని ఎత్తి చూపే వారిని వారు అసలు సహించలేరు. అంతేకాదు, అది తప్పు అని చెప్పినవారిపై ఆగ్రహం వెళ్లగక్కుతూ హతమార్చడానికి వెనుకాడరు. "

– దేవ్‌దత్ పట్నాయిక్, కాలమిస్టు

### ఆహ్వానం



"ఇక్కడి సాధారణ పరిస్థితులను పరిశీలించడానికి తాను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఆహ్వానిస్తున్నానని కశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెబుతారు. పాలనా విభాగం వారేమో ఆయన వస్తే శాంతిభద్రతలకు భంగం అంటారు. ఎయిర్‌పోర్టు నుంచి తిప్పి పంపేస్తారు కానీ, గవర్నర్ సార్.. పాలనా విభాగం మీ అధీనంలోనే ఉంటుంది. మీరే ఆహ్వానించారు కూడా. "

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

### మారక్ శక్తి



"బీజేపీ నేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీల మరణానికి ప్రతిపక్షం ప్రయోగించిన మారక్ శక్తే కారణమని సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్ వ్యాఖ్యానించడం ఎంత అవమానకరం! భోపాల్ ప్రజలు తమ ప్రతినిధిగా ఆమెను ఎందుకు ఎన్నుకున్నారో నాకు అర్థం కావడం లేదు. "

– తానీషా గుప్తా, విద్యార్థిని

### ఆట



"ఎన్ని వీలైతే అన్ని ఆటలు ఆడండి. ప్రతి ఆటలోనూ దానిదైన ఆనందం ఉంటుంది. అది మనలోని శారీరక, మానసిక శక్తిని ప్రేరేపిస్తుంది. స్క్వాష్ మాస్టర్ రిత్విక్ భట్టాచార్యతో కలిసి ఆడటం బావుంది. ఆటకు సంబంధించి కొన్ని మెళకువలు తెలుసుకున్నా. "

– సచిన్ టెండూల్కర్, క్రికెటర్

# అణచివేతతో సాధించేది శూన్యం

**మితవాద జాతీయ శక్తుల దృఢమైన విశ్వాసాలు వాస్తవపరీక్షకు, హేతుబద్ధతకు నిలబడేవికాదు. కశ్మీర్ గడ్డలోని వైవిధ్యతను హత్తుకోవడమే అక్కడి ప్రజల హృదయాలనూ, మనసులనూ గెలవడానికి గల అత్యుత్తమ మార్గం. అందుకు వాజ్‌పేయి విధానాలు అనుసరించడమే ఉత్తమం**


శేఖర్ గుప్తా

ఇంతకు ముందు మనం ఉదారవాదుల్లో జమ్మూ–కశ్మీర్‌పై గూడు కట్టుకున్న అయిదు ప్రధానమైన కల్పితాలను ప్రస్తావించాం. అసలైన కఠోర వాస్తవాలు ఏమిటో చెప్పాం. ఈసారి మనం మితవాద జాతీయ శక్తుల్లో పేరుకుపోయిన విశ్వాసాలేమిటో పరిశీలిద్దాం. నరేంద్ర మోదీ–బీజేపీలకుండే అసంఖ్యాకమైన వోటర్లను పరిగణనలోకి తీసుకుంటే దీన్నొక అతి పెద్ద సమూహంగా భావించాలి. ఈ సమూహానికి 370 అధికరణ, కశ్మీరీ నేతల ద్రోహచింతన ప్రధాన సమస్య. ఆ రాష్ట్రానికి దేశ పాలనా వ్యవస్థ సమష్టిగా అన్యాయం చేసిందని తెగ బాధపడిపోయే ఉదారవాదుల భావన వంటిదే ఇది. బహుశా దానికన్నా ఒకింత ప్రబలమైనదనే చెప్పాలి. క్షేత్రస్థాయి వాస్తవాలు, నిజానిజాలపై అవగాహనలేమి నుంచే మితవాద జాతీయ భావావేశం పుట్టుకొచ్చింది.

మితవాద, వామపక్ష, మధ్యేవాద అపోహలు జాతీయ ప్రయోజనానికి లేదా కశ్మీరీ సమస్య పరిష్కారానికి ఏమాత్రం తోడ్పడవు. కనుకనే మనం వాస్తవాలు, హేతుబద్ధతలపై వెలుగును ప్రసరింపజేయాలి. నమ్మకాలు మనోహరంగానే ఉంటాయి. కానీ అవి వాస్తవాధారితాలు కాకపోతే ప్రమాదభరితమవుతాయి. అందుకే జాతీయవాదుల్లోని అయిదు ప్రధాన అపోహలేమిటో చూద్దాం.

అందులో మొదటిది, కీలకమైనది 370 అధికరణ, దానిద్వారా కశ్మీర్‌కి దక్కిన స్వయంప్రతిపత్తి. వారి దృష్టిలో ఇదే సమస్యకు మూలం. సరే ఇప్పుడది ఎటూ ముగిసిపోయింది. కొత్త చరిత్రను సృష్టించారు. కానీ సమస్య కూడా అలా ముగిసిపోతుందా? కొత్త చరిత్ర సృష్టించినంత మాత్రాన పాతది తుడిచిపెట్టలేం. జాతి చేతనలోనూ, కశ్మీర్‌లోనూ 370 అధికరణ చాలా ఉద్వేగభరితమైనది. అలాగే గత 69 ఏళ్లుగా అది తాత్కాలికమైనదిగానే ఉండిపోయింది. చివరికది తన పూర్వపు రూపానికి ఒక నీడలా కూడా మిగలనంతగా నీరుగారింది. వీపీసింగ్ మినహా మన ప్రధానులంతా దాన్ని నీరుగార్చడానికే ప్రయత్నించారు. మోదీ ప్రభుత్వం ఈ నెల మొదట్లో రద్దు చేయడం లాంఛనప్రాయం మాత్రమే. కేవలం రక్షణ, విదేశీవ్యవహారాలు, ఆర్థిక, కమ్యూనికేషన్ వ్యవహారాల్లో మాత్రమే కేంద్రం ప్రమేయం ఉంటుందన్న నియమం కాస్తా ఇప్పుడు రద్దయి రాజ్యాంగంలోని 395 అధికరణల్లో 290 దానికి నేరుగా వర్తించేలా మారింది. కొన్ని ఇతర సమస్యలైతే ఉన్నాయి. వాటిల్లో స్థానికేతరులను పెళ్లాడే కశ్మీరీ మహిళలకు వారసత్వ హక్కు నిరాకరించడం, వారి పిల్లల్ని కశ్మీరీలుగా గుర్తించకపోవడం, తక్షణ తలాక్‌పై, స్వలింగసంపర్కుల విషయమై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు వర్తింపజేయకపోవడంవంటి అంశాలపై వచ్చే డిమాండ్లు ఉదారవాద కోర్కెలే. పాక్‌ను దురాక్రమణదారుగా, అక్కడి అలజడికి ప్రధానకారకంగా భావించడం కూడా ఈ కేటగిరీలోని కాల్పనికతలే.

రెండోది–1948 మొదలుకొని జాతీయవాద చర్చల్లో ఉన్నది మన సైన్యానికి సంబంధించింది. పాకిస్తానీలనుంచి గిల్గిట్–బాల్టిస్తాన్‌లతోసహా

### జాతిహితం



మన కశ్మీర్ భూభాగం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా నెహ్రూ మెతకగా వ్యవహరించి ఐక్యరాజ్యసమితి మెట్లెక్కారని, అదే గనుక సర్దార్ పటేల్‌కు అప్పగించి ఉంటేనా...అనేది ఆ కాల్పనికత సారాంశం. కానీ వాస్తవం వేరు. అది మారదు. దాన్నెవరూ మార్చలేరు. 1947–48 మధ్య రెండు సీజన్‌లలో సాగిన యుద్ధానికి శీతాకాలంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇరు దేశాల సైన్యాలకు సంబంధించి మీకు అందుబాటులో ఉన్న మిలిటరీ పత్రాలు చూడండి. భౌగోళిక, క్షేత్రస్థాయి, సైనిక వ్యూహతంత్ర, శక్తిసామర్థ్యాలను గమనించండి. పురోగమనానికి ఇరుపక్షాలకు ఉండే అవరోధాలు అర్థమవుతాయి. బహుశా తొలి దశ మొదట్లోనే... అంటే నవంబర్, డిసెంబర్ మధ్య ప్రయత్నిస్తే ఉడి వద్ద మన దళాలు పురోగమించి ముజఫరాబాద్‌లోనికి చొచ్చుకొని వెళ్లగలిగేవి. అయితే బనిహాల్ మార్గం మంచుతో కూరుకుపోతే తప్ప విమానాల ద్వారా లేదా రోడ్డు మార్గంలో దళాల తరలింపు సాధ్యం కాదు. ఇరు దేశాల్లో ప్రచారంలో ఉన్న భిన్న కథనాలు 1948లో అయితే సులభంగా విజయం చేజిక్కేదని చెబుతాయి. కానీ ఇవన్నీ పోటాపోటీ కల్పనలు. ఒక సంగతి గుర్తుంచుకోండి. ఈ యుద్ధ సమయానికి ఇరు దేశాల సేనలనూ బ్రిటిష్ చీఫ్‌లే నడిపించారు. విభజన తర్వాత సైన్యం కేటాయింపు సమంగా జరగలేదు. పాకిస్తాన్‌కు అవిభక్త సైన్యంలో మూడోవంతు, ఆర్థికంలో ఆరో వంతు దక్కింది. ఈ పరిస్థితి దేశాన్ని దెబ్బతీసింది. 1947–48లో సైనికపరంగా ఉన్న ఆ అగాథంతో హిమవన్నగాలపై విజయకేతనం ఎగరేయడం అసాధ్యం. ఆ సంగతలా ఉంచి ఇప్పుడు ఆక్రమిత కశ్మీర్ నుంచి పాకిస్తాన్‌ను తరిమేయడం సాధ్యమేనా? అది కుదరని పని అని ఎంతో వినమ్రంగా చెబుతున్నాను. 1948 నుంచి మనం అనేక యుద్ధాలు, ఘర్షణలూ చూశాం. చివరికి మనం స్వాధీనం చేసుకున్నది సియాచిన్ మంచుపర్వత శ్రేణి. కొన్ని కమాండో–కామిక్ చానళ్లను కాస్సేపు పక్కనబెడితే పాకిస్తాన్ సైన్యాలు ఆత్మరక్షణలో దిట్ట అని మనం గుర్తుంచుకోవాలి. 1948లో కోల్పోయిన భూభాగం పునఃస్వాధీనమైనా,ఆక్రమిత కశ్మీర్‌ను జయించడమైనా అహేతుకమైన పుక్కిటి పురాణాలేనని తెలుసుకోవాలి.

మూడోది–కశ్మీరీలు వినయవిధేయతలున్నవారు, శాంతస్వభావులు, దేశభక్తి మెండుగా ఉన్నవారు. కానీ పాకిస్తానీ ప్రచారంతో, మిలిటెంట్ ఇస్లాంతో సైద్ధాంతికంగా కలుషితమయ్యారు. కొన్నాళ్లక్రితం వరకూ అయితే మొదటిది సత్యం. ఈ మూడు దశాబ్దాల తిరుగుబాటు ఉద్యమాల తొలినాళ్లలో చాలామంది సాయుధులు పాకిస్తాన్‌కి చెందినవారే. 90వ దశకం మొదట్లో ఆఫ్రికా, అరబ్ దేశాలనుంచి ఐఎస్ఐ ప్రాపకంతో వచ్చిన జిహాదీలను కశ్మీరీలు ఛీత్కరించుకునేవారు. కానీ పదేళ్లుగా ఈ తిరుగుబాట్లు దేశీయమయ్యాయి. కశ్మీరీ యువత ఆగ్రహంతో, అవమానభారంతో రగిలిపోతోంది. ఆయుధాలు పట్టడానికి సిద్ధపడుతోంది. మరణించిన లేదా పట్టుబడిన మిలిటెంట్ల నేపథ్యాలు చూస్తే ఇది ధ్రువపడుతుంది. మిలిటెంట్లకు అవసరమైన ఆయుధాలు లోయలో విస్తారంగా ఉన్నాయి. మరిన్ని సరఫరా చేయడానికి పాకిస్తాన్‌కు లోటులేదు. కశ్మీర్ కేంద్రం పరిధిలోకి వెళ్లింది గనుక పోలీసులపై నియంత్రణ ఉంటుంది. కానీ అది ఉగ్రవాదానికి చరమగీతం పాడలేదు.

నాలుగు–కశ్మీరీలకు పెట్టుబడులు,ఆర్థికాభివృద్ధి అవసరమనేది వాదన. దీన్ని నమ్మడమంటే మానవ మనస్తత్వాన్ని అడ్డగోలుగా అపార్థం చేసుకోవడమే. అక్కడి ప్రజల ఆగ్రహాన్ని, అవమానాలను, పరాయీకరణను పట్టించుకుని సరైన పరిష్కారం చూపకపోతే ఎంత ఆర్థికాభివృద్ధి అయినా, ఉదారత అయినా జన హృదయాలను మార్చలేవు. ఆస్తుల్ని కొనిపించడంద్వారా, బయటివారిని అక్కడ స్థిరపరచటం ద్వారా, అక్కడి మహిళలను పెళ్లాడటం ద్వారా... అసంబద్ధంగా, మొరటుగా జనాభా సమతూకాన్ని మార్చేస్తామంటే అది పరిస్థితిని మరింతగా దిగజారుస్తుంది. జమ్మూ–కశ్మీర్ భారత్ భూభాగం. దాన్నెవరూ కైవసం చేసుకోలేరు. కానీ లోయలోని ప్రజలు మీతో లేకుంటే దాన్ని మీరు మార్చలేరు.

ఇక చివరిది, అయిదోది అత్యంత సున్నితమైన కాల్పనికత. ఇది స్వీయ వినాశనానికి చేరువ చేసేంత ప్రమాదకరమైనది కూడా–అది జనాభా సమతూకాన్ని మార్చాలనుకోవడం. ఇజ్రాయెల్ గుణపాఠాలను, వాటి సారాంశాన్ని సరిగా గ్రహిస్తే మీరసలు ఆ పనికే పూనుకోరు. ఇక్కడ కశ్మీర్ భూభాగం మన స్వాధీనంలోనే ఉంది. పాకిస్తాన్, చైనాలు తప్ప ప్రపంచంలో అందరూ దీన్ని గుర్తించారు. కానీ ఇజ్రాయెల్‌కు అలా కాదు. అది యూదు దేశమైతే, మనది లౌకికవాద గణతంత్రం. కశ్మీర్‌లో అది సాధ్యపడాలంటే కోటిమంది హిందువులను అక్కడ స్థిరపరచాలి. అది చైనాలో సాధ్యమేమోగానీ ఇక్కడ కాదు. అలాంటి పని చేసి కూడా అది టిబెట్‌లోగానీ, జిన్‌జియాంగ్‌లోగానీ ప్రశాంతంగా ఉండలేకపోతున్నది. అటు ఇజ్రాయెల్‌కు కూడా ఈ పని భద్రతను, సుస్థిరతను చేకూర్చలేకపోయింది.

చైనా, ఇజ్రాయెల్ దేశాల కఠినత్వం మనల్ని విస్మయపరుస్తుంది. కానీ వీటికి లేని సామర్థ్యం మనకుంది. వైవిధ్యతను సులభంగా హత్తుకునే సామర్థ్యమది. కశ్మీర్‌కు చేరువ కావడానికి అదే అత్యుత్తమ విధానం. హృదయాలను, మనసులను గెలవడానికి అదే మార్గం. వారి ఆత్మగౌరవానికి, వారి ప్రతిష్ఠకూ, వారి విలక్షణతను పరిరక్షించడానికి పాకిస్తాన్ కన్నా మనం మెరుగైన ప్రతిపాదన చేయగలమా? ఇప్పుడు మనం వాజపేయి విధానాల ద్వారా నేర్చుకోవాలి తప్ప జీ జిన్‌పింగ్ విధానాలద్వారా కాదు.

వ్యాసకర్త ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ మంగళవారం
27-8-2019



కీర్తి... మిస్ ఇండియా



బ్రేకప్

– సినిమా పేజీలో



ఫొటో: శివ మల్లాల

# అంత కష్టపడకురా అంటున్నారు

**ప్రభాస్ ఫుల్ బిజీ...**
**రెండేళ్లుగా 'సాహో' సినిమాతో బిజీ.**
**ఇప్పుడు 'సాహో' ప్రమోషన్స్‌తో బిజీ.**
**బెంగళూరు, ముంబై, చెన్నై.. అంటూ 'సాహో' కోసం జర్నీలు చేస్తూ బిజీ.**
**కొడుకు ఇంత బిజీగా ఉంటే ఏ తల్లికైనా ఆనందమే.**
**కానీ కొడుకు ఎంత స్టార్ అయినా, 'ప్యాన్ ఇండియన్ సూపర్ స్టార్' అయినా తల్లికి కొడుకే.**
**మరి ఈ బిజీ సన్‌కి తల్లితో కలిసి భోజనం చేసే తీరిక ఉందా?**
**కొడుకుకి ఇంత పేరు వచ్చినందుకు ఆ తల్లి ఫీలింగ్ ఏంటి?**
**తనయుడు చేసిన సినిమాలన్నీ బాగున్నాయనే ఆ తల్లికి అనిపిస్తుందా?**
**విమర్శను నిక్కచ్చిగా చెబుతారా?**
**ఇలాంటి విశేషాలతో పాటు 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో**
**ప్రభాస్ చాలా విషయాలు చెప్పారు.**

- **మీరు చాలా మొహమాటస్తులు. 'బాహుబలి' నుంచి కొద్దిగా అవుట్ స్పోకెన్ అయ్యారు. ఈ మార్పుని మీరు గమనించా...?**

ప్రభాస్: (మధ్యలోనే అందుకుంటూ) బాగా మాట్లా డేస్తున్నాను కదా? ఎంటర్‌టైన్ చేసేస్తున్నాను కదా? ఇలా మాట్లాడటం నాకే అడ్వాంటేజ్. బాగా మాట్లాడితే బాగా రాస్తారు. ఇంతకు ముందు ఇంటర్వ్యూ అంటే 'అమ్మో రేపటి నుంచి ఇంట ర్వ్యూలు' అని చిన్న టెన్షన్ వచ్చేది. కానీ ఇప్పుడు ఎంజాయ్ చేస్తున్నాను.

- **'బాహుబలి' రూపంలో మీ కెరీర్‌లో ఓ అద్భుతం జరిగింది. ఈ అద్భుతం తర్వాత మీ స్టేట్ ఆఫ్ మైండ్ ఎలా ఉంది?**

భయంకరమైన లక్ ఉంటే కానీ 'బాహుబలి' లాంటి సినిమాలు రావు. అది నాకు జరిగింది. ఒక అద్భుతం జరిగిపోయింది. అయితే ఇప్పట్లో మళ్లీ అంత ఒత్తిడి పెట్టుకోవాలనుకోలేదు. కానీ వెంటనే 'సాహో'లాంటి సినిమా చేయాల్సి వచ్చింది. అన్నీ పక్కన పెట్టేసి ఇంకొక్కసారి కష్టపడదాం అని రెండేళ్లు శ్రమించాం. 'బాహుబలి'కి ముందే నా ఫ్రెండ్స్ (యువీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్)తో సినిమా చేయాలని డిసైడ్ అయిపోయాను. 'బాహు బలి' వర్కౌట్ అవ్వకపోయినా నెక్ట్స్ వీళ్లతోనే అను కున్నా. నా ఫ్రెండ్స్ నా కంటే పిచ్చోళ్లు. విపరీతంగా ఖర్చు పెట్టి 'సాహో' తీశారు.

- **జీవితంలో అనుకోని 'అద్భుతం' జరిగినప్పుడు మన ఆలోచనా విధానం కూడా మారిపోతుంది. అలాంటి మార్పు ఏదైనా మీలో వచ్చిందా?**

అలా ఏం మారలేదు. మే బీ నాకు తెలియదే మో? అది డెస్టినీ అవ్వచ్చు. అయితే అంతకుముందు 'లక్' అనే విషయాన్ని నేను ఎక్కువగా నమ్మేవాణ్ణి కాదు. ఒక టైమ్ తర్వాత ఉంటే ఉంటాయి. మన పని మనదే అనుకునేవాణ్ణి. కానీ 'బాహుబలి' తర్వాత కొంచెం నమ్ముతున్నాను.

- **జీవితాన్ని చూసే కోణం కూడా మారిందా?**

కచ్చితంగా మారుతుంది. ఇంకా కష్టపడాలి, ఇంకా తెలివిగా ఉండాలి, ప్రతిదానికి పక్కా ప్లానింగ్ ఉండాలనే మైండ్ సెట్ వచ్చేసింది. ఇవన్నీ ఒక ఎత్తు. దానికి మించి ఏదో ఉంది అనే విషయాన్ని నమ్ముతు న్నాను. ఆ ఏదో అనేది 'ఏదో పవర్' అని నా ఉద్దేశం.

- **'బాహుబలి' గురించి ప్రస్తావించినప్పుడల్లా 'అద్భుతం' అని అంటున్నాం. కానీ కెరీర్ పరంగా చూస్తే 'రిస్క్'. ఆ తర్వాత 350 కోట్లతో 'సాహో' అనే మరో రిస్క్ చేశారు. రిస్క్ తీసుకుందాం అనే స్వభావం ఏర్పడిందా?**

ఆ స్వభావం ఉండబట్టే 'బాహుబలి' చేయగలిగాను. అయితే 'బాహుబలి' అప్పుడు నిర్మాత శోభుగారిని చూస్తే టెన్షన్ అనిపించేది. యుద్ధ సన్నివేశాలు తీసేటప్పుడు రోజుకి పాతిక లక్షలు ఖర్చు పెట్టేవారు. అయినా ఆయన నవ్వుతూ కనబడుతుండేవారు. 'టెన్షన్ పడడా? రోబోనా' అనుకునేవాణ్ణి. 'బాహుబలి' తర్వాత శోభుగారి ఇంటికి ఫోన్ చేసి ఆయన ఫ్యామిలీ మెంబర్స్‌తో 'మళ్లీ ఇంత పెద్ద సినిమాలు చేయనీకండి' అని చెప్పాను. కట్ చేస్తే.. నేనే పెద్ద ప్రాజెక్ట్ టేకప్ చేశాను. నా ఫ్రెండ్స్‌ని ఇన్వాల్వ్ చేశా. నాకెంత స్ట్రెస్ ఉంటుందో అర్థం చేసు కోవచ్చు. 'బాహుబలి' చేయ డానికి ఫస్ట్ రీజన్ అలాంటి ప్రాజెక్ట్ చేసే అవకాశం మళ్లీ వస్తుందా? లేదా? అని. ఇప్పుడు 'బాహుబలి' ఇంత బాగా రిసీవ్ చేసుకున్న ప్పుడు మనం ఏం చేయా లి? కనీసం ప్రయత్నిద్దాం అని 'సాహో' చేశాను. అలా ఆరేడేళ్లు 'బాహు బలి', 'సాహో' సిని మాలకే వెచ్చించాను.

- **'ప్రభాస్ సినిమా అంటే ఇంత భారీ బడ్జెట్, ఇంత రేంజ్ ఉండాలి' అనే స్పేస్‌లో ఇరుక్కుపోయాం అనే ఫీలింగ్ ఏదైనా ఉందా?**

అలా ఏం లేదు. 'ఛత్రపతి'తో నాకు యాక్షన్ హీరో ఇమేజ్ వచ్చింది. కానీ వెంటనే 'డార్లింగ్' అనే సాఫ్ట్ సినిమా చేశాను. అందులో పెద్దగా ఫైట్స్ కూడా ఉండవు. అమ్మాయి, అబ్బాయి ప్రేమకథ. అదీ ఆడింది. 'మిస్టర్ పర్ఫెక్ట్'లో బంధాలకు, బిజి నెస్‌కు మధ్య డిఫరెన్స్ తెలియని ఒక క్యారెక్టర్. క్లైమాక్స్‌లో హీరో సారీ చెబుతాడు. ఫ్యాన్స్‌కి నచ్చ



'సాహో' స్టిల్

లేదు. కానీ ఆడియన్స్ అందరూ యాక్సెప్ట్ చేశారు. మెల్లిగా అందరికీ నచ్చింది. స్టోరీని కనెక్ట్ చేయగలి గితే ఏ సినిమా అయినా వర్కౌట్ అవుతుంది. కరెక్ట్ కథ ఉంటే నన్ను పెట్టి రెండు కోట్ల సినిమా తీసినా కూడా ఆడుతుంది.

- **'బాహుబలి, సాహో' ప్యాన్ ఇండియా సినిమాలు. మీ నుంచి వచ్చే ప్రతీ సినిమా అన్ని భాషల వాళ్లు చూడాలనుకుంటారు. కానీ ప్రతి సినిమాకి అది కుదరకపోవచ్చు. దాన్ని ఎలా అధిగమిస్తారు?**

ప్యాన్ ఇండియా సినిమానే చేయాలని రూల్‌గా ఏమీ పెట్టుకోలేదు. 'బాహుబలి' తర్వాత ఇది ఇంపార్టెంట్ టైమేమో అనిపించింది. ఒకవేళ 'సాహో' వర్కౌట్ అయినా నెక్ట్స్ ప్యాన్ ఇండియా సినిమానే చేస్తానని పెట్టుకోలేదు. తెలుగు సినిమానే చేస్తాను. వేరే భాషలో గెస్ట్ పాత్ర చేయొచ్చు. అంతే తప్ప ఇక నుంచి చేసే ప్రతి సినిమా అన్ని భాషలనీ దృష్టిలో పెట్టుకుని చేయాలని రూల్ అయితే పెట్టుకోలేదు.

- **ఈ మధ్య ఓ ఇంటర్వ్యూలో రాజకీయాల మీద ఆసక్తి లేదన్నారు. పొలిటికల్ మూవీ ఆఫర్ వస్తే?**

పాలిటిక్స్ వేరు పొలిటికల్ ఫిల్మ్ వేరు. కథ బావుంటే చేయొచ్చు. యాక్షన్ సినిమా చేస్తూ బోలెడు మందిని చంపేస్తున్నాను. బయట చేస్తున్నానా? (నవ్వుతూ). అలాగే సినిమాలో పొలిటీషియన్‌గా చేస్తే.. నిజంగా రాజకీయాల్లోకి వస్తానని కాదు కదా.

- **ఇప్పుడు మీరు ఎక్కడికి వెళ్లినా 'ప్యాన్ ఇండియన్ సూపర్‌స్టార్' అని పిలుస్తున్నారు. ఆ పిలుపుకి అలవాటు పడ్డారా?**

నిజంగా నేను ప్యాన్ ఇండియన్ సూపర్‌స్టార్ అని ఫీల్ అయ్యుంటే నా ఫ్రెండ్స్‌తో ఇన్ని కోట్లు ఎందుకు ఖర్చుపెట్టించేవాణ్ణి? 50 కోట్లతో తీయిస్తే చాలు. అప్పుడు అందరూ అంటున్నట్లు ప్యాన్ ఇండియన్ స్టార్‌ని కాబట్టి సినిమాలు ఆడేస్తాయి. అవన్నీ నేను నమ్మను. క్వాలిటీ ముఖ్యం. 'బాహు బలి'తో తెచ్చుకున్న ఆడియన్స్‌ను సంతృప్తిపరచాలి.

- **మీ పాపులారిటీ దేశాలు దాటే కొద్దీ మీరింకా 'డౌన్ టు ఎర్త్'గా మారిపోతున్నారు...**

మంచిదే కదా. అది నాకంటే మీకే ఎక్కువ తెలుస్తుంది. ఇలా ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలనే విష యాన్ని మాత్రం రాజమౌళి నుంచే నేర్చుకున్నాను. ఎంత పెద్ద బ్లాక్‌బస్టర్ హిట్ సాధించినా తను ఒకేలా ఉన్నాడు. ఆయన పక్కనే ఉండి గమనించాను. మనం ఎప్పుడైనా పెద్ద హిట్ సాధిస్తే ఈయనలా ఉండగలగాలి అనుకున్నాను.

- **మళ్లీ రాజమౌళితో సినిమా ఎప్పుడు?**

ఏమో తెలియదు. 'బాహుబలి' అప్పుడు 7–8 వెర్షన్స్‌లు, చాలా ఐడియాలు చెప్పాడు. 'బాబుని పైకి లేపి తల్లి చనిపోవడం, కట్టప్ప బాహుబలిని చంపడం, కొడుకుని తల్లే చంపమని చెప్పడం' ఇవన్నీ చెబుతున్నప్పుడే నాకు గూస్‌బంప్స్ వచ్చా యి. రాజమౌళి ఇలాంటి సినిమాని చంపేస్తాడు అను కున్నాను (నవ్వుతూ). నిజంగానే చంపేశాడు. అయితే కొడుకుని తల్లే చంపేయమని చెప్పడం సీన్ విన్నప్పుడు మాత్రం ఒళ్లు గగుర్పొడిచింది. వామ్మో... అనుకున్నాను.

- **అమ్మ టాపిక్ వచ్చింది కాబట్టి... మీ సక్సెస్‌ని మీ అమ్మగారు చాలా ఎంజాయ్ చేస్తారని చెప్పొచ్చు. ఆ ఫీలింగ్‌ని ఆమె మీతో షేర్ చేసుకుంటారా?**

అమ్మ, సిస్టర్ చాలా హ్యాపీ. నా సిస్టర్ అయితే గాల్లో తేలిపోతుంది. వాళ్లకు ఎవరైనా నా గురించి మాట్లాడితే చాలు.. సంతోషపడతారు. నా కెరీర్ ఈ రేంజ్‌కి వచ్చినందుకు ఆనందపడుతున్నారు. అమ్మ ఎక్కువ బయటపడరు. బయటపడితే నేనెక్కడ మారిపోతానో అని భయం అనుకుంటా (నవ్వుతూ).

- **మరి 'రిస్కులు తీసుకోవద్దు' అని అమ్మ జాగ్రత్తలు చెబుతుంటారా?**

బేసిక్‌గా నేను బద్ధకస్తుడ్ని. కాలేజీ రోజుల్లో.. లేటుగా లేవడం, కాలేజ్‌కి వెళ్లకపోవడం చేస్తుండే వాణ్ణి. 'బద్ధకం వదిలించుకో.. పని చెయ్యి.. పని చెయ్యి' అని చెబుతూనే ఉండేవారు. ఇప్పుడేమో విపరీతంగా కష్టపడుతుంటే 'అంత కష్టపడకురా..' అంటున్నారు (నవ్వుతూ). 'షూటింగ్‌లో బాగా ఎండగా ఉందా?' అని అడుగుతారు. 'అమ్మా.. ప్రపంచం మొత్తం ఎండలో కష్టపడుతున్నారు. నేను ఒక్కడినేనా' అంటాను. అప్పుడేమో పని చెయ్యమ ని.. ఇప్పుడేమో ఇలా కష్టపడి చేస్తుంటే బాధ.. అమ్మలు అంతే (నవ్వేస్తూ).

- **ప్రమోషన్స్ కోసం రాష్ట్రాలు తిరుగుతున్నారు. అమ్మతో కలిసి భోజనం చేసి ఎన్ని రోజులు అయింది?**

నెల రోజులు అయినట్టుంది. కలిసి మాట్లాడు తున్నాను. కానీ ఈ క్వొశ్చన్ విన్నాక అమ్మతో కలిసి భోజనం చేసి ఎన్ని రోజులైందో ఆలోచిస్తున్నా. మేం కలిసి భోజనం చేసి నెల దాటి పోయింది.

- **మీ సినిమాలను మీ అమ్మ విమర్శిస్తుంటారా?**

అమ్మో! సూపర్ క్రిటిక్. మామూలుగా కాదు. 'బాహుబలి'లో ఓ సీన్‌లో నీ హెయిర్ చాలా చిన్నగా ఉందిరా అన్నారు. అమ్మా.. నా కిరీటం ఉంది. కిరీ



'సాహో' స్టిల్

టానికి చైయిన్ కూడా ఉంది. అంత యాక్షన్ సన్నివే శాల్లో కూడా జుట్టు ఎలా గమనించావు నువ్వు? 'అమ్మ.. మదరో' అనుకున్నాను. ఇక్కడ మేకప్ కొంచెం బాగాలేదు. కళ్లు కొంచెం డార్క్‌గా ఉన్నాయి. క్రాఫ్ బాలేదు అని చెబుతుంటారు. డైట్ అంటూ సరిగ్గా తినకపోతే తిను తిను అంటారు. మళ్లీ కొంచెం పొట్ట వచ్చినట్టుందిరా అంటారు. తినకపోతే తినమ ని... తింటే లావు అయ్యావని. నాకు ఇవన్నీ చాలా ఎంజాయబుల్‌గా ఉంటాయి.

- **ఇటీవల ముంబైలో చిరంజీవిగారిని కలిశారు. ఒకరి సినిమా గురించి ఒకరు మాట్లాడుకున్నారా?**

మేం ఒకే హోటల్‌లో ఉన్నాం. గౌరవంగా వెళ్లి కలిశాను. మా ట్రైలర్ రిలీజ్ అయ్యాక ఆయన ఫోన్ చేశారు. ఆయన తన సొంత సినిమాలా మాట్లాడా రు. చిరంజీవిగారు మాట్లాడిన విధానం నాకు భలే సంతోషంగా అనిపించింది. సినిమాను అంతలా ప్రేమించకపోతే ఇనేళ్లు ఇండస్ట్రీలో ఉండలేరు.

- **యాక్టర్స్‌కి చిరంజీవి ఆదర్శం అంటారు. అయితే తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'సైరా'కు డోర్ ఓపెన్ చేసింది 'బాహుబలి' అని ఆయన అన్నారు. ఆ ఫీలింగ్ ఎలా ఉంది?**

అది నాకు తెలియదు. అదంతా రాజమౌళి. 'బాహుబలి' రాజమౌళి ఫిల్మ్. అది మీరు రాజమౌళినే అడగాలి.

- **'బాహుబలి' టీమ్‌కి రాజమౌళియే స్ఫూర్తి నింపారని అన్నారు. మరి 'సాహో' టీమ్‌కి ఆ స్థానంలో మీరు ఉండాల్సిన పరిస్థితి. ఆ అనుభవం ఎలా అనిపించింది?**

మా 'సాహో' టీమ్‌కి కూడా 'బాహుబలి'యే స్ఫూర్తి. యూవీ వంశీ, ప్రమోద్ మంచి ప్యాషనేట్. నేను యూవీకి, యూవీకి నేను, మాకు డైరెక్టర్ సుజీత్.. మాకన్నా సుజీత్ వయసులో చిన్నవాడు. కానీ 'ఏం కాదు అన్నా' అని ధైర్యం చెప్పాడు. అతని వయసు ఏంటి? మాకు చెప్పడం ఏంటీ? అను కున్నాం (నవ్వుతూ). బట్ 'సాహో' టీమ వర్క్.

- **యాక్టర్‌గా మీ నెక్ట్స్ ప్లాన్ ఏంటి? ఎలాంటి సిని మాలు చేద్దాం అనుకుంటున్నారు?**

'బాహుబలి' సినిమాతో రాజమౌళి ఇండియన్ సినిమాకు ఇంకేదో చూపించారు. నెక్ట్స్ నా సినిమా లకు ఆడియన్స్ వచ్చినప్పుడు మేం ఏదో చూపించా లని ప్రయత్నం చేశామని చెప్పడానికి నానా తంటాలు పడ్డాం. 'సాహో' చేశాం. నెక్ట్స్ ఎలాంటి సినిమాలంటే... చూడాలి.

- **బ్యాంకాంక్‌లో మేడమ్ తుస్సాడ్స్‌లో మీ మైనపు విగ్రహం పెట్టడం ఎలా అనిపించింది?**

'బాహుబలి' వల్ల చాలా విషయాలు జరిగాయి. జపాన్ వెళ్లినప్పుడు అక్కడ రానాని ఫ్యాన్స్ పట్టుకుని ఏడవడం అవి అన్నీ వింటుంటే...'బాహుబలి' రూపంలో ఏదో ఒక అద్భుతం జరిగిపోయింది. అందులో మేడమ్ తుస్సాడ్స్ ఒకటి.

- **ఫ్యాన్స్ అంతా మిమ్మల్ని 'డార్లింగ్' అని పిలుచు కుంటారు. ఎయిర్‌పోర్ట్‌లో ఓ అమ్మాయి ఏకంగా మీ బుగ్గ గిల్లి పారిపోవడం?**

అది నేను ఊహించలేదు. ఎందుకంటే మేల్ ఫ్యాన్స్ కొంచెం గట్టిగా పట్టుకుని లాగడం అనుభవమే. అయితే ఒక అమ్మాయి నుంచి ఈ సంఘటనను నేను ఊహించలేదు. అప్పటికే నేను 18 గంటలు ట్రావెలింగ్‌లో ఉన్నాను. అప్పుడే ఫ్లయిట్ దిగాను. ఫొటో అడిగింది. సరే కదా అని కళ్లజోడు పెట్టుకుని ఫొటో ఇచ్చాను. ఆ అమ్మాయి బాగా హైపరైపోయి నా బుగ్గ గిల్లింది. కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యా. కానీ ఇదంతా ప్రేమలో భాగమే కదా అని పించింది (నవ్వుతూ).

- **మీరు కనిపించినప్పుడు పెద్ద స్థాయిలో మీ చుట్టూ ఫ్యాన్స్ గుమిగూడతారు. ఫోటోల కోసం పోటీ పడుతుంటారు. అయినా మీరు సహనం కోల్పో కుండా ఎంతో ఓర్పుగా ఉంటారు...**

అది ఫస్ట్ నుంచే డిసైడైపోయాను. నేనైతే అభి మానులను కొట్టలేను. తొయ్యలేను. నాకు రక్షణగా ఉన్నవారు అలా చేయడానికి ప్రయత్నించినా నాకు ఏదోలా ఉంటుంది. ఒక్క ఫ్యాన్ వస్తే చాలు అనుకు న్నప్పుడు... ఇంత మంది ఫ్యాన్స్ ఉండటం అంటే హ్యాపీనే కదా. ఎలాగూ నేను బయట కనిపించేది తక్కువ. కనిపించినప్పుడు అభిమానం చూపిస్తారు. అది నాకు ఇష్టమే.

## సరదా సమాధానాలు

- **'సాహో'కి బడ్జెట్ పెరుగుతుంటూ వెళ్లి నప్పుడు మీ ఫీలింగ్ ఏంటి?**
  నిద్ర పట్టేది కాదు.
- **మీరు బయట చాలా కూల్. సినిమాల్లో ఫుల్ వయొలెంట్. ఈ మార్పు ఎలా?**
  డబ్బులు తీసుకుంటున్నాను కదా.



- **అందరి ప్రెషర్ మీరే తీసుకుంటున్నారు. మీ ప్రెషర్‌ని పంచుకునే వాళ్లు మీ లైఫ్‌లోకి ఎప్పుడు వస్తారు?**
  ప్రెషర్ తీసుకునే వాళ్లు వస్తారో? ప్రెషర్ పెట్టేవాళ్లు వస్తారో?
- **ట్రైలర్ చూసి మీ పెద్దనాన్నగారు (కృష్ణంరాజు) ఎలా ఫీల్ అయ్యారు?**
  అందరూ నా గురించి చెప్పడం విని తబ్బిబ్బిపోయి.. ఇంకా లావైపోతున్నారు.

- **'బాహుబలి 2' విడుదలప్పుడు కన్నా... 'సాహో' విడుదలకు ఏమైనా ఎక్కువ టెన్షన్ పడుతున్నారా?**

'బాహుబలి 2' అప్పుడు పెద్దగా టెన్షన్ లేదు. ఎందుకంటే అప్పటికే 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలైపోయింది. యాభై శాతం సక్సెస్ వచ్చింది. ఇండియా అంతా యాక్సెప్ట్ చేశారు. 'బాహుబలి 2' లో కూడా మంచి కంటెంట్ ఉంది. మినిమమ్ గ్యారంటీ అనుకున్నాం. కానీ 'బాహుబలి 1' రిజల్ట్ ఎలా ఉంటుందో తెలియదు. అప్పుడు ముంబై వెళ్లాం. తమిళనాడు వెళ్లాం. కేరళ వెళ్లాం.. మాట్లా డాం. 'బాహుబలి'లో అది చేశాం.. ఇది చేశాం అని చెప్పాం. రేపు ఈ సినిమా చూసి.. ఇదేం సినిమారా అంటారేమోనని భయం. మళ్లీ బడ్జెట్ ఒకటి. ఆపే యాలా.. ఆగిపోవాలా? ఏమైనా తేడా జరిగితే.. ఇలాంటి ఆలోచనలతో 'బాహుబలి 2' అప్పుడు భయంకరమైన ప్రెజర్. 'సాహో' రిలీజ్ అప్పుడు ఇంకో రకమైన ప్రెజర్.

- **హిందీలో కరణ్ జోహార్ ఓ సినిమా చేయమంటే మీరు చేయనన్నారనే వార్తలు వచ్చాయి..**

అదేం లేదు. నేను, కరణ్ జోహార్ ఇప్పటికీ మాట్లాడుకుంటాం. భవిష్యత్‌లో కరణ్‌తో సినిమా ఉండొచ్చు. ఏమో.. ఇప్పుడే చెప్పలేను.

- **నెగటివ్ కామెంట్స్‌ని ఎలా తీసుకుంటారు?**

నేను ఎక్కువగా సోషల్ మీడియాను ఫాలో అవ్వను. కానీ సక్సెస్‌లో అవి కూడా భాగం అనుకుం టాను. సక్సెస్ రోడ్ స్ట్రెయిట్‌గా ఉండదు కదా. చాలా దార్లు తొక్కి వచ్చాం. కొన్నిసార్లు నా తప్పులు ఉంటాయి. మరికొన్ని సార్లు పరిస్థితుల ప్రభావం కావొచ్చు. నెగటివ్, పాజిటివ్ సక్సెస్‌లో భాగమే.

- **ఫైనల్లీ దాదాపు 2 కోట్లు (ఫస్ట్ సినిమా 'ఈశ్వర్' బడ్జెట్) నుంచి 350 కోట్ల ('సాహో' బడ్జెట్) వరకు చేరుకున్న మీ ప్రయాణం గురించి?**

'ఈశ్వర్'కి కోటీ పాతిక లక్షలు అయింది. ఆ సినిమా అంతా రోడ్డు మీదే చేశాం. పెద్ద స్టార్స్ కూడా లేరు. అక్కణ్ణుంచి కెరీర్ ఇంతదాకా వచ్చింది. ఇది నా ఒక్కడివల్ల కాదు. నాతో సినిమాలు చేసిన అందరికీ దక్కుతుంది.

– సినిమా డెస్క్

## 'సాహో' హైలైట్స్



- 'సాహో' ఫ్యూచర్ ఫిల్మ్ కాదు. ప్రజెంట్ టైమ్‌లో జరిగేదే. లార్జర్ దేన్ లైఫ్ అపీల్ కోసం కొన్ని గ్రాండియర్ ఎలిమెంట్స్ యాడ్ చేశాం.
- 'బాహుబలి'కి పెరిగిన బరువుని ఈ సినిమా కోసం తగ్గించడానికి వెజిటేరియన్‌గా మారాను.
- సుజీత్ మీద ఫస్ట్ నుంచి నాకు కాన్ఫిడెన్స్ ఉంది. 'రన్ రాజా రన్' తర్వాత నాతో నీ నెక్ట్స్ సినిమా చేస్తావా? అని అడిగాను. కథ తీసుకువస్తాను అన్నాడు. అబ్బ ఏం కాన్ఫిడెన్స్‌రా అనుకున్నాను.
- యాక్షన్ సన్నివేశాలను హాలీవుడ్ టెక్నీషియన్స్‌తో ఎడిట్ చేయించాం.
- 'సాహో'లో నాది డ్యూయెల్ రోల్ కాకపోవచ్చు. అలాంటి క్యూరియాసిటీ ఉండాలనే ట్రైలర్‌ను అలా కట్ చేశాం.
- 150 కోట్లతో 'సాహో' చేయాలనుకున్నాం. అది 350 కోట్లు అయింది.
- ప్రాగ్, ప్యారిస్, జర్మనీ దేశాల నుంచి కావాల్సిన పరికరాలను తీసుకొచ్చాం.
- రిస్కీ యాక్షన్ సీన్స్ తీసినప్పుడు ఒక్క దెబ్బ కూడా తగలేదు. చాలా జాగ్రత్తగా చేయించారు. ఒకప్పుడు యాక్షన్ సీన్స్ అన్నీ నేనే చేయాలనుకునేవాణ్ణి. ఇప్పుడు అవసరమైనవే చేస్తున్నాను.
- సీక్వెల్‌కి స్కోప్ ఉన్న కథ 'సాహో'. అన్నీ కుదిరితే చేస్తాం. అయితే ఇప్పుడప్పుడే కాదు.
- ఏ సినిమాకైనా కథే మాస్టర్. ఆ తర్వాత డైరెక్టర్.
- యాక్షన్ సినిమా అంటున్నాం కానీ సినిమాలో యాక్షన్ యాక్షన్ యాక్షనే ఉండదు. లవ్ స్టోరీ ఉంది. యాక్షన్‌లో కూడా కార్ చేజ్‌లు, ఎడారి దుమ్ములో ఓ ఫైట్, హీరోహీరోయిన్ రొమాంటిక్ సాంగ్‌తో ఓ ఫైట్.. ఇలా అందరూ ఎంజాయ్ చేసేలా ప్లాన్ చేశాం.
- తెలుగు సినిమా మంచి ఫేజ్‌లో ఉంది. కంటెంట్ ఉన్న సినిమాలు ఆడుతున్నాయి. 'అర్జున్ రెడ్డి, జెర్సీ..'.. ఇలా ఈ మధ్య చాలా సినిమాలు ఆడాయి. అందరూ భిన్నంగా ప్రయత్నిస్తున్నారు.
- నెక్ట్స్ రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో ఓ లవ్‌స్టోరీ చేస్తున్నాను. ఈ సినిమాని గోపీ కృష్ణ, యూవీ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి.

'సాహో'లో ప్రభాస్

epaper.sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



(రేపు సుమన్ బర్త్‌డే)

**పల్లవి :**
గజ్జె ఘల్లుమన్నదో గుండె ఝల్లుమన్నదో
కట్టు తప్పుతున్నదో గుట్టే చప్పుడైనదో
తట్టుకో తడై తమాషా
ఇచ్చుకో ఒడే మజాగా
లేత చీకట్లో నీ ఒళ్లు
శృంగార కావిళ్ళు మొయ్యాలిలే
సోకు పూరేకులా విచ్చి మారాకులేసింది
నన్నంటుకో చిన్నింటిలో జున్నంటుకో
॥గజ్జెఘల్లు॥

**చరణం : 1**
ఒంపుల్లో సొంపుల్లో
వాటేసుకుంటేనే సంపంగి కంచాలు
ఒళ్లంటుకుంటేనే జల్లంటు
పుట్టేను వయ్యారి గంధాలు
నీ గాలికే పైట మేఘాలు
కమ్మేను సాయంత్ర వేళల్లో
నీ చూపుకే ఊపు ఉయ్యారు
దాటేను ఉల్లాస లీలల్లో
ఉత్తమైన గుమ్మందమూ ఒత్తుకున్న
వడ్డాణమూ గంటకొట్టే కౌగిళ్ళలోనా
మువ్వగోపాల రమ్మంది
ముద్దిచ్చి పొమ్మంది మువ్వెన్నడో
జివ్వుజివ్వంటు నా గువ్వ గూడెక్కి కూసింది
నీ కోనలో నీరెండలో నీ గుండెలో
॥గజ్జెఘల్లు॥

**చరణం : 2**
చిట్టెమ్మ బుగ్గల్లో పిట్టమ్మలాడేను
నీ గోరువంకల్లో
చీరంటు సిగ్గుల్లో చీ పో లు
రేగేను నా పూల సంతల్లో
కొండమ్మ కోనమ్మ కోలాటమాడేను
నీ రూపురేఖల్లో
ఆడున్న ఈడమ్మ ఈడొచ్చి కుట్టేను
నీ వాలుచూపుల్లో
పంచదార పందిళ్లలో మంచు తేనె
సందెళ్లలో పాలు పంచుకోరాదా ప్రాయం
వంగతోటెంతో బాగుంది
వయ్యారి వడ్డీలు చెల్లించిపో
కొత్త కవ్వింత పుట్టించి గల్లంత
చేసేసి వేడెక్కిపో వేధించుకో వేటాడుకో
॥గజ్జెఘల్లు॥

**చిత్రం : బావ బావమరిది (1993)**
**రచన : వేటూరి**
**సంగీతం : రాజ్-కోటి**
**గానం : ఎస్.పి.బాలు, చిత్ర**

కట్ చేయ్...దాచేయ్...



● నాగచైతన్య

## ప్లాన్ మారింది

ఆగస్ట్ చివరి వారంలో నాగచైతన్యను, సాయి పల్లవిని డ్యాన్స్ ఫ్లోర్ మీదకు తీసుకువెళ్లాలనుకున్నారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ఇప్పుడు ప్లాన్‌లో చిన్న మార్పు. అనుకున్న ప్లాన్‌ను వారం రోజులు షిఫ్ట్ చేశారు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ఏషియన్ ఫిల్మ్స్ సునీల్ నారంగ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇది డ్యాన్స్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే ప్రేమకథ అని తెలిసింది. ఇందులో నాగచైతన్య, సాయిపల్లవి ఇద్దరూ తెలంగాణ స్లాంగ్‌లో మాట్లాడనున్నారని సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్ట్ 26న స్టార్ట్ కావాల్సింది. ఇప్పుడు సెప్టెంబర్ 5న హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుందట. డిసెంబర్‌కల్లా ఈ చిత్రాన్ని పూర్తి చేయాలనుకుంటున్నారని సమాచారం.

## కీర్తీ... మిస్ ఇండియా

హెడ్డింగ్ చదవగానే కీర్తీ సురేశ్ 'మిస్ ఇండియా' పోటీల్లో పాల్గొన్నారేమో అనుకుంటున్నారా? అదేం లేదు. అసలు సంగతి ఏంటంటే... కీర్తీ సురేశ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రానికి 'మిస్ ఇండియా' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. నరేంద్ర దర్శకత్వంలో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మహేశ్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రనిర్మాత మహేశ్ కోనేరు మాట్లాడుతూ– ''మా చిత్రంలో కథానాయిక ఎదుర్కొన్న సంఘటనను ప్రతి అమ్మాయి తన జీవితంలో ఎక్కడో ఒక చోట ఎదుర్కొనే ఉంటుంది. మహిళలు సహా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే చిత్రమిది. ఇటీవల యూరప్‌లో భారీ షెడ్యూల్ పూర్తి చేశాం. మిగిలిన చిత్రీకరణను త్వరగా పూర్తి చేసి, అక్టోబర్ లేదా నవంబర్‌లో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం. కీర్తి నుంచి ప్రేక్షకులు ఎలాంటి సినిమా రావాలని కోరుకుంటారో అలాంటి సినిమానే 'మిస్ ఇండియా'' అన్నారు. ''అన్ని భావోద్వేగాలు కలగలిపిన చిత్రమిది. ఈ కథకు కీర్తి సురేశ్‌గారు మాత్రమే న్యాయం చేయగలరని నేను, మహేశ్‌గారు భావించి ఆమెను కలిశాం. కథ చాలా బాగా నచ్చి ఆమె ఒప్పుకున్నారు. కీర్తి సహకారంతో సినిమాను అనుకున్న ప్లానింగ్‌లో పూర్తి చేస్తున్నాం'' అన్నారు నరేంద్ర.



● కీర్తీ సురేశ్

## మరో సినిమాతో వస్తా!



● సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్ నటించనున్న 'ఇన్‌షా అల్లా' చిత్రం విడుదల వాయిదా పడింది. దాదాపు 19 ఏళ్ల తర్వాత సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ హీరోగా 'ఇన్‌షా అల్లా' పేరుతో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది రంజాన్‌కు విడుదల చేయనున్నట్లు కూడా ప్రకటించారు. కానీ ఈ సినిమాను ఆలస్యంగా విడుదల చేయనున్నారు. ''ఇన్‌షా అల్లా' చిత్రం వాయిదా పడింది. కానీ వచ్చే ఏడాది రంజాన్‌కు నేను మరో సినిమాతో మీ (ప్రేక్షకులు) ముందుకు వస్తాను'' అన్నారు సల్మాన్. ఇదిలా ఉంటే సల్మాన్ ఖాన్ తాజాగా నటిస్తున్న 'దబాంగ్ 3' ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల కానుంది. దీంతో వచ్చే ఏడాది రంజాన్‌కు సల్మాన్ ఏ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తారా? అనే చర్చ ప్రస్తుతం హాట్‌టాపిక్. పదేళ్లలో ఒక్క 2013లో తప్ప ప్రతి రంజాన్‌కి సల్మాన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద రెడీగా ఉంటున్న సంగతి తెలిసిందే.



● ఇలియానా

## బ్రేకప్?

'ఐ వానా ఫాలో ఫాలో ఫాలో ఫాలో యు'.. అంటూ ఇన్ని రోజులు ఒకరినొకరు ఫాలో అయ్యారు హీరోయిన్ ఇలియానా, ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ అండ్రూ నీబోన్. చేతిలో చేతులు వేసుకుని ఇన్ని రోజులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈ జంట తాజాగా చేతులు దులుపుకుని విడిపోయారని ప్రచారం జరుగుతోంది. ఆండ్రూతో కలిసి ఉన్న ఫొటోలను తన ఇన్‌స్టా అకౌంట్ నుంచి తొలగించారు ఇలియానా. అలాగే ఇన్‌స్టాలో ఒకరినొకరు అన్ ఫాలో చేసుకున్నారు. దీంతో ఆమెకు, ఆండ్రూకు మధ్య విభేదాలు వచ్చాయన్న వార్తలు నిజమేనని ఊహించుకోవచ్చు. ఇలియానా ఓ సందర్భంలో ఆండ్రూని 'హబ్బీ' (భర్త) అంటూ ఇన్‌స్టాలో క్యాప్షన్ కూడా ఇచ్చిన సంగతి తెలిసిందే. మరి... ఈ బ్రేకప్ ప్రచారం గురించి ఇలియానా స్పందిస్తే కానీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడదు. ఇక సినిమాల విషయానికి వస్తే... హిందీలో ఇలియానా కథానాయికగా నటించిన 'పాగల్ పాంతీ' సినిమా విడుదలకు రెడీగా ఉంది.



## కౌసల్య కృష్ణమూర్తి చేయడం అదృష్టం



● భీమనేని శ్రీనివాస రావు

''నా కెరీర్ స్టార్టింగ్‌లో 'శుభాకాంక్షలు, సుస్వాగతం, సూర్యవంశం' లాంటి మంచి సినిమాలు చేశాను. మంచి కథలు దొరకడం కష్టమవుతున్న ఈ మధ్యకాలంలో 'కౌసల్య కృష్ణమూర్తి' లాంటి ఒక గొప్ప సినిమాకి దర్శకత్వం వహించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్'' అని భీమనేని శ్రీనివాసరావు అన్నారు. ఐశ్వర్యా రాజేష్, డా.రాజేంద్రప్రసాద్, కార్తీక్ రాజు, 'వెన్నెల' కిషోర్ ముఖ్య పాత్రల్లో శివ కార్తికేయన్ ప్రత్యేక పాత్రలో నటించిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. కె.ఎస్.రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు భీమనేని శ్రీనివాస రావు చెప్పిన విశేషాలు.

● 'కౌసల్య కృష్ణమూర్తి'కి వచ్చినన్ని అభినందనలు నా గత సినిమాలకు రాలేదు. మా చిత్రం నచ్చడంతో మీడియా మిత్రులు కూడా సొంత సినిమా అనుకుని సపోర్ట్ చేశారు. ప్రేక్షకులు కూడా సినిమాకు 100 శాతం కనెక్ట్ అయ్యారు. చాలా మంది కాలేజ్ విద్యార్థులు ఫోన్ చేసి, ఈ సినిమా మాకు ఓ స్ఫూర్తిలా ఉందని అంటున్నారు.

● ఈ మధ్య కాలంలో 'మజిలీ, జెర్సీ' లాంటి క్రికెట్ నేపథ్యం ఉన్న సినిమాలు వచ్చి సక్సెస్ సాధించాయి. అయితే మాది ఫిమేల్ సెంట్రిక్ మూవీ. క్రికెటర్‌గా ఎదగాలనే ఒక అమ్మాయి తపనను చూపిస్తూనే, తండ్రీ కూతుళ్ల మధ్య ఉండే ఎమోషన్‌ని చూపించాం. దానికి సమాంతరంగా రైతుల సమస్యలను చూపించాం. స్క్రీన్ ప్లే ప్రతి ఒక్కరికీ నచ్చడంతో పాటు భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతున్నారు.

● 'కళాబంధు' టి. సుబ్బిరామిరెడ్డిగారు కుటుంబ సభ్యులతో కలిసి మా సినిమా చూశారు. వారికి సినిమా విపరీతంగా నచ్చడంతో నన్ను, కె.ఎస్ రామారావుగారిని అభినందించారు. రాజేంద్రప్రసాద్, ఐశ్వర్య రాజేష్, కార్తీక్ రాజు నటనను కొనియాడి, ఫోన్‌లో అభినందించారు. క్రియేటివ్ కమర్షియల్స్ వంటి గొప్ప బేనర్‌లో 'కౌసల్య కృష్ణమూర్తి' లాంటి మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చినందుకు కె.ఎస్ రామారావుగారికి, కె.ఎ వల్లభ గారికి థ్యాంక్స్.

● ప్రేక్షకులకు కథ నచ్చితే అది రీమేక్ సినిమానా? ఒరిజినల్ సినిమానా? అని చూడకుండా ఆదరిస్తున్నారు.. హిట్ చేస్తున్నారు. ఒక మంచి కథ ఎక్కడ ఉన్నా మన తెలుగు ప్రేక్షకులకి చూపించాలనే సంకల్పంతో ఇప్పటి వరకూ ఎక్కువ రీమేక్ సినిమాలే చేశాను. కాలంతో పాటు మనం మారాలి. ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో పెట్టుకొని మంచి సినిమాలు తీసినప్పుడే విజయం సాధించగలం.

● స్కూల్, కాలేజ్ డేస్ నుంచే నేను రైటర్‌గా, ఆర్టిస్ట్‌గా చేసేవాణ్ణి. ఆ అనుభవంతో సినిమా మీద ప్యాషన్‌తో ఇండస్ట్రీకి వచ్చా. అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేస్తున్న టైమ్‌లో 'అశ్వద్ధామ' సినిమాలో ఓ పాత్ర చేశా. ఆర్. నారాయణమూర్తిగారి 'ఆలోచించండి' సినిమాలో సెకండ్ హీరోగా చేశా. 'కుదిరితే కప్పు కాఫీ, కెరటం' వంటి చిత్రాల తర్వాత 'కౌసల్య కృష్ణమూర్తి'లో బ్యాంకు మేనేజర్ పాత్ర చేశా. ఈ సినిమాలో నాదొక్కటే నెగటివ్ రోల్ అయినా మంచి కాంప్లిమెంట్స్ వస్తున్నాయి. ఇకపైన కూడా మంచి పాత్రలొస్తే నటిస్తా.

● ఏ దర్శకుడికైనా కొన్ని సినిమాలు మైలేజీనిస్తాయి. నాకు 'సుడిగాడు' అలాంటి సినిమా. నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా. నేను, 'అల్లరి' నరేష్ కూడా 'సుడిగాడు 2' మీద చాలా ఆసక్తిగా ఉన్నాం. మంచి అవకాశం వస్తే ఆ సినిమా చేయడానికి సిద్ధంగా ఉన్నా.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 5 | 2 | 4 | | | | 6 |
| | 6 | 9 | 5 | | 7 | | | 8 |
| | | 7 | | 9 | 6 | | 5 | |
| 7 | 5 | | | | | | 3 | |
| 8 | | 1 | 6 | | 3 | 4 | | 7 |
| | 3 | | | | | | 8 | 9 |
| | 1 | | 4 | 7 | | 8 | | |
| 4 | | | 3 | | 9 | 7 | 1 | |
| 9 | | | | 8 | 5 | | | |

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 4 | 1 | 3 | 9 | 6 | 2 | 7 | 8 |
| 3 | 7 | 8 | 2 | 1 | 4 | 6 | 9 | 5 |
| 6 | 9 | 2 | 8 | 7 | 5 | 3 | 4 | 1 |
| 4 | 8 | 6 | 9 | 5 | 2 | 1 | 3 | 7 |
| 7 | 5 | 9 | 1 | 3 | 8 | 4 | 2 | 6 |
| 1 | 2 | 3 | 4 | 6 | 7 | 5 | 8 | 9 |
| 2 | 1 | 4 | 6 | 8 | 9 | 7 | 5 | 3 |
| 8 | 6 | 5 | 7 | 2 | 3 | 9 | 1 | 4 |
| 9 | 3 | 7 | 5 | 4 | 1 | 8 | 6 | 2 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి. (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3×3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

## తెలుగులో లస్ట్ స్టోరీస్



● సంకల్ప్ రెడ్డి

'ఘాజీ, అంతరిక్షం' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సంకల్ప్‌రెడ్డి. మూడో చిత్రాన్ని బాలీవుడ్‌లో చేసే అవకాశం అందుకున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు లాక్ చేసిన ఆయన నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పనిలో ఉన్నారు. మరోవైపు ఆయన నెట్‌ఫ్లిక్స్ కోసం ఓ వెబ్ సిరీస్‌కి దర్శకత్వం వహించనున్నారట. గత ఏడాది బాలీవుడ్‌లో సంచలనం రేపిన 'లస్ట్ స్టోరీస్' తెలుగు వర్షన్‌ని సంకల్ప్ డైరెక్ట్ చేయనున్నారు. బాలీవుడ్‌లో నాలుగు విభాగాల్లో తెరకెక్కిన 'లస్ట్ స్టోరీస్' కి కరణ్ జోహార్, అనురాగ్ కశ్యప్, జోయా అక్తర్, దిబాకర్ బెనర్జీ దర్శకత్వం వహించారు. విక్కీ కౌశల్, కియారా అద్వానీ, మనీషా కోయిరాలా, భూమి ఫడ్నేకర్, సంజయ్ కపూర్, రాధికా ఆప్టే తదితరులు నటించిన 'లస్ట్ స్టోరీస్' తొలి భాగం గత ఏడాది జూన్ 15న ప్రారంభమై బాలీవుడ్‌లో సంచలనాలు సృష్టించింది. బాలీవుడ్ 'లస్ట్ స్టోరీస్' ని నిర్మించిన ఆర్ఎస్‌వీపీ ప్రొడక్షన్ హౌస్ తెలుగులోనూ నిర్మించనుంది. నాలుగు భాగాలుగా తెరకెక్కనున్న ఈ వెబ్ సిరీస్‌లో ఓ డైరెక్టర్‌గా సంకల్ప్ రెడ్డి ఫిక్సయ్యారు. మరో ముగ్గురు డైరెక్టర్స్ ఎవరన్నది ప్రకటించాల్సి ఉంది. సంకల్ప్ దర్శకత్వం వహిస్తున్న ఎపిసోడ్ మార్చి 2020కి ముగుస్తుంది. ఈ 'లస్ట్ స్టోరీస్' తెలుగులో ఎన్ని సంచలనాలు సృష్టిస్తుందే వేచి చూడాలి.

## టెన్నిస్ ఆడతా!



● శ్రద్ధా కపూర్

'సాహో' సినిమాతో సౌత్ ఇండియాకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనున్నారు శ్రద్ధాకపూర్. మొన్నామధ్య ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ బయోపిక్ 'సైనా' నుంచి శ్రద్ధాకపూర్ తప్పుకున్న విషయం తెలిసిందే. 'సైనా'లో ఇప్పుడు పరిణీతీ చోప్రా నటిస్తున్నారు. ఈ చిత్రం నుంచి తప్పుకున్నందుకు ఏమైనా పశ్చాత్తాప పడుతున్నారా? అనే ప్రశ్నను శ్రద్ధాకపూర్ ముందు ఉంచితే... ''నా జీవితంలో నేను దేని గురించీ రిగ్రెట్ ఫీలవ్వను. నాకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనుకుంటాను. దురదృష్టవశాత్తు 'సైనా' ఫస్ట్ డే షూటింగ్‌లోనే నేను అనారోగ్యానికి గురయ్యాను. దాంతో షూటింగ్ కాస్త వాయిదా పడింది. ఆ లోపు 'ఏబీసీడీ 3'లో హీరోయిన్‌గా నటించే అవకాశం వచ్చింది. 'ఏబీసీడీ 2' సినిమా నా కెరీర్‌లో మంచి హిట్. అలాంటప్పుడు 'ఏబీసీడీ 3' సినిమాకు నో చెప్పాలనుకోలేదు. అప్పటికే నేను 'చిచ్చోరే', 'సాహో' సినిమాలతో బిజీగా ఉన్నా. అందుకే 'సైనా' చిత్రానికి తిరిగి డేట్స్ కేటాయించలేకపోయాను. ఫలితంగా ఆ ప్రాజెక్ట్ చేజారింది'' అని చెప్పారు. ఒక బయోపిక్‌ని మిస్సయిన మీకు ఇప్పుడు ఎవరి బయోపిక్‌లో అయినా నటించాలని ఉందా? అనే ప్రశ్నను శ్రద్ధా ముందు ఉంచితే – ''సానియా మీర్జా (ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి) బయోపిక్ ఆలోచన ఉంది. ఆమెది గ్రేట్ జర్నీ. ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది'' అని పేర్కొన్నారు. రోనీ స్క్రూవాలా దగ్గర సానియా మీర్జా బయోపిక్ హక్కులు ఉన్న సంగతి తెలిసిందే. మరి.. శ్రద్ధాని రోనీ నాయికగా తీసుకుంటారా? అనేది కాలమే చెప్పాలి.

## చీమ మనిషిగా మారితే...!

మనిషిలా మారాలని ఓ చీమ తాపత్రయపడుతుంది. అసలు.. అది సాధ్యమా? ఒకవేళ కుదిరితే ఆ చీమకు ప్రేమ, శృంగారం ఫీలింగ్స్ కలిగితే ఎలా ఉంటుంది? అనే అంశాలతో 'చీమ – ప్రేమ మధ్యలో భామ' అనే చిత్రం తెరకెక్కింది. అమిత్, ఇందు హీరోహీరోయిన్లుగా నటించారు. మాగ్నస్ ఓపస్ ఫిలిమ్స్ పతాకంపై శ్రీకాంత్ 'శ్రీ' అప్పలరాజు దర్శకత్వంలో ఎస్.ఎన్. లక్ష్మీనారాయణ నిర్మించారు. ఈ సినిమాను సెప్టెంబర్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ– ''ఇది ఓ యువజంట ప్రేమ కథ. కుటుంబ విలువలతో, కామెడీ సన్నివేశాలతో ఒక మంచి కుటుంబ కథా చిత్రాన్ని నిర్మించాం. యూత్ అండ్ ఫ్యామిలీ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. సంగీతం, గ్రాఫిక్ వర్క్స్ హైలైట్‌గా ఉంటాయి'' అన్నారు. ''మా చిత్రంలో చీమ ప్రధాన ఆకర్షణ. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారు, గీతామాధురి పాడిన పాటలు హైలైట్‌గా ఉంటాయి'' అన్నారు లక్ష్మీ నారాయణ.



● ఇందు, అమిత్

## మంచి సందేశంతో మార్షల్

''అభయ్ కథానాయకుడిగా నటించి, నిర్మించిన చిత్రం 'మార్షల్'. తన జన్మస్థలమైన గుంటూరులోనే ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ వేడుక జరపడం ఎంతో సంతోషం. ఈ సినిమా ఘన విజయం సాధించాలి'' అని ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. అభయ్ అడకా, మేఘా చౌదరి జంటగా నటించిన చిత్రం 'మార్షల్'. హీరో శ్రీకాంత్ ముఖ్య పాత్రలో నటించారు. జై రాజాసింగ్ దర్శకత్వం వహించారు. అభయ్ హీరోగా నటించి, నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 19న విడుదలకానుంది. ఈ చిత్రం ఆడియో, టీజర్‌ని గుంటూరులో విడుదల చేశారు. అభయ్ అడకా మాట్లాడుతూ– ''నేను పుట్టి, పెరిగిన గుంటూరులో నా తొలి చిత్రం ఆడియో ఫంక్షన్‌ను ఇంత మంది పెద్దల సమక్షంలో చేయడం ఆనందంగా ఉంది. ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. సమాజానికి ఓ మంచి సందేశం ఇవ్వబోతున్నాం'' అన్నారు. ''మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది. మా సినిమా కథ నచ్చడంతో 'కేజీఎఫ్' మ్యూజిక్ డైరెక్టర్ రవిబసురి మా సినిమాకి రీ రికార్డింగ్‌తో పాటు 2 పాటలకు స్వరాలు సమకూర్చారు'' అని జై రాజాసింగ్ అన్నారు. శ్రీకాంత్, షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరి, వైఎస్ఆర్ సీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త చంద్రగిరి ఏసురత్నం, నిర్మాత వెంకటేశ్వర రావు, మేఘనా చౌదరి, సంగీత దర్శకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.యం.స్వామి.



● శ్రీకాంత్, అభయ్ అడకా

## నవ్వుల్ నవ్వుల్

కృష్ణ చంద్ర, కారోణ్య కత్రీన్ జంటగా మురళి బోడపాటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇట్లు మీ శ్రీమతి'. హంస వాహిని టాకీస్ పతాకంపై ఎమ్.ఎస్. రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.ప్రసన్న కుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వి. సాగర్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. ఎమ్.ఎస్. రెడ్డి మాట్లాడుతూ– ''వినోదభరితమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రమిది. మురళి బోడపాటి చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా నిర్మిస్తున్నా. కృష్ణచంద్ర ఈ సినిమాతో హీరోగా పరిచయమవుతున్నాడు. నిర్మాత డి.ఎస్. రావ్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు'' అన్నారు. ''అక్టోబర్ మొదటి వారంలో మా సినిమా రెగ్యులర్ షూటింగ్ విజయవాడలో ప్రారంభం కానుంది. 35 రోజులు జరిగే ఈ షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది'' అన్నారు మురళి బోడపాటి. ''ఈ సినిమాలో నా పోలీస్ పాత్ర గుర్తుండిపోతుంది'' అన్నారు డి.ఎస్. రావ్. ''ఇందులో మంచి కథ, కథ నాలున్నాయి'' అన్నారు కృష్ణచంద్ర. కారోణ్య కత్రీన్ పాల్గొన్నారు. ఈ సినిమాకి సంగీతం: వెంగీ, కెమెరా: తోట.వి.రమణ.



● కృష్ణచంద్ర, కారోణ్య

సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 27-8-2019



మన పాదాల కింద ఉన్న నేల మనం అనుకుంటున్న దానికన్నా ఎంతో ప్రశస్తమైనది. నేల తల్లి బాగును విస్మరించకూడదు. మనం తినే ఆహారంలో 85% మట్టిలో నుంచే వస్తోంది!
– కు డోంగ్యు, డైరెక్టర్ జనరల్, ఎఫ్.ఎ.ఓ.

పుబ్బ కార్తె : ఆగస్టు 31 వరకు

# సబ్బు నీటితో చెలగాటం వద్దు



అధిక మోతాదులో సబ్బు నీళ్లు పిచికారీ చేసిన మొక్క సుడి ఎండిపోయిన దృశ్యం

మొక్కజొన్న రైతులను అల్లాడిస్తున్న కత్తెర పురుగును చంపడానికి సబ్బు, డిటర్జెంట్ నీళ్లను సుడిలో పిచికారీ చేస్తే చాలు పురుగు ఖతం అని తెలియజెప్పే వీడియోలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బట్టలుతికే సబ్బు పొడి కలిపిన నీటిని పోసీపొయ్యగానే కత్తెర పురుగు విలవిల్లాడుతూ నిమిషాలలో చనిపోతుండడంలోనూ ఎటువంటి సందేహం లేదు కూడా. కానీ, సబ్బుపొడి ద్రావణం పిచికారీ వలన కత్తెర పురుగుతో పాటు మొక్కజొన్న పంట కూడా మాడిపోతున్న వాస్తవం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది.

బట్టలు ఉతకడానికి తయారు చేసిన సబ్బులు, సబ్బుపొడులను పంటలపై ప్రయోగించడం తగదని మెదక్ జిల్లాలోని డా. రామానాయుడు–ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డా. గున్నంరెడ్డి శ్యామ సుందర్‌రెడ్డి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. బట్టలు ఉతకడానికి వాడే సబ్బులు, సబ్బు పొడుల తయారీలో వాడే రసాయనాలు మొక్కలపై తీవ్ర ప్రభావాలను చూపగలవన్నారు. సబ్బులు, సబ్బు పొడులను కీటకనాశనులుగా వాడటం దాదాపు 200 ఏళ్ల నుంచి ఉన్నప్పటికీ, మొక్కలపై వాడే సబ్బు పొడుల తయారీలోనూ, ఎంపికలోనూ, వాడవలసిన మోతాదులోనూ ప్రత్యేకమైనవని గుర్తించాలి.

కత్తెర పురుగు నివారణకు సబ్బు పొడి నీటిని వాడిన కొందరు రైతుల క్షేత్రాలలో మొక్కజొన్న మొక్కలు దెబ్బతినడం గమనించిన డా. శ్యామ సుందర్ రెడ్డి, కెవికె క్షేత్రంలోని మొక్కజొన్నపై లీటరు నీటికి 5 గ్రాముల సబ్బుపొడి నుంచి 50 గ్రాముల వరకు వివిధ మోతాదులలో ప్రయోగించి పరిశీలించారు. మోతాదు పెరుగుతున్నకొద్దీ.. మొక్కపై దుష్ప్రభావం కోలుకోలేనంత ఎక్కువగా ఉన్నట్లు గమనించారు. సబ్బు ద్రావణం పిచికారీ చేసిన కొద్ది నిమిషాల తర్వాత సగం మొక్కలపై మంచి నీటిని పిచికారీ చేశారు. ఆ మొక్కల పరిస్థితి కొంచెం నయమనిపించినప్పటికీ, మిగతా మొక్కల పరిస్థితి ప్రమాదరకరంగానే ఉందని చెప్పారు. కాబట్టి, కత్తెర పురగు నివారణకు సబ్బు పొడి ద్రావణం వాడకపోవడం మంచిదనే అభిప్రాయం వెలిబుచ్చారు.

మొక్కజొన్న సుడులను మట్టి, ఇసుక, రాతి పొడి, వరిపొట్టు వంటి మొక్కలకు హాని కలగని పదార్థాలతో నింపి, వాటిని మెటారైజియం లేదా ఇ.పి.ఎన్. లేదా బి.టి. బాక్టీరియా ద్రావణాలతో తడిపితే కత్తెర పురుగును సమర్థవంతంగా రసాయన రహితంగా నిర్మూలించవచ్చని గత ఏడాది తాము ప్రయోగ పూర్వకంగా నిరూపించిన విషయాన్ని డా. శ్యామ సుందర్ రెడ్డి (99082 24649) ఈ సందర్భంగా గుర్తు చేశారు.



# సేంద్రియ విత్తనోత్పత్తిపై 4 రోజుల శిక్షణ



వేలాది సంవత్సరాలుగా ఎన్నెన్నో సంప్రదాయ పంటల మేలైన విత్తనాలను శ్రద్ధగా ఎంపిక చేసి, ప్రతి ఏటా తిరిగి ఆ విత్తనాలతోనే పంటలు పండిస్తూ, అపురూపమైన ఆ సంప్రదాయ వంగడాలను తర్వాత తరానికి అందించడం, వ్యవసాయక జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవడం మన అన్నదాతల విశిష్టత. విత్తనోత్పత్తిలో ఎన్ని కొత్త పోకడలు వచ్చినప్పటికీ.. అమూల్యమైన జాతి సంపద అయిన సంప్రదాయ వంగడాలను సేంద్రియంగా సాగు చేస్తూ పరిరక్షించుకోవడం ఎప్పటికీ అవసరమేనని అంటున్నాయి భారత్ బీజ్ స్వరాజ్ మంచ్, సహజ సీడ్స్ సంస్థలు. ఈ సంస్థల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 23–26 తేదీల్లో కర్ణాటకలోని మైసూరులో 4 రోజుల శిక్షణా శిబిరం జరగనుంది. సంప్రదాయ వంగడాలకు సంబంధించి సేంద్రియ విత్తనోత్పత్తిపై లోతైన అవగాహన కలిగించడం, నైపుణ్యాలు, హక్కులపై చైతన్యాన్ని పెంపొందించడమే ఈ శిక్షణ లక్ష్యం. శిక్షణ ఆంగ్లంలో ఉంటుంది. ఒక్కొక్కరికీ రుసుం రూ. 12 వేలు. ఇతర వివరాలకు కృష్ణప్రసాద్ – 98808 62058, శివ్‌రుద్ర – 88672 52979.

## 1న బసంపల్లిలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ

అనంతపురం జిల్లా సి.కె.పల్లి మండలం బసంపల్లి గ్రామంలోని దేవాలయ ప్రాంగణంలో సెప్టెంబర్ 1న (ప్రతి నెలా మొదటి ఆదివారం) ఉ. 9 గం. నుంచి సా. 4 గం. వరకు ప్రముఖ ప్రకృతి వ్యవసాయదారుడు నాగరాజు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండ్ల తోటలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల మిశ్రమ సాగు తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. రుసుము రూ. 100. వివరాలకు.. 91826 71819, 94403 33349.

## మిరప, వరి సాగు, కషాయాలు, ద్రావణాలపై శిక్షణ

గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ రైతు శిక్షణా కేంద్రంలో సెప్టెంబర్ 1(ఆదివారం)న ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ విధానంలో మిరప, వరి సాగు, వివిధ రకాల కషాయాలు, ద్రావణాల తయారీ, వినియోగంపై సీనియర్ మహిళా రైతు లావణ్య రమణారెడ్డి (నాగర్ కర్నూల్) శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు.. 97053 83666, 0863–2286255.

## 27-28 తేదీల్లో గ్రామీణ ఆవిష్కర్తల సమ్మేళనం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవితాలను సులభతరం చేసి అభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలను వెలువరించిన స్టార్టప్ సంస్థలు, ఆవిష్కర్తల సమ్మేళనం సెప్టెంబర్ 27–28 తేదీల్లో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి–పంచాయతీరాజ్ సంస్థ (ఎన్.ఐ.ఆర్.డి.–పి.ఆర్.) ఆవరణలో జరగనుంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పర్యావరణ అనుకూల ఇంధనవనరులు, సుస్థిర జీవనం, వ్యర్థాల పునర్వినియోగంతో సంపదను సృష్టించడం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర రంగాలకు సంబంధించిన ఆవిష్కరణలు వెలువరించిన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చు. 8వ తరగతి, ఆపై తరగతుల విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు కూడా తమ సరికొత్త ఆలోచనలను ఈ మేళాలో ప్రదర్శించవచ్చు. సెప్టెంబర్ 13 లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు.. 98487 80155, 98487 80277.

- ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువ
- ఎలాంటి రసాయనాలు వాడకపోవడం ప్రత్యేకత
- కుందేళ్ల పెంపకంతో సిరుల పంట





ఓబుల్ కేశవాపూర్‌లో ఏర్పాటు చేసిన ర్యాబిట్ ఫాం

# చిన్న జీవాలు పెద్ద లాభాలు

**మాంసం కోసం పెంచుకునే జంతువుల్లో అతి చిన్నది కుందేలు. చిన్నా పెద్దా అందరూ తినదగిన మృదువైనది కుందేళ్ల మాంసం. అతి తక్కువ పరిమాణంలో మేత, దాణా తిని మూడు నెలల్లోనే అమ్మకానికి ఎదిగి వచ్చే కుందేళ్ల పెంపకం గ్రామస్థాయిలో చేపట్టదగిన స్వయం ఉపాధి కార్యక్రమం. ఇద్దరు యువకులు స్వగ్రామంలోనే కుందేళ్ల పెంపకాన్ని చేపట్టి మంచి నికరాదాయాన్ని ఆర్జిస్తుండడం విశేషం.**



కుందేళ్లను చూపుతున్న అనిల్, జయప్రకాష్‌రెడ్డి

ఉపాధి కోసం ఎక్కడికో వెళ్లకుండా సొంత ఊళ్లోనే కొత్త ఆలోచనతో కుందేళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు ఇద్దరు యువకులు. ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ తక్కువ పెట్టుబడితోనే ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొలి ర్యాబిట్ ఫాం (కుందేళ్ల డెయిరీ) ప్రారంభించి లాభాలు సాధిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు కోడెపాక అనిల్, ధర్మ జయప్రకాశ్‌రెడ్డి. జనగామ జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓబుల్ కేశవాపూర్ గ్రామం వారి స్వస్థలం. జయప్రకాష్‌రెడ్డి డిగ్రీ వరకు చదువుకున్నారు. అనిల్ కాకతీయ యూనివర్శిటీలో సోషల్ వర్క్‌లో పీజీ పూర్తి చేశారు. టెక్ మహీంద్ర కంపెనీలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేశారు. పండుగలకు గ్రామానికి వచ్చిన సందర్భంలో అనిల్, జయప్రకాష్‌రెడ్డి ఏదైనా కొత్త స్వయం ఉపాధి యూనిట్‌ను గ్రామంలోనే ప్రారంభించాలని చర్చించుకునే వారు.

**ఉన్న ఊళ్లోనే మంచి నికరాదాయం..**

రూ. 3 లక్షల వ్యయంతో ర్యాబిట్ ఫాం ప్రారంభించాం. ప్రస్తుతం నెలకు రూ. 70 వేల వరకు టర్నోవర్ ఉంది. పనిగట్టుకొని ప్రచారం చేయకపోయినా కుందేళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. కుందేళ్ల పోషణ సులభం. తక్కువ ఖర్చు. కొద్ది రోజుల్లోనే ఆదాయం రావడం ప్రారంభమవుతుంది. కుందేళ్ల జీవన కాలం పదేళ్లు. ఈ రోజు కాకపోయినా రేపటి రోజునైనా అమ్మవచ్చు. హైదరాబాద్, వరంగల్, జనగామ, సిద్ధిపేటతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఉన్న ఊరిలోనే కుందేళ్ల పెంపకం చేపట్టి మంచి నికరాదాయం పొందుతుండడం ఆనందంగా ఉంది.
– అనిల్, జయప్రకాష్‌రెడ్డి(77025 90914), కుందేళ్ల పెంపకందారులు, ఓబుల్ కేశవాపూర్, జనగామ

**తమిళనాడులో నెల రోజులు అధ్యయనం..**

తొలుత తమ సొంత ఊరిలోనే మొట్ట మొదట పౌల్ట్రీ ఫాం పెట్టారు. ఆ తరువాత నాటు కోళ్ల ఫాం ప్రారంభించారు. నికరాదాయం పెద్దగా లేకపోయేసరికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అన్వేషించే క్రమంలో మార్కెట్‌లో కుందేళ్లకు మంచి డిమాండ్ ఉందని తెలుసుకొని ఆ దిశగా దృష్టి సారించారు. కుందేళ్ల పెంపకంపై అవగాహన కోసం అనిల్ నేరుగా తమిళనాడులోని ఆశన్న ర్యాబిట్స్ ఫాంను సందర్శించారు. నెల రోజుల పాటు అక్కడే ఉండి మరీ కుందేళ్ల పెంపకంపై అన్ని విషయాలనూ అధ్యయనం చేశారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఓబుల్ కేశవాపూర్‌లో 3 ఎకరాల భూమిని లీజుకు తీసుకొని మూడు షెడ్లను నిర్మించి, 2018 ఫిబ్రవరిలో ర్యాబిట్ ఫాంను ప్రారంభించారు.

**ఒక్క యూనిట్‌తో ప్రారంభం..**

ఆ విధంగా ఓబుల్ కేశవాపూర్‌లో జయప్రకాష్ రెడ్డి, అనిల్ ఆధ్వర్యంలో కేవలం ఒక్క యూనిట్ (7 ఆడ కుందేళ్లు, 3 మగ కుందేళ్లు కలిపితే ఒక యూనిట్) తోనే ర్యాబిట్ ఫాంను ప్రారంభించారు. ఇప్పుడు ఆ ఫాంలో కుందేళ్ల సంఖ్య వందలకు పెరిగింది. కుందేళ్ల ఉత్పత్తి రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఆడ, మగ కుందేళ్లు కలిపి బ్రీడర్లు(ఉత్పత్తి చేసే)గా పిలుస్తారు.



**నెలకు ఓ ఈత.. ఈతకు 4-12 పిల్లలు..**

కుందేళ్లు నెల రోజులకే ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పొందుతాయి. 28 రోజుల నుంచి 32 రోజుల మధ్యలో పిల్లల్ని పెడతాయి. ప్రతిసారీ 4 నుంచి 12 పిల్లలు వస్తాయి. పుట్టిన రోజు నుంచి 12 రోజుల వరకు పిల్లలకు పాలు తాగించాలి. రోజుకు రెండుసార్లు పాలు తాగిస్తే చాలు. 12వ రోజు నుంచి మనం ఇచ్చే ఆహారాన్ని పిల్లలు తింటాయి. నెల రోజుల తరువాత ప్రత్యేక ఇనుప పంజరాలలో ఉంచి పెంచుతున్నారు. నెల రోజుల వయస్సున్న కుందేళ్లను ప్రజలు ఇళ్లలో పెంచుకోవడానికి జత రూ. 600కు కొనుక్కెళ్తున్నారు. మూడు నెలలు పెరిగిన కుందేళ్లు మాంసం కోసం కిలోకు రూ. 300 చొప్పున విక్రయిస్తున్నారు.

**రోజుకు 200 గ్రాముల మేత, దాణా**

కుందేళ్లు అతి తక్కువ పరిమాణంలో పచ్చి మేత, దాణాను తిని వేగంగా పెరుగుతాయి. గడ్డి, గోధుమ పొట్టు, మక్క పిండి, పల్లి పిండిని కుందేళ్లకు ఆహారంగా ఇస్తారు. హెడ్జ్ లూసర్న్ గడ్డి(దశరథ గడ్డి)ని రోజుకు 100 గ్రాముల చొప్పున తింటాయి. హెడ్జ్ లూసర్న్ గడ్డి మొలకలను ఒకసారి నాటితే 5 ఏళ్ల పాటు అనేక కోతలు కోయవచ్చు. కోత కోస్తుంటే మళ్లీ చిగురిస్తుంది.

ఎప్పుడు చూసినా లేతగా కన్పించే ఈ గడ్డిని కుందేళ్లు బాగా ఇష్టపడతాయి. గడ్డితోపాటు మొక్కజొన్న పిండి 50 కిలోలు, గోధుమ పిండి 25 కిలోలు, పల్లి(వేరుశనగ) పిండి 25 కిలోలు, కిలో ఉప్పు కలిపి దాణాను తయారు చేసి కుందేళ్లకు రోజుకు 100 గ్రాముల చొప్పున మేపుతున్నారు.

**రంగురంగుల్లో కుందేళ్లు..**

సాధారణంగా మనకు కేవలం తెల్లని, నల్ల కుందేళ్లు మాత్రమే కనిపిస్తాయి. ఈ ఫాంలో మాత్రం రకరకాల కుందేళ్లు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి రసాయనాలను వినియోగించకుండా పెంచిన సేంద్రియ కుందేళ్ల మాంసానికి అంతకంతకూ ఆదరణ పెరుగుతుండటం విశేషం.

– వెంకటేశ్వర్లు, సాక్షి, జనగామ
– ఫొటోలు : గోవర్ధనం వేణుగోపాల్



# పుట్టగొడుగుల సాగు భలే తేలిక!



పుట్టగొడుగుల్లో పౌష్టిక విలువల గురించి తెలియని వారుండరు. కానీ, అవి అందుబాటులో లేక తినలేకపోతున్నామనే వారు మాత్రం చాలా మందే కనిపిస్తారు. గ్రామాల్లో, నగరాల్లో ఎక్కడైనా ఇదే పరిస్థితి. పుట్టగొడుగులను ఎండబెట్టుకొని కూరగా లేదా జావగా చేసుకొని తీసుకుంటే విటమిన్–డి లోపం కొద్ది వారాల్లోనే తీరిపోతుందని డాక్టర్ ఖాదర్ వలి చెప్తుండడంతో వీటి వాడకంపై ముఖ్యంగా నగరవాసుల్లో ఆసక్తిపెరుగుతోంది. అయితే, మనసుపెట్టి నేర్చుకుంటే ఆరు గంటల్లోనే పుట్టగొడుగులను ఇంటిపట్టునే పెంచుకునే పద్ధతులు తెలిసిపోతాయని బెంగళూరుకు చెందిన వినయ్ పరడె అంటున్నారు. తన స్నేహితుడు నగేష్ ఆనంద్‌తో కలిసి కేవలం 6 గంటల శిక్షణతో పుట్టగొడుగుల పెంపకం ఎలాగో నగరవాసులకు నేర్పిస్తున్నారు. 'పంటలకు అవసరమయ్యే నీటిలో 5 శాతంతోనే పుట్టగొడుగులను అతి తక్కువ పెట్టుబడితో సులభంగా ఇంట్లోనే మనం సాగు చేసుకోవచ్చు. వెలుతురు కూడా అవసరం లేదు. చీకటి గదిలో పెంచుకోవచ్చు..' అంటారు వినయ్. విద్యుత్ అవసరం లేకుండానే ఎండుగడ్డి వంటి వ్యర్థాలను శుద్ధిచేసి, వాటిపై ముత్యపు చిప్పల్లాంటి పుట్టగొడుగుల(ఆయిస్టర్ మష్రూమ్స్) పెంపకాన్ని బడికెళ్లే పిల్లలు కూడా చేయగలిగే సులువైన సేంద్రియ పద్ధతిని మేం అందరికీ నేర్పిస్తున్నాం అంటున్నారాయన.

# ధాన్యపు రకం పచ్చి మేతల సాగు ఇలా..



• డెయిరీ డైరీ-5



నేపియర్ గడ్డి



రెండు కణుపుల కాండపు ముక్కలు

వాణిజ్య స్థాయిలో పాడి పశువుల పెంపకం చేపట్టే రైతులు ఏడాది పొడవునా పచ్చిమేత అందుబాటులో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. నీటి వసతి గల ఒక ఎకరం భూమిలో 5–6 పశువులకు, వర్షాధార భూముల్లో ఒక ఎకరం భూమిలో రెండు పశువులకు సరిపడా పచ్చిమేతను పెంచుకోవచ్చు. ధాన్యపు జాతి పచ్చిమేత మూడు పాళ్లు, పప్పుజాతి పచ్చిమేతను ఒక పాలు కలిపి పశువు శరీర బరువుననుసరించి 25–30 కిలోల వరకు మేపితే తగిన లాభదాయకంగా పాల ఉత్పత్తిని పొందవచ్చు. కొత్తగా డెయిరీ ప్రారంభించే రైతులు రెండు నెలలు ముందునుంచే పచ్చి మేతలను సాగు చేయడం అవసరం. పచ్చి మేతలను సాగు చేసే పద్ధతులను తెలుసుకుందాం...

**ధాన్యపు రకం ఏక వార్షిక పచ్చిమేతలు**

ధాన్యపు రకం ఏక వార్షిక పచ్చిమేతల్లో ముఖ్యమైనవి హైబ్రిడ్ జొన్న, మొక్కజొన్న, సజ్జ రకాలు.

## హైబ్రిడ్ జొన్న

హైబ్రిడ్ జొన్నల్లో పి.సి.–6, పి.సి.–23, యం.పి. చారి, ఎస్.ఎస్.జి. 59–3 రకాలు మేలైనవి. వీటిని వర్షాధారంగా (జూన్–ఆగస్టు), నీటి పారుదల కింద (జనవరి–మే) నాటుకోవాలి. హెక్టారుకు 30–40 కిలోల విత్తనాలు అవసరం. సాళ్ల మధ్య, మొక్కల మధ్య 4–5 అంగుళాల దూరంలో విత్తుకోవాలి. హెక్టారుకు 80 కిలోల నత్రజని, 30 కిలోల పొటాష్ వేసుకోవాలి. ప్రకృతి/సేంద్రియ పద్ధతుల్లో పెంచుకునే రైతులు తగిన మోతాదులో ఘనజీవామృతం, ద్రవజీవామృతం, వర్మీకంపోస్టు, చివికిన పశువుల ఎరువు వేసుకోవాలి. 10–15 రోజులకోసారి నీటి తడులు ఇవ్వాలి. 50–55 రోజుల (50 శాతం పూత దశ)లో మొదటి కోత కోసుకోవచ్చు. ప్రతి 35–40 రోజులకు ఒక కోత కోసుకోవచ్చు. హెక్టారుకు 70–80 టన్నుల పచ్చి జొన్న గడ్డి దిగుబడి వస్తుంది.

## మొక్కజొన్న

పచ్చిమేతగా పెంచుకునేందుకు మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్, గంగ, హైబ్రిడ్ ఎఫ్, విజయ కిసాన్ రకాలు ఉంటాయి. వర్షాధారంగా జూన్–ఆగస్టు, నీటిపారుదల కింద జనవరి – మే మధ్యలో నాటుకోవాలి. హెక్టారుకు 40–50 కిలోల విత్తనం కావాలి. సాళ్ల మధ్య, మొక్కల మధ్య 10 అంగుళాల దూరం ఉండాలి. హెక్టారుకు 120 కిలోల నత్రజని, 120 కిలోల పొటాష్ వేసుకోవాలి. 7–10 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి. విత్తిన 60–70 రోజులకు కంకి వేసే సమయంలో మొదటి కోత కోయాలి. 2–3 కోతలు వస్తాయి. హెక్టారుకు 50–60 టన్నుల పచ్చి మేత దిగుబడి వస్తుంది.

## సజ్జ

సజ్జలో జైంట్ బాజ్రా, జైంట్ రాజ్‌కో, ఎ.పి.ఎఫ్.బి. రకాలు పచ్చిమేతగా సాగు చేయడానికి అనువుగా ఉంటాయి. వర్షాధారంగా జూన్–ఆగస్టు మధ్య, నీటిపారుదల కింద జనవరి–మే మధ్య విత్తుకోవాలి. హెక్టారుకు 15–20 కిలోల విత్తనాలు అవసరం. సాళ్ల మధ్య, మొక్కల మధ్య 5 అంగుళాల దూరం ఉండాలి. హెక్టారుకు 80 కిలోల నత్రజని, 30 కిలో పొటాష్ వేయాలి. 15–20 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి. విత్తిన 60–70 రోజులకు మొదటి కోత వస్తుంది. తర్వాత 1–2 కోతలు వస్తాయి. 30–35 రోజులకు ఒక కోత వస్తుంది. హెక్టారుకు 25–30 టన్నుల పచ్చిమేత దిగుబడి వస్తుంది.

**బహువార్షిక పచ్చి మేతలు**

**నేపియర్:** ఒకసారి నాటితే 3–4 ఏళ్లపాటు అనేక కోతల్లో పశుగ్రాసాన్ని అందించే బహువార్షిక పచ్చి మేతలు పాడి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి. నేపియర్ పచ్చిమేతల్లో ఎన్.బి.21, ఎ.పి.బి.ఎన్., కో–1, కో–2 రకాలు ముఖ్యమైనవి. వీటిని చలికాలంలో తప్ప ఫిబ్రవరి–ఆగస్టు నెలల మధ్యలో రెండు కణుపుల కాండపు ముక్కలు నాటుకోవచ్చు. హెక్టారుకు 30 వేల ముక్కలు కావాలి. వరుసల మధ్య, మొక్కల మధ్య 2 అడుగులు(60 సెం.మీ.) దూరం పాటించాలి. హెక్టారుకు 110 కిలోల యూరియా, భాస్వరం 50 కిలోలు, పొటాష్ 40 కిలోలు వేయాలి. ఎండాకాలంలో 8–10 రోజులకు ఒకసారి, చలికాలంలో 15–20 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి. నాటిన తర్వాత 60–75 రోజులకు మొదటి కోత వస్తుంది. తర్వాత ప్రతి 40–45 రోజులకు ఒకసారి.. ఏడాదికి 6–8 కోతలు వస్తాయి. హెక్టారుకు 250–300 టన్నుల పచ్చిమేత దిగుబడి వస్తుంది.

**పారాగడ్డి :** పారాగడ్డి కాండపు మొక్కలను జూన్–జూలై నెలల్లో నాటుకోవాలి. హెక్టారుకు 40 వేల కాండపు మొక్కలు కావాలి. వరుసల మధ్య, మొక్కల మధ్య అడుగు దూరం పాటించాలి. హెక్టారుకు 150 కిలోల నత్రజని, 60 కిలోల పొటాష్ వేసుకోవాలి. ఎండాకాలంలో 8–10 రోజులకు, చలికాలంలో 15–20 రోజులకు ఒక సారి నీటి తడులు ఇవ్వాలి. నాటిన తర్వాత 75–80 రోజులకు మొదటి సారి గడ్డి కోతకు వస్తుంది. తర్వాత ప్రతి 40–45 రోజులకు ఒకసారి, 6–9 కోతలు వస్తాయి. హెక్టారుకు 200–240 టన్నులు సంవత్సరానికి పచ్చిమేత దిగుబడి వస్తుంది.

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
మంగళవారం
27-8-2019

బీటెక్.. నాలుగేళ్ల ఇంజనీరింగ్. తెలుగు రాష్ట్రాల్లో క్రేజీ కోర్సు. ఇంటర్‌లో చేరిన తొలిరోజు నుంచే కష్టపడి చదివి ఇంజనీరింగ్‌లో సీటు సంపాదిస్తారు. క్యాంపస్‌లో అడుగుపెట్టాక.. ఒక్కసారిగా స్వేచ్ఛ లభించినట్లు భావిస్తారు. చదువుపై ఫోకస్ తగ్గిస్తారు. కాని నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే.. బీటెక్‌లో చేరిన తొలిరోజు నుంచే విద్యార్థులు నిరంతరం తమను తాము సానపెట్టుకోవాలి. టెక్నాలజీ యుగంలో వస్తున్న మార్పులను వేగంగా ఒడిసిపట్టుకోవాలి. కార్పొరేట్ ప్రపంచం అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి. ప్రస్తుతం జాతీయ స్థాయిలో.. ఐఐటీలు, నిట్‌లు మొదలు రాష్ట్రాల స్థాయిలోని కళాశాలల్లో బీటెక్‌లో ప్రవేశాలు ముగిసి.. తరగతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులో రాణించేందుకు నిపుణుల గైడెన్స్...

ఇంజనీరింగ్ స్పెషల్

# ఇంజనీరింగ్ తోవలో..

# తొలి అడుగు..!



**మొదటి ఏడాది నుంచే అకడెమిక్స్‌పై ఫోకస్ చేయాలి ● చదువుతోపాటు అదనపు నైపుణ్యాలపైనా దృష్టిపెట్టాలి ● ప్రాక్టికల్ అప్రోచ్‌తో రాణించొచ్చంటున్న నిపుణులు**

బీటెక్‌లో చేరాలి. కోర్సు పూర్తవుతూనే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కొలువు సొంతం చేసుకోవాలి. కళ్లు చెదిరే ఆఫర్లతో కార్పొరేట్ సంస్థల్లో కాలు మోపాలి– ఇంజనీరింగ్‌లో చేరుతున్న విద్యార్థుల్లో అధికశాతం మంది ఆలోచన ఇదే! తమ ఈ కల సాకారం కావాలంటే.. నేటి పోటీ ప్రపంచంలో, టెక్నాలజీ యుగంలో.. బీటెక్‌లో చేరిన తొలిరోజు నుంచే విద్యార్థులు పలు రకాల నైపుణ్యాలు సాధించే దిశగా కృషి చేయాలనేది నిపుణుల సూచన.

### ఇమిడిపోయేలా

ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో అడుగుపెట్టగానే తొలుత అక్కడి కొత్త వాతావరణంలో సాధ్యమైనంత త్వరగా ఇమిడిపోయే ప్రయత్నం చేయాలి. కొంతమంది విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరగానే.. ఒక్కసారిగా 'ఫ్రీ బర్డ్స్' మాదిరిగా వ్యవహరిస్తుంటారు. మరికొంతమంది క్యాంపస్ వాతావరణంలో ఇమడలేక ఒత్తిడికి గురవుతుంటారు. ప్రధానంగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల విద్యార్థులు ప్రవేశాలు పొందే ఐఐటీలు, ఎన్ఐటీల క్యాంపస్‌లలో ఒత్తిడి సమస్య ఎక్కువగా ఉంది. ఫ్రీ బర్డ్స్ దృక్పథంతో వ్యవహరించే విద్యార్థులు.. దానికి సాధ్యమైనంత త్వరగా ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు ఇంటర్‌పర్సనల్, క్రాస్ కల్చరల్ స్కిల్స్ పెంచుకునే దిశగా అడుగులు వేయాలి. విద్యార్థుల కోసం కాలేజీల్లో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ సెల్స్ నిర్వహిస్తున్నారు. ఈ సదుపాయం వినియోగించుకోవాలి.

### అకడమిక్స్ .. ఇలా

అకడమిక్స్ విషయానికొస్తే.. ఇంటర్ వరకు చదివిన విధానం వేరు. ఇంజనీరింగ్ సబ్జెక్టలను అభ్యసించే పద్ధతి, బోధించే తీరు భిన్నం. కాబట్టి విద్యార్థులు ఆందోళన చెందకుండా తొలుత నాలుగేళ్ల సిలబస్‌పై ప్రాథమిక అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత మొదటి సంవత్సరం సబ్జెక్టులు, సిలబస్‌పై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాలి. మొదటి సంవత్సరం సబ్జెక్టులు.. ఇంజనీరింగ్ కోర్సుకు పునాది వంటివి. వీటిపై పట్టు సాధిస్తేనే తర్వాత మూడేళ్ల అకడమిక్స్‌లో రాణించడం సులువవుతుంది.

### ప్రాక్టికాలిటీ, అప్లికేషన్ అప్రోచ్

ఇంజనీరింగ్ విద్యార్థులు ఏ అంశాన్నైనా ప్రాక్టికల్ దృక్పథంతో, అప్లికేషన్ అప్రోచ్‌తో అభ్యసించడం అలవాటు చేసుకోవాలి. అందుకోసం లేబొరేటరీల్లో ఆయా సబ్జెక్ట్ అంశాలకు సంబంధించి ప్రాక్టికల్స్ శ్రద్ధగా చేయాలి. ఇలాకాకుండా కేవలం పుస్తకాలకే పరిమితమైతే పరీక్షల్లో ఎక్కువ మార్కులు స్కోర్ చేయొచ్చేమోకానీ..రియల్ టైం నైపుణ్యాలు మాత్రం లభించవు. రియల్ టైమ్ నాలెడ్జ్ లేకుంటే.. భవిష్యత్‌లో కెరీర్ అవకాశాల పరంగా ఇబ్బందులు ఎదురవడం ఖాయం. కాబట్టి ఈ విషయంలో ప్రత్యేక దృష్టిపెట్టాలి. అవసరమైతే లెక్చరర్స్, ప్రొఫెసర్స్ సహాయం తీసుకోవడానికి వెనుకంజ వేయకూడదు. పలు ఇన్‌స్టిట్యూట్‌లు మెంటారింగ్ సెల్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నాయి. తరగతి గదిలో సందేహాలు నివృత్తి చేసుకోవడానికి బిడియపడే విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయుక్తమని చెప్పొచ్చు. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

### లోతైన అధ్యయనం

ఇంజనీరింగ్ విద్యార్థులు రెండో ఏడాది నుంచి సబ్జెక్టులను లోతుగా అన్ని కోణాల్లో అధ్యయనం చేయడం ప్రారంభించాలి. అందుకోసం మూక్స్, ఎన్‌పీటీఈఎల్ వంటి ఆన్‌లైన్ విధానాలతోపాటు ప్రొఫెసర్స్ రాసిన ప్రామాణిక పుస్తకాలను చదవాలి. ముఖ్యంగా ప్రతి అంశాన్ని వాస్తవ పరిస్థితులతో అనుసంధానిస్తూ అవగాహన చేసుకునే ప్రయత్నం చేయాలి. ఇంజనీరింగ్‌లో పూర్తిస్థాయిలో సబ్జెక్టల బోధన రెండో ఏడాది నుంచే ప్రారంభమవుతుంది. కాబట్టి విద్యార్థులు తమ బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్టలు..వాటికి అవసరమైన క్షేత్ర నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి.

### ఇంటర్న్‌షిప్స్ దిశగా

బీటెక్ విద్యార్థులు రెండో ఏడాది చివరి నుంచే ఇంటర్న్‌షిప్స్‌లో చేరేలా ప్రయత్నాలు సాగించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రియల్ టైమ్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలంటే.. కనీసం రెండు లేదా మూడు ఇంటర్న్‌షిప్స్ చేయడం మేలు. ఈ మేరకు ఏఐసీటీఈ మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. కాబట్టి విద్యార్థులు సంబంధిత పరిశ్రమల్లో ఇంటర్న్ అవకాశాల కోసం అన్వేషించాలి. ఇందుకోసం క్యాంపస్‌లోని ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెల్‌తోపాటు, ఆయా సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ల సహకారం తీసుకోవాలి. ఇంటర్న్‌షిప్ పూర్తిచేయడం ద్వారా తాజా పరిస్థితులపై అవగాహన వస్తుంది. అంతేకాకుండా కంపెనీల అవసరాలకు తగ్గట్లు నైపుణ్యాలు మెరుగుపరచుకునే అవకాశం లభిస్తుంది.

### భవిష్యత్తు లక్ష్యాల దిశగా

ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులు మూడో ఏడాది నుంచి తమ భవిష్యత్తు లక్ష్యాల సాధన దిశగా స్థిరంగా అడుగులు వేయాలి. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఆఫర్స్ సొంతం చేసుకోవాలనుకునే విద్యార్థులు.. అందుకు అనుగుణంగా ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న టెక్నాలజీలు, నైపుణ్యాలను అందిపుచ్చుకునే మార్గాలను అన్వేషించాలి. ఉన్నత విద్యకు వెళ్లాలనుకునే అభ్యర్థులు గేట్, క్యాట్ వంటి పరీక్షల ప్రిపరేషన్‌కు శ్రీకారం చుట్టాలి.

### సర్టిఫికేషన్స్‌తో సమర్థవంతంగా

కంపెనీలు తమ కార్యకలాపాల నిర్వహణలో నిత్యం కొత్త టెక్నాలజీని ప్రవేశపెడుతున్నాయి. వీటిని కరిక్యులంలో భాగంగా అభ్యసించే వీలుండదు. ఇలాంటి లేటెస్ట్ టెక్నాలజీకి సంబంధించి సర్టిఫికేషన్ కోర్సులు పూర్తిచేయడం లాభిస్తుంది. ప్రస్తుతం ప్రధానంగా ఆటోమేషన్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్, 3–డి డిజైన్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీకి డిమాండ్ పెరుగుతోంది. కాబట్టి అభ్యర్థులు ఆయా సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచే వీలుంటుంది.

### మూక్స్‌తో లేటెస్ట్ టెక్నాలజీ

నేటి ఇంటర్నెట్ యుగంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు వరం..మూక్స్(మాసివ్‌లీ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్). అంతర్జాతీయంగా పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆయా అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా ఆన్‌లైన్ విధానంలో కోర్సులను అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులు మూక్స్ ద్వారా తమ సబ్జెక్టులతోపాటు లేటెస్ట్ టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవచ్చు. మన దేశంలోనూ ఎన్‌పీటీఈఎల్ ద్వారా ప్రముఖ ప్రొఫెసర్స్ బోధించే పాఠాలను ఆన్‌లైన్‌లో వినేఅవకాశముంది. వీటిల్లో విద్యార్థులకు ఉపయోగపడే వర్చువల్ ల్యాబ్స్ సౌకర్యం సైతం లభిస్తుంది. ఫలితంగా విద్యార్థులు తాజా పరిశోధనలు, టెక్నాలజీ, పరిణామాలు, ప్రాక్టికల్ అంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

### ప్రాజెక్ట్ వర్క్.. సొంతంగా

నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులో అత్యంత ప్రాధాన్యమైనది ప్రాజెక్ట్ వర్క్. నాలుగో ఏడాదిలో చేయాల్సిన ప్రాజెక్ట్ వర్క్ విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలి. రియల్ టైమ్ ప్రాజెక్ట్ వర్క్ చేసేందుకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఫేక్ ప్రాజెక్ట్ వర్క్స్ చేస్తే... భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవడం ఖాయం. ముఖ్యంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ప్రాజెక్ట్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం కష్టంగా మారుతుంది. అంతేకాకుండా సొంతంగా ప్రాజెక్టు వర్క్ పూర్తిచేస్తే.. సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు అలవడతాయి.

### పర్సనాలిటీ డెవలప్‌మెంట్

కంపెనీలు తమ నియామకాల సమయంలో అభ్యర్థి వ్యక్తిత్వాన్ని కూడా పరిశీలిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు కాలేజీలో ఉన్నప్పుడే వ్యక్తిత్వ లక్షణాలు సైతం మెరుగుపరచుకోవాలి. కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్, టీమ్ వర్కింగ్ వంటి నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. ఇందుకోసం అవసరమైతే ప్రత్యేక శిక్షణ తీసుకోవాలి. కాలేజ్‌లో నిర్వహించే సెమినార్లకు హాజరవడం, తోటి విద్యార్థులతో గ్రూప్ డిస్కషన్స్ వంటి వాటిలో ఉత్సాహంగా పాల్గొనాలి. అదే విధంగా కాలేజ్‌లో నిర్వహించే కల్చరల్ యాక్టివిటీస్‌లోనూ భాగస్వాములయ్యే విధంగా వ్యవహరించాలి. ఫలితంగా ఇంటర్ పర్సనల్ స్కిల్స్ మెరుగవుతాయి.

### స్వీయ అధ్యయన నైపుణ్యాలు

బీటెక్ విద్యార్థులు మొదటి నుంచి సెల్ఫ్ లెర్నింగ్ అలవాటు చేసుకోవాలి. దీనికోసం ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న అన్నిరకాల వనరులను ఉపయోగించుకోవాలి. లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీలను వినియోగించుకోవాలి. తద్వారా తమ కోర్ సబ్జెక్టలకు సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన పొందాలి.

### స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ప్రధానం

ఐఐటీలు, ఎన్ఐటీల్లో చేరిన విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్(ఒత్తిడి నిర్వహణ) అత్యంత ప్రధానమైన అంశం. దీనికోసం అందుబాటులో ఉన్న కౌన్సెలింగ్ సెంటర్ల సహకారం తీసుకోవాలి. అకడమిక్స్ పరంగా తరగతి గది బోధనతోపాటు సెల్ఫ్ లెర్నింగ్ లక్షణాన్ని అలవర్చుకోవాలి. అప్పుడే బీటెక్‌లో చేరిన ఉద్దేశం, లక్ష్యం నెరవేరుతుంది.

– ప్రొఫెసర్.ఎన్.వి.రమణరావు, డైరెక్టర్, నిట్–వరంగల్

### నూతన సాంకేతిక నైపుణ్యాలు

ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు తమ బ్రాంచ్‌కు సంబంధించి నూతన టెక్నాలజీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఇండస్ట్రీ అవసరాలు నిత్యం మారుతున్న నేపథ్యంలో ఇది అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు అత్యంత కీలకమైన అంశంగా మారింది. నైపుణ్యాలుంటేనే జాబ్ మార్కెట్ పోటీలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి తమకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా నూతన టెక్నాలజీని సొంతం చేసుకునేందుకు కృషి చేయాలి.

– ప్రొఫెసర్.సి.హెచ్.సాయిబాబా, కన్వీనర్, ఏపీ–ఎంసెట్

## స్కాలర్‌షిప్స్

### ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్స్

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ).. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ, జియాలజీ/జియోఫిజిక్స్‌లో మాస్టర్స్ కోర్సులు చదువుతున్న ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది.

మొత్తం స్కాలర్‌షిప్‌ల సంఖ్య:
- 1000 (ఇంజనీరింగ్: 494, ఎంబీబీఎస్: 90, ఎంబీఏ: 146, మాస్టర్స్ ఇన్ జియాలజీ/ జియోఫిజిక్స్: 270).
- **ఎంతకాలం:** ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ విద్యార్థులకు నాలుగేళ్లు; ఎంబీఏ, జియాలజీ/ జియోఫిజిక్స్ విద్యార్థులకు 2ఏళ్లు.
- **స్కాలర్‌షిప్ మొత్తమెంత:** నెలకు రూ.4000.
- **అర్హత:** ఇంజనీరింగ్, ఎంబీబీఎస్‌కు కనీసం 60 శాతం మార్కులతో 10+2; ఎంబీఏ, జియాలజీ/జియోఫిజిక్స్‌కు కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ; ప్రస్తుతం ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ, జియాలజీ/ జియోఫిజిక్స్ మాస్టర్స్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో చేరి ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లకు మించరాదు.
- **దరఖాస్తు:** ఓఎన్‌జీసీ వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ ఫామ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15, 2019
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ongcindia.com

## ఉద్యోగాలు

### టీసీఐఎల్‌లో 21 ఖాళీలు

న్యూఢిల్లీలోని టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (టీసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 21 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఇంజనీర్ (టెలికాం)-4, టెలికాం టెక్నీషియన్-9, లైట్ డ్యూటీ డ్రైవర్-4, సేఫ్టీ ఆఫీసర్-2, హెల్పర్-1, ఆటోక్యాడ్ ఆపరేటర్-1.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ/డిప్లొమా/డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** 45 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 6, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tcil-india.com

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో..
❖ ఏపీ గ్రామ/వార్డు సచివాలయ పరీక్షల ప్రత్యేకం మోడల్ పేపర్లు ❖ మెంటల్ ఎబిలిటీ
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

## పోటీ పరీక్షల ప్రత్యేకం

## ముఖ్య దినోత్సవాలు



# జాతీయ గణాంక దినోత్సవం?

**జనవరి 9**

విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు మన దేశాభివృద్ధిలో అందిస్తున్న తోడ్పాటుకు గుర్తుగా ఏటా జనవరి 9ని ప్రవాసీ భారతీయ దివస్‌గా నిర్వహిస్తున్నారు. మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి 1915 జనవరి 9న భారతదేశానికి తిరిగి వచ్చారు. అందువల్ల జనవరి 9ని ప్రవాసీ భారతీయ దివస్‌గా ప్రకటించారు.

**జనవరి 12**

స్వామి వివేకానంద జన్మదినమైన జనవరి 12ను జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహించుకుంటారు. 1985 నుంచి దీన్ని పాటిస్తున్నారు.

**జనవరి 25**

2011 నుంచి జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో యువకులు ఎక్కువగా పాల్గొనాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం దీన్ని ప్రకటించింది.

**ఫిబ్రవరి 28**

సర్ సి.వి.రామన్.. రామన్ ఎఫెక్ట్‌ను 1928 ఫిబ్రవరి 28న కనుగొన్నారు. దానికి గుర్తుగా ఫిబ్రవరి 28వ తేదీని జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తారు. రామన్‌కు 1930 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

**మే 11**

భారతదేశం 1998 మే 11న రెండో అణ్వస్త్ర పరీక్షలను రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో నిర్వహించింది. దీన్నే పోఖ్రాన్-2 లేదా ఆపరేషన్ శక్తి అంటారు. దీనికి గుర్తుగా మే 11వ తేదీని జాతీయ సాంకేతిక దినం (టెక్నాలజీ డే)గా జరుపుకుంటున్నాం. మొదటి అణు పరీక్షలను 1974 లో నిర్వహించారు.

**జూన్ 29**

ప్రముఖ స్టాటిస్టీషియన్ ప్రశాంత చంద్ర మహలనోబిస్ జన్మదినమైన ఈ తేదీని..జాతీయ గణాంక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. మహలనోబిస్ 1931లో కోల్‌కతాలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ)ను నెలకొల్పారు. ఆయనకు 1968లో పద్మవిభూషణ్ లభించింది.

**జూలై 1**

ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ గౌరవార్థం జూలై 1ని వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే)గా జరుపుకొంటారు. డాక్టర్ బి.సి.రాయ్ పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రి. ఆయనకు 1961లో భారత అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న లభించింది. ఆయన 1882 జూలై 1న జన్మించారు. 1962లో జూలై ఒకటో తేదీనే మరణించారు. మన జీవితాల్లో వైద్యులు ఎంత ప్రముఖ పాత్ర పోషిస్తారో తెలియజేయడానికి జూలై ఒకటో తేదీని వైద్యుల దినోత్సవంగా పాటిస్తాం.

**ఆగస్టు 7**

భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ తేదీని.. జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైంది. దాని స్ఫూర్తిగా 2015 నుంచి ఆగస్టు 7ని జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుతున్నారు.

**ఆగస్టు 29**

హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ పుట్టిన రోజైన ఆగస్టు 29ని జాతీయ క్రీడా దినోత్సవంగా పరిగణిస్తారు. ధ్యాన్‌చంద్ అద్భుత ప్రతిభ వల్ల మనదేశానికి 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లలో బంగారు పతకాలు లభించాయి. ప్రజల్లో క్రీడల పట్ల అవగాహన కల్పించడానికి క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

**సెప్టెంబర్ 15**

ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 15వ తేదీన ఇంజనీర్స్ డే నిర్వహిస్తారు. ఆయన 1860 సెప్టెంబర్ 15న జన్మించారు. విశ్వేశ్వరయ్యకు 1955లో భారతరత్న లభించింది.

**సెప్టెంబర్ 25**

2014 నుంచి ఏటా సెప్టెంబర్ 25న అంత్యోదయ దివస్‌గా పాటిస్తున్నారు. ప్రముఖ తత్వవేత్త, భారతీయ జనసంఘ్ నాయకుడైన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జన్మదినం సెప్టెంబర్ 25.

**అక్టోబర్ 31**

భారత తొలి హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినమైన ఈ తేదీని 2014 నుంచి జాతీయ ఐక్యతా దినోత్సవంగా పాటిస్తున్నారు. ఆయనకు మరణానంతరం 1991లో భారత రత్నను ప్రదానం చేశారు.

**నవంబర్ 11**

భారతదేశ మొదటి విద్యామంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి అయిన నవంబర్ 11వ తేదీని జాతీయ విద్యాదినోత్సవంగా పాటిస్తారు. ఆయనకు 1992లో మరణానంతరం భారతరత్న ప్రదానం చేశారు.

**నవంబర్ 26**

భారత రాజ్యాంగ పరిషత్ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది. దీన్ని పురస్కరించుకొని నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించారు. భారత రాజ్యాంగం 1950, జనవరి 26 నుంచి అమల్లోకొచ్చింది.

**డిసెంబర్ 22**

భారత గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబర్ 22న జన్మించారు. ఆయన జయంతిని భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర దినోత్సవంగా ప్రకటించింది. 2012ను జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా పాటించారు.

**డిసెంబర్ 23**

దేశ మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ 1902 డిసెంబర్ 23న జన్మించారు. ఆయన జయంతిని కిసాన్ దివస్ లేదా వ్యవసాయదారుల దినోత్సవంగా నిర్వహిస్తారు. మనదేశంలోని రైతుల అభివృద్ధికి చరణ్‌సింగ్ నిరంతరం కృషి చేశారు.

**డిసెంబర్ 25**

భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పుట్టిన తేదీ అయిన డిసెంబర్ 25ని 2014 నుంచి జాతీయ సుపరిపాలనా దినోత్సవంగా జరుపుతున్నారు. ఆయనకు 2015 మార్చిలో భారతరత్న అందజేశారు.

### మరికొన్ని జాతీయ దినోత్సవాలు

| | |
|---|---|
| జనవరి 15 | సైనిక దినోత్సవం |
| జనవరి 24 | జాతీయ బాలికా దినోత్సవం |
| జనవరి 25 | జాతీయ పర్యాటక దినోత్సవం |
| జనవరి 30 | అమరవీరుల సంస్మరణ దినోత్సవం |
| ఫిబ్రవరి 2 | మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం దినోత్సవం |
| ఫిబ్రవరి 24 | సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం |
| మార్చి 3 | జాతీయ రక్షణ దినోత్సవం |
| మార్చి 4 | జాతీయ భద్రతా దినోత్సవం |
| ఏప్రిల్ 5 | జాతీయ మారిటైమ్ దినోత్సవం |
| ఏప్రిల్ 21 | సివిల్ సర్వీసెస్ దినోత్సవం |
| ఏప్రిల్ 24 | జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం |
| మే 21 | జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం (రాజీవ్ గాంధీ వర్ధంతి) |
| జూలై 1 | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దినోత్సవం |
| జూలై 26 | కార్గిల్ విజయ్ దివస్ |
| ఆగస్ట్ 9 | క్విట్ ఇండియా దినోత్సవం |
| ఆగస్ట్ 20 | జాతీయ సద్భావనా దినోత్సవం (రాజీవ్‌గాంధీ జయంతి) |
| సెప్టెంబర్ 5 | ఉపాధ్యాయుల దినోత్సవం |
| అక్టోబర్ 8 | భారత వైమానిక దినోత్సవం |
| అక్టోబర్ 10 | జాతీయ తపాలా దినోత్సవం |
| నవంబర్ 14 | బాలల దినోత్సవం |
| డిసెంబర్ 4 | నావికాదళ దినోత్సవం |
| డిసెంబర్ 7 | ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే |
| డిసెంబర్ 14 | జాతీయ శక్తి సంరక్షణ దినోత్సవం |



బుమ్రా బంతికి డారెన్ బ్రేవో బౌల్డ్

‘ప్రపంచంలో ఎవరు వేగంగా పరుగెత్తగలరో చూద్దాం అంటూ చిరుత, శునకాల మధ్య పందెంకు రంగం సిద్ధమైంది... పోటీ ప్రారంభమైనా చిరుత మాత్రం ఒక్క అడుగు కదపకుండా తన స్థానంలోనే ఉండిపోయింది. దాంతో ప్రేక్షకులు ఏమైందంటూ నిర్వాహకులను అడిగారు. ‘అందరికంటే అత్యుత్తమమని నిరూపించుకునే ప్రయత్నం చేయడం కూడా కొన్నిసార్లు పరువు తక్కువగా భావించాలి’...

సరిగ్గా వారం క్రితం జస్‌ప్రీత్ బుమ్రా ఈ ట్వీట్ చేశాడు. బుమ్రా ఆంతర్యం ఏమిటో స్పష్టంగా అంతు పట్టకపోయినా... కొత్తగా దూసుకొచ్చిన ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్‌ను ఆకాశానికెత్తడం, అతడితో తనను పోలుస్తుండటంపైనే ఈ ట్వీట్ అని క్రికెట్ ప్రపంచం అర్థాన్ని అన్వయించుకుంది. ఈ ట్వీట్‌తో ‘బుల్స్ ఐ’ ఇమోజీ కూడా జత చేసిన బుమ్రా ఆదివారం సరిగ్గా లక్ష్యాన్ని ఛేదించాడు. భారత అభిమానులతో సహా అంతా యాషెస్ ఉత్కంఠను అనుభవిస్తున్న సమయంలో తన సత్తా చూపిస్తూ అత్యద్భుత బౌలింగ్ ప్రదర్శనతో రికార్డులు తిరగరాశాడు.

# బూమ్ బూమ్ బ్లాస్ట్!

## బుమ్రా అత్యద్భుత బౌలింగ్ • రికార్డులతో అదరగొట్టిన భారత పేసర్

**నార్త్ సౌండ్:** దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్... ఈ నాలుగు దేశాల్లోనే బుమ్రా టెస్టులు ఆడాడు. కానీ నాటి ఇమ్రాన్ ఖాన్ నుంచి నేటి రవిచంద్రన్ అశ్విన్ వరకు ఆసియా దిగ్గజ బౌలర్లు ఎవరికీ సాధ్యం కాని ఘనతను అతను అందుకున్నాడు. ఈ నాలుగు దేశాల్లోనూ ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన రికార్డును బుమ్రా నెలకొల్పాడు. ఇవన్నీ తన తొలి పర్యటనలే కావడం విశేషం. దీనిని అందుకునేందుకు అతనికి 11 టెస్టులే సరిపోయాయి. వెస్టిండీస్‌తో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా బౌలింగ్ అతని విలువేమిటో మరోసారి చూపించింది. ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 75 పరుగుల ఆధిక్యం మాత్రమే కోల్పోయింది. రెండో ఇన్నింగ్స్‌లో విజయం కోసం భారత్ నిర్దేశించిన 419 పరుగుల భారీ లక్ష్యం కష్టసాధ్యమే అయినా... సొంతగడ్డపై కొంతయినా పోరాడగలదని అంతా భావించారు. కానీ మరీ ఘోరంగా ఒక సెషన్ లోపు కేవలం 26.5 ఓవర్లు మాత్రమే ఆడి 100 పరుగులకే జట్టు కుప్పకూలింది. ఇదంతా బుమ్రా చలవే! టెస్టుల్లో తొలిసారి బుమ్రాను ఎదుర్కొన్న విండీస్ బ్యాట్స్‌మెన్‌కు అసలు ఏం జరుగుతుందో అర్థమయ్యే లోపే కథ ముగిసిపోయింది. బుమ్రా ‘మ్యాజిక్ బంతులు’ తమను దెబ్బ తీశాయంటూ



ప్రత్యర్థి కెప్టెన్ హోల్డర్ వాపోయాడు.

### అవుట్ స్వింగర్లతో...

బంతి విసిరేందుకు తీసుకునే రనప్ చిన్నదే కావచ్చు... స్పీడ్‌గన్‌లో లెక్క కడితే బంతి వేగం సాధారణంగానే కనిపించవచ్చు. కానీ బుమ్రా వేసే బంతులు అంకెలకు మించి ప్రమాదకరమైనవి. ఒకనాటి అసలు సిసలు ఫాస్ట్ బౌలర్ల ఆలోచనా

> గతంలో ఇన్‌స్వింగర్లు ఎక్కువగా వేసేవాడిని. అయితే అనుభవం వస్తున్న కొద్దీ అవుట్ స్వింగర్లు కూడా బాగా వేయగలననే విశ్వాసం పెరిగింది. తాజా ప్రదర్శనతో చాలా సంతోషంగా ఉంది. అయితే ఇలాంటి బంతుల కోసం చాలా కష్టపడ్డాను. ఇంకా నేర్చుకోవాలనే తపనతో ఉన్నాను. వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగానే ఉండటంతో ఏదైనా భిన్నంగా ప్రయత్నించాలని మా పేసర్లు అందరం భావించాం. స్వింగ్‌కు పరిస్థితి కొంత అనుకూలంగా ఉందనిపించడంతో అలా ప్రయత్నించాం
>
> *–జస్‌ప్రీత్ బుమ్రా, భారత బౌలర్*

ధోరణి అతనిలో కనిపిస్తుంది. తాజా టెస్టులో అతను తన బౌలింగ్ దూకుడును చూపించాడు. చాలా మంది తరహాలో ఆఫ్ స్టంప్ బయటకు వేస్తూ కీపర్ లేదా స్లిప్ వైపు క్యాచ్ వచ్చే అవకాశం సృష్టించే ప్రయత్నం చేయలేదు. పూర్తిగా ఆఫ్ స్టంప్స్ లక్ష్యంగానే బంతులు విసిరాడు. అతని ఐదు వికెట్లలో నాలుగు క్లీన్‌బౌల్డ్‌లు ఉన్నాయంటేనే ఇది అర్థమవుతుంది. ముఖ్యంగా గతంలో పెద్దగా వాడని ‘అవుట్ స్వింగర్’ను బుమ్రా ప్రయోగించాడు. వరల్డ్ కప్ తర్వాత ఈ సిరీస్‌కు ముందు లభించిన విరామంలో అతను దీనిపై ప్రత్యేక సాధన చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రసారకర్త ‘సోనీ’ అంకెల ప్రకారం కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్‌కు బుమ్రా వేసిన ప్రతీ పది బంతుల్లో ఏడు అవుట్ స్వింగర్లే ఉన్నాయి! వెన్నునొప్పితో తొలి ఇన్నింగ్స్‌లో పూర్తి వేగంతో బౌలింగ్ చేయలేకపోయిన జస్‌ప్రీత్... రెండో ఇన్నింగ్స్‌లో స్వింగ్‌కు కొంత అనుకూలంగా కనిపించిన వాతావరణాన్ని పూర్తిగా వాడుకున్నాడు.

### 8-4-7-5

బుమ్రా వేసిన 48 బంతులు విండీస్ బ్యాట్స్‌మెన్ పాలిట బుల్లెట్లలా మారాయి. అతని తొలి ఓవర్ మూడో బంతిని వెంటాడి బ్రాత్‌వైట్ ఔట్ కావడంతో విండీస్ తొలి వికెట్ కోల్పోయింది. బుమ్రా తర్వాతి ఓవర్లో దూసుకొచ్చిన బంతి క్యాంప్‌బెల్ స్టంప్స్‌ను పడగొట్టింది. మరుసటి ఓవర్లో స్లిప్‌లో కోహ్లి క్యాచ్ వదిలేయకపోతే మరో వికెట్ అప్పుడే దక్కేది. కానీ అతని నాలుగో ఓవర్లో హైలైట్ బంతి వచ్చింది. అద్భుతమైన స్వింగ్‌కు బ్రేవో ఆఫ్ స్టంప్ ఎగిరి ‘బండి చక్రం’లా గిరగిరా తిరిగింది! తొలి ఐదు ఓవర్లలో విండీస్ బ్యాట్స్‌మెన్ చచ్చీ చెడి ఏడు సింగిల్స్ తీయగలిగారు. కానీ కథ అంతటితో ముగియలేదు. బుమ్రా ఆరో ఓవర్ తొలి బంతికి హోప్ స్టంప్ బద్దలైంది. ఎంతో కొంత పోరాడగలడని భావించిన హోల్డర్‌కు కూడా బుమ్రా బంతి అర్థం కాలేదు. ఫలితం మరో సారి ఆఫ్‌స్టంప్‌పై ఎర్రబంతి దాడి! ఇక విరామం అంటూ కోహ్లి 8 ఓవర్ల స్పెల్ తర్వాత ఆపడంతో ఈ తుఫాన్ ఆగింది. మరో అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా ఫాస్ట్ బౌలర్ల గడ్డపై తొలి టెస్టును సంతృప్తిగా ముగించాడు.

**5/7**

ఇన్నింగ్స్‌లో కనీసం ఐదు వికెట్లు పడగొట్టిన సందర్భంలో అతి తక్కువ పరుగులు ఇచ్చిన భారత్ బౌలర్‌గా బుమ్రా గుర్తింపు పొందాడు. 1990లో వెంకటపతిరాజు 12 పరుగులిచ్చి 6 వికెట్లు తీశాడు.

**4**

బుమ్రా ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీయడం ఇది నాలుగోసారి కాగా నాలుగు వేర్వేరు జట్లపైనే సాధించాడు.

# ఈ విజయం ఎంతో ప్రత్యేకం

**కోచ్ పుల్లెల గోపీచంద్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** పీవీ సింధు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నిలవడంతో అందరికంటే అమితానందం పొందిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ఆయన భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్. తన శిష్యురాలి తాజా ప్రదర్శన గోపీచంద్‌ను గర్వపడేలా చేసింది. స్వర్ణం సాధించడంతో ఒక పనైపోయిందని ఆయన అన్నారు. ‘నాకు సంబంధించి ఇది చాలా పెద్ద విజయం. వరల్డ్ చాంపియన్ అనిపించుకోవడం నిజంగా చాలా గొప్ప ఘనత. దీనిని ఆమె సాధించిన తీరు ఇంకా అపూర్వం. రెట్టింపు గర్వంగా అనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ గెలుపు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇక మన దేశం నుంచి ఇప్పటికే కాంస్యం, రజతం చూశాం. ఇప్పుడు స్వర్ణం కూడా దక్కింది’ అని గోపీచంద్ భావోద్వేగంతో చెప్పారు. ఒకుహారాతో జరిగిన మ్యాచ్‌పై ప్రత్యేక వ్యూహంతో బరిలోకి దిగాల్సిన అవసరం లేకపోయిందని, ఒక్కసారి మ్యాచ్‌లో పట్టు చిక్కితే ఆమె దూసుకుపోతుందనే విషయం తనకు తెలుసని కోచ్ వ్యాఖ్యానించారు. ‘ఒలింపిక్స్, వరల్డ్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్,



ఆసియా క్రీడలు... ఇలా అన్ని చోట్లా సింధు రాణించింది. బయటి వారి సంగతి ఎలా ఉన్నా ఆమె ఆటపై నాకు మాత్రం ఎలాంటి సందేహాలు లేవు. ఫైనల్లో ఫలితం ప్రతికూలంగా వచ్చినా నేను బాధపడకపోయేవాడిని. మన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే ముఖ్యం’ అని మాజీ ఆల్‌ఇంగ్లండ్ చాంపియన్ అభిప్రాయపడ్డారు.

**ఎమ్మెస్కే అభినందన...**

సింధు విజయంపై భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అభినందనలు తెలియజేశారు. ఈ క్రమంలో గోపీచంద్ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు ‘సింధు కఠోర శ్రమ, అంకితభావం, నైపుణ్యానికి దక్కిన ఫలితమిది. ఆమెను చూసి దేశం గర్విస్తోంది. భారత బ్యాడ్మింటన్‌కు వెన్నెముకలా నిలిచి శ్రమించిన గోపీచంద్‌కు కూడా నా అభినందనలు. వ్యక్తిగతంగా ఆయన నాకు ఆత్మీయ మిత్రుడు. ఇంతటి అంకితభావం ఉన్న కోచ్‌ను నేను ఎప్పుడూ చూడలేదు’ అని ప్రసాద్ అన్నారు.

**చాముండేశ్వరీనాథ్ కారు కానుక...**

వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణం గెలిచిన పీవీ సింధుకు అత్యాధునిక హై ఎండ్ కారును బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వి.చాముండేశ్వరీనాథ్ ప్రకటించారు. నేడు హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో దీనిని అందజేసే అవకాశం ఉంది.

# హరియాణాను గెలిపించిన వికాశ్

**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 36–33తో బెంగాల్ వారియర్స్‌ను కంగుతినిపించింది. హరియాణా రైడర్ వికాశ్ కండోలా 11 పాయింట్లతో చెలరేగాడు. మరో రైడర్ వినయ్ 9 పాయింట్లతో వికాశ్‌కు చక్కని సహకారం అందించాడు. బెంగాల్ వారియర్స్ రైడర్ మణీందర్ సింగ్ 15 పాయింట్లతో ‘టాప్’ స్కోరర్‌గా నిలిచినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. మరో మ్యాచ్‌లో యూపీ యోధ 35–30తో పుణేరి పల్టన్‌పై నెగ్గింది. నేడు ప్రొ కబడ్డీ లీగ్‌లో విశ్రాంతి దినం. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్‌తో హరియాణా స్టీలర్స్; యు ముంబాతో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.





# ఏం చేసినా జట్టు ప్రయోజనాలకే!

- తుది జట్టు ఎంపికపై కోహ్లి
- అత్యధిక టెస్టు విజయాలు సాధించిన భారత కెప్టెన్‌గా రికార్డు సమం

**నార్త్ సౌండ్:** వెస్టిండీస్‌తో తొలి టెస్టులో భారత్ 318 పరుగుల భారీ తేడాతో గెలిచింది. అయితే మ్యాచ్ తొలి రోజు తుది జట్టు ఎంపికపై పలు విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా సీనియర్ స్పిన్నర్ అశ్విన్‌ను ఆడించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. దీనిపై జట్టు కెప్టెన్ కోహ్లి మ్యాచ్ ముగిసిన తర్వాత వివరణ ఇచ్చాడు. తాము ఏ నిర్ణయం తీసుకున్నా జట్టు ప్రయోజనాల కోసమేనన్న కెప్టెన్... టెస్టులో సహచరుల ఆటపై ప్రశంసలు కురిపించాడు. ‘తుది జట్టు విషయంలో మేమందరం కలిసి ముందుగా చర్చించుకొని ఆ తర్వాత టీమ్‌కు ఏది మేలు చేస్తుందో ఆ నిర్ణయం తీసుకుంటాం. ఆడే 11 మంది విషయంలో ఎప్పుడూ భిన్నాభిప్రాయాలు ఉంటాయి. అయితే ఏం చేసినా జట్టు ప్రయోజనాల కోసమేనని అందరూ అర్థం చేసుకుంటారు’ అని కోహ్లి స్పష్టం చేశాడు. రోహిత్ శర్మను కాదని హనుమ విహారిని ఎంచుకున్న నిర్ణయాన్ని కెప్టెన్ సమర్థించుకున్నాడు. ‘కాంబినేషన్ కీలకం కాబట్టి విహారి జట్టులోకి వచ్చాడు. అతను నాణ్యమైన పార్ట్‌టైమ్ బౌలర్. ఓవర్‌రేట్ పెరిగిపోతోందని అనిపించిన సమయంలో విహారి పనికొస్తాడు’ అని విరాట్ చెప్పాడు. తాను అనుకున్న వ్యూహాలను సహచరులందరూ సమర్థంగా అమలు చేయడం ఆనందంగా ఉందని కెప్టెన్ వ్యాఖ్యానించాడు. ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి త్రుటిలో తొలి టెస్టు సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 93 పరుగులతో ఆకట్టుకున్న అతను ఇకపై తన ఆఫ్‌స్పిన్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించాడు.

**1** విదేశీ గడ్డపై భారత్‌కు ఇదే (318 పరుగులు) అతి పెద్ద విజయం. 2017లో శ్రీలంకను (గాలే) భారత్ 304 పరుగులతో ఓడించింది.

**27** కోహ్లి కెప్టెన్సీలో భారత్‌కు ఇది 27వ టెస్టు విజయం. అత్యధిక విజయాల భారత కెప్టెన్‌గా ధోని (27) రికార్డును కోహ్లి సమం చేశాడు.

**12** కోహ్లి కెప్టెన్సీలో విదేశాల్లో భారత్ 12 టెస్టులు గెలిచింది. ఈ క్రమంలో విదేశీ గడ్డపై అత్యధిక విజయాల భారత కెప్టెన్‌గా గంగూలీ (11) ఘనతను విరాట్ అధిగమించాడు.

**100** అంతర్జాతీయ క్రికెట్‌లో (మూడు ఫార్మాట్‌లు కలిపి) కెప్టెన్‌గా కోహ్లికిది వందో విజయం. అతనికంటే ముందు భారత్ తరఫున ధోని (178), అజహర్ (104) వందకంటే ఎక్కువ విజయాలు సాధించారు.

**100** భారత్‌పై విండీస్‌కు ఇదే అత్యల్ప స్కోరు. 2006లో ఆ జట్టు 103 పరుగులు చేసింది.

# గట్టెక్కిన బార్టీ, ప్లిస్కోవా



ప్లిస్కోవా

**న్యూయార్క్:** టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో రెండో సీడ్ యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా), మూడో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఈ ఇద్దరు మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణులకు తమ ప్రత్యర్థుల నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచిన బార్టీ గంటా 41 నిమిషాల్లో 1–6, 6–3, 6–2తో జరీనా దియాస్ (కజకిస్తాన్)పై గెలుపొందగా... 2016 యూఎస్ ఓపెన్ రన్నరప్ ప్లిస్కోవా గంటా 46 నిమిషాల్లో 7–6 (8/6), 7–6 (7/3)తో తన దేశానికే చెందిన తెరెజా మార్టిన్‌కోవాను ఓడించింది. దియాస్‌తో జరిగిన మ్యాచ్‌లో బార్టీ ఎనిమిది ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. ఇతర మ్యాచ్‌ల్లో 16వ సీడ్ జొహానా కొంటా (బ్రిటన్) 6–1, 4–6, 6–2తో కసత్‌కినా (రష్యా)పై, 12వ సీడ్ సెవస్తోవా (లాత్వియా) 6–3, 6–3తో యూజిన్ బుషార్డ్ (కెనడా)పై గెలిచారు. 2016 రియో ఒలింపిక్స్ విజేత మోనికా పుయిగ్ (ప్యూర్టోరికో) 3–6, 3–6తో రెబెకా (స్వీడన్) చేతిలో... 2011 యూఎస్ ఓపెన్ విజేత సమంతా స్టోసుర్ (ఆస్ట్రేలియా) 1–6, 3–6తో ఎకతెరీనా (రష్యా) చేతిలో... 27వ సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) 6–7 (8/10), 2–6తో ఓన్స్ జబీర్ (ట్యునీషియా) చేతిలో ఓడిపోయారు.

**యూఎస్ ఓపెన్ టోర్నీ**

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 4–6, 1–6, 2–6తో ప్రపంచ ఐదో ర్యాంకర్ డానిల్ మెద్వెదేవ్ (రష్యా) చేతిలో ఓడిపోయాడు. తొలి రౌండ్‌లో ఓడిన ప్రజ్నేశ్‌కు 58,000 డాలర్ల (రూ. 41 లక్షల 62 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

# కివీస్ అద్భుత విజయం

**రెండో టెస్టులో శ్రీలంకపై ఇన్నింగ్స్ 65 పరుగులతో గెలుపు**

**కొలంబో:** ప్రతి రోజూ ఏదో ఒక దశలో వర్షం అంతరాయం కలిగించినా... చివరి రోజు అందివచ్చిన సమయంలో న్యూజిలాండ్ బౌలర్లు అదరగొట్టారు. ఫలితంగా శ్రీలంకతో జరిగిన చివరిదైన రెండో టెస్టులో విలియమ్సన్ బృందం ఇన్నింగ్స్ 65 పరుగుల ఆధిక్యంతో గెలిచింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా సెంచరీ హీరో లాథమ్ (154) నిలిచాడు. అరగంట ఆలస్యంగా... ఓవర్ నైట్ స్కోరు 382/5తో ఆఖరి రోజు ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ మరో వికెట్ నష్టపోయి 431 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. గ్రాండ్‌హోమ్ ఓవర్ నైట్ స్కోర్ (83) వద్దే ఔటైనా మరో ఎండ్‌లో వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ వాట్లింగ్ (105 నాటౌట్; 9 ఫోర్లు) శతకం పూర్తి చేసుకున్నాడు. 185 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 70.2 ఓవర్లలో 122 పరుగులకు కుప్పకూలింది. సౌతీ, బౌల్ట్, ఎజాజ్ పటేల్, సోమర్‌విల్లె రెండేసి వికెట్లు తీశారు. గాయం



కారణంగా దిముత్ కరుణరత్నే స్థానంలో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కుశాల్ పెరీరా (0), తిరిమన్నె (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. ఒక దశలో 32 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన శ్రీలంకను వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ డిక్‌వెల్లా (51; 6 ఫోర్లు), సారథి కరుణరత్నే (21) ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 41 పరుగులు జోడించి మ్యాచ్‌ను ‘డ్రా’గా ముగించేలా కనిపించారు. అయితే కరుణరత్నేను సౌతీ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం, కాసేపటికే ఒంటరి పోరాటం చేస్తున్న డిక్‌వెల్లాను స్పిన్నర్ ఎజాజ్ పటేల్ పెవిలియన్‌కు పంపడంతో న్యూజిలాండ్ విజయం ఖాయమైంది.

epaper.sakshi.com

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 793 ▲ | 229 ▲ |
| 37,494 | 11,058 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30కి)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,836 | ▲ | 84 |
| డోజోన్స్ | 25,866 | ▲ | 237 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,095 | ▼ | 33 |
| డాక్స్ | 11,658 | ▲ | 46 |
| షాంఘై | 2,864 | ▼ | 34 |
| నికాయ్ | 20,261 | ▼ | 450 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.46 | 74.07 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.21 | 91.12 |
| € | యూరో | ఎస్‌బీఐ | 78.27 | 82.75 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 65.00 | 71.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.54 | 50.63 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.71 | 53.79 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.43 | 20.19 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.86 | 20.43 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.46 | 10.81 |

## కృష్ణపట్నంలో బీపీసీఎల్ ఎల్ఎన్‌జీ టెర్మినల్

**రూ.1,500–1,700 కోట్ల పెట్టుబడి**




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ చమురు రిఫైనింగ్, ఇంధన మార్కెటింగ్ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద ఫ్లోటింగ్ ఎల్ఎన్‌జీ ఇంపోర్ట్ టెర్మినల్‌ను నిర్మించనుంది. 2022 నాటికి ఇది పూర్తి కానుంది. దీనికోసం రూ.1,500–1,700 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు బీపీసీఎల్ చైర్మన్ డి.రాజ్‌కుమార్ వెల్లడించారు. ప్రాజెక్టులో బీపీసీఎల్‌కు 74 శాతం, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీకి 26 శాతం వాటా ఉంటుందని చెప్పారు. తొలుత ఈ ఫ్లోటింగ్ స్టోరేజ్ రీగ్యాసిఫికేషన్ యూనిట్ వార్షిక సామర్థ్యం 10 లక్షల టన్నులుగా ఉంటుంది. భవిష్యత్తులో దీనిని 50 లక్షల టన్నుల సామర్థ్యానికి చేర్చవచ్చు.

# ఆర్‌బీఐ బొనాంజా!



## కేంద్రానికి ఈ ఏడాది రూ.1.76 లక్షల కోట్ల నిధులు

- జలాన్ కమిటీ సిఫారసులకు ఆర్‌బీఐ బోర్డ్ ఆమోదముద్ర
- డివిడెండ్, మిగులు నిల్వల బదిలీతో ఖజానాకు జోష్

**ముంబై:** కేంద్రానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–2020) రూ.1,76,051 కోట్ల నిధుల బదలాయింపు జరగనుంది. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోకి కమిటీ సిఫారసులకు సోమవారం సెంట్రల్ బ్యాంక్ బోర్డ్ ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో తాజా నిధుల బదలాయింపు జరుగుతోంది. సెంట్రల్ బ్యాంక్ వద్ద ఉన్న అదనపు నిల్వల్లో ఎంతమొత్తం కేంద్రానికి బదలాయించాలన్న అంశంపై సిఫారసులు చేయడానికి జలాన్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటయిన సంగతి తెలిసిందే.

**ప్రకటన సారాంశమిది...**

''కేంద్రానికి రూ.1,76,051 కోట్ల బదలాయింపు జరగాలని సెంట్రల్ బ్యాంక్ నిర్ణయించింది. ఇందులో రూ.1,23,414 కోట్లు 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మిగులు (డివిడెండ్). మిగిలిన రూ.52,637 కోట్లు సవరిత ఎకనమిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్) ప్రకారం గుర్తించిన అదనపు ప్రొవిజన్లకు సంబంధించినది (అర్‌బీఐ అదనపు నిల్వలకు సంబంధించినది)'' అని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

**ద్రవ్యలోటుకు మందు!**

ప్రభుత్వ ఆదాయాలు– వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు కట్టడి విషయంలో జలాన్ కమిటీ సిఫారసులు కేంద్రానికి ఎంతో సానుకూల అంశమని నిపుణులు పేర్కొంటున్నారు. 2019–2020 మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో ద్రవ్యలోటు 3.4 శాతం (రూ.7.03 లక్షల కోట్లు) ఉండాలన్నది కేంద్రం లక్ష్యం. అయితే జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి (ఏప్రిల్,మే,జూన్) రూ.4.32 లక్షల కోట్లకు చేరింది. అంటే తాజా గణాంకాలు చూస్తే, ద్రవ్యలోటు నిర్దేశించుకున్న బడ్జెట్ లక్ష్యంలో జూన్ నాటికే 61.4 శాతానికి చేరిందన్నమాట. ద్రవ్య లోటును కేంద్రం ఎలా పూడ్చుకుంటుందనే అంశంపై ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. ద్రవ్యలోటు సమస్యను అధిగమించేందుకు ఆర్‌బీఐ వద్ద ఉన్న నిధుల్లో మెజారిటీ వాటాను పొందాలని కేంద్రం భావిస్తున్నట్లు వచ్చిన వార్తలు గతంలో చర్చనీయాంశం అయ్యాయి. ఆర్‌బీఐ వద్ద జూన్ నాటికి రూ.9.43 లక్షల కోట్ల అదనపు నిల్వలున్నాయి. నగదు, బంగారం రీవాల్యుయేషన్ (రూ.6.91 లక్షల కోట్లు), కంటెంజెన్సీ ఫండ్ (రూ.2.32 లక్షల కోట్లు) ద్వారా ఈ నిధులు సమకూరాయి. ఇందులో అధిక మొత్తాన్ని కేంద్రం కోరుతోందన్న వార్తల నేపథ్యంలో– డిసెంబర్ 10వ తేదీన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ప్రకటించారు. ఈ నిధుల నిర్వహణను పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని అంతకుముందు నవంబర్ 19న ఆర్‌బీఐ బోర్డ్ నిర్ణయించింది. శక్తికాంత్ దాస్ గవర్నర్ అయ్యాక డిసెంబర్‌లో మాజీ ఆర్‌బీఐ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో 'నిధుల బదలాయింపుపై' ఆరుగురు కమిటీ కూడా ఏర్పాటయ్యింది. నిజానికి ఈ కమిటీ జూన్‌నెల చివరికల్లా నివేదిక సమర్పిస్తుందని భావించినా, కొన్ని భేదాభిప్రాయాల వల్ల నివేదిక సమర్పణ వాయిదా పడుతూ వచ్చింది.

### జలాన్ కమిటీ నాల్గవది...



గతంలోనూ ఆర్‌బీఐ నిల్వలపై మూడు కమిటీలు ఏర్పాటయ్యాయి. వి.సుబ్రమణ్యం (1997), ఉషా థోరట్ (2004), వైహెచ్ మాలేగామ్ (2013) ఈ కమిటీలకు నేతృత్వం వహించారు. మొత్తం రుణాల్లో 12 శాతం వరకూ ఆర్‌బీఐ నిల్వల రూపంలో ఉండాలని సుబ్రమణ్యం కమిటీ సిఫారసు చేస్తే, ఉషా థోరట్ కమిటీ దీనిని 18 శాతంగా పేర్కొంది. ఆర్‌బీఐ థోరట్ కమిటీ సిఫారసును తోసిపుచ్చింది. సుబ్రమణ్యం కమిటీ సిఫారుల మేరకు నడుచుకోవాలని నిర్ణయం తీసుకుంది. కాగా లాభాల్లో తగిన మొత్తాన్ని ఏటా కంటింజెన్సీ నిల్వలకు బదలాయించాలని మాలేగామ్ కమిటీ సిఫారసు చేసింది. ప్రస్తుతం స్థూల రుణాల్లో 28 శాతం నిష్పత్తిలో ఆర్‌బీఐ వద్ద మిగులు నిల్వలు ఉన్నాయి. అయితే అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం 14 శాతం నిధులు సరిపోతాయని ఆర్థిక మంత్రిత్వశాఖ భావిస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.

## బంగారం రూ.40 వేల పైకి...

- సరికొత్త గరిష్టస్థాయి
- అంతర్జాతీయంగా సానుకూలత



ముంబై: దేశంలో పసిడి మెరిసిపోతోంది. అంతర్జాతీయంగా పటిష్ట ధోరణి, దేశీయంగా రూపాయి బలహీనత వంటి అంశాలు పసిడికి కలిసివస్తున్నాయి. ముంబై స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.40,100 వద్దకు చేరింది. ఇది సరికొత్త గరిష్టస్థాయి. ఇక 22 క్యారెట్ల ధర రూ.38,190గా ఉంది. 2011 సెప్టెంబర్‌లో ఔన్స్(31.1గ్రా)కు 1,920 డాలర్లను చూసిన పసిడి, మళ్లీ ఆ దిశగా నడుస్తోందా? అన్నట్లు పరిస్థితి కనబడుతోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య యుద్ధం, సెంట్రల్ బ్యాంకులు సైతం పసిడి కొనుగోళ్లు వంటి అంశాలు బంగారానికి బలాన్ని ఇస్తున్నాయి. అంతర్జాతీయంగా పసిడి సోమవారం తాజా సరికొత్త స్థాయి 1,564.95 డాలర్లను చూసింది. ఇక దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్– ఎంసీఎక్స్‌లో ధర 10 గ్రాములకు స్వల్ప లాభంతో రూ.38,903 వద్ద ట్రేడవుతోంది. గరిష్ట స్థాయి రూ. 39,340ని చూసింది.

# హైదరాబాద్‌లో వన్ ప్లస్ ఆర్‌అండ్‌డీ సెంటర్

- మూడేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడి
- కంపెనీ ఫౌండర్, సీఈవో పీట్ లావ్



ఆర్ అండ్ డీ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వికాస్, జయేశ్ రంజన్, కేటీఆర్, పీట్ లావ్, ఆర్‌అండ్‌డీ సెంటర్ హెడ్ రామ్‌గోపాల్ రెడ్డి (ఎడమ నుంచి వరుసగా)

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రీమియం మొబైల్ ఫోన్ల తయారీలో ఉన్న చైనా సంస్థ వన్‌ప్లస్ హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పింది. ఇక్కడి నానక్‌రామ్‌గూడలో 1,86,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫెసిలిటీని తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ సోమవారం ప్రారంభించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరమైన ఉత్పత్తులను ఇక్కడ అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా వన్ ప్లస్ ఫౌండర్, సీఈవో పీట్ లావ్ వెల్లడించారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, 5జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగాల్లో పరిశోధన, అభివృద్ధి సాగుతుందన్నారు. కెమెరా ల్యాబ్, కమ్యూనికేషన్స్ అండ్ నెట్‌వర్కింగ్ ల్యాబ్, ఆటోమేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. కెమెరా ల్యాబ్‌కు రూ.100 కోట్లు వ్యయం చేస్తామని వివరించారు. మూడేళ్లలో కంపెనీకి ఇది అతిపెద్ద ఆర్‌అండ్‌డీ కేంద్రంగా అవతరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**మూడేళ్లలో 1,500 మంది..**

ప్రస్తుతం ఈ కేంద్రంలో 200 మంది నిపుణులు ఉన్నారు. మూడేళ్లలో ఈ సంఖ్య 1,500లకు చేరుతుందని వన్ ప్లస్ ఇండియా జీఎం వికాస్ అగర్వాల్ వెల్లడించారు. వీరిలో 25–40 శాతం ఫ్రెష్ గ్రాడ్యుయేట్లను నియమించుకుంటామని చెప్పారు. 'రానున్న మూడేళ్ల కాలంలో ఆర్‌అండ్‌డీ సెంటర్‌కు రూ.1,000 కోట్లు పెట్టుబడి చేస్తాం. ఆవిష్కరణల విషయంలో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలుపుతాం. ఈ ఏడాదే భారత్ నుంచి విదేశాలకు మొబైల్ ఫోన్లు ఎగుమతి చేస్తాం. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల రంగంలో ప్రపంచంలో 2 శాతం వాటాతో తొలి అయిదు స్థానాల్లో ఉన్నాం. భారత్‌లో 43 శాతం వాటాతో అగ్రస్థాయిని కైవసం చేసుకున్నాం. 16,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో హిమాయత్‌నగర్‌లో నిర్మిస్తున్న అతి పెద్ద ఎక్స్‌పీరియెన్స్ జోన్‌ను అక్టోబరు–డిసెంబరు మధ్య ప్రారంభిస్తాం' అని వివరించారు.

**షెంజెన్ గుర్తొచ్చింది..**

పీట్ లావ్ గత ఏడాది హైదరాబాద్ సందర్శించారు. భాగ్యనగరిని చూడగానే ఆయనకు ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ రాజధానిగా పేరున్న షెంజెన్ గుర్తొచ్చింది. ఆ నగరం మాదిరిగా హైదరాబాద్ సైతం అభివృద్ధి చెందుతోందని పీట్ భావించారు. 'దేశంలో స్టార్టప్స్ జోన్‌గా భాగ్యనగరి రూపొందుతోంది. కంపెనీకి అవసరమైన నిపుణులు ఇక్కడ ఉన్నారు. అందుకే ఆర్‌అండ్‌డీ సెంటర్ కోసం ఈ నగరాన్ని ఎంచుకున్నాం' అని ఆయన వెల్లడించారు. తెలంగాణలో తయారీ కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా పీట్ లావ్‌ను ఉద్దేశించి కేటీఆర్ కోరారు. 'తయారీ కేంద్రానికి అవసరమైన స్థలాన్ని చూపిస్తానని కేటీఆర్ చెప్పారు. ఇందు కోసం సెప్టెంబరులో తిరిగి భారత్ వస్తాను' అని పీట్ మీడియాకు తెలిపారు. ప్రస్తుతం కంపెనీకి నోయిడాలో ఫోన్ల తయారీ ప్లాంటు ఉంది. రెండవ ప్లాంటు ఎక్కడ, ఎప్పుడు స్థాపించేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

**ప్రాఫిట్ ప్లస్ | డైలీ**

### ఏటీఎం నుంచి నగదు తీసుకోవాలంటే ఓటీపీ

ఏటీఎంల నుంచి డెబిట్, క్రెడిట్ కార్డులతో డబ్బులను డ్రా చేసుకోవచ్చు.. కానీ, కెనరా బ్యాంకు ఏటీఎం నుంచి నగదు విత్ డ్రా చేసుకోవాలంటే మాత్రం ఓటీపీని ఎంటర్ చేయాల్సిందే. కాకపోతే ఒక రోజులో రూ.10,000 ఆ పై మొత్తాలకే ఈ ఓటీపీ నిబంధన. ''కెనరా బ్యాంకు ఏటీఎంలలో నగదు ఉపసంహరణలు ఇప్పుడిక మరింత సురక్షితం.



రోజులో రూ.10,000కు మించి చేసే నగదు విత్ డ్రాయల్స్ ఓటీపీతో మరింత సురక్షితం కానున్నాయి. ఈ అదనపు ఆథెంటికేషన్ కార్డుదారుల ప్రమేయం లేకుండా అనధికారిక లావాదేవీలు జరగకుండా నిరోధిస్తుంది'' అని కెనరా బ్యాంకు తన ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వరంగంలోని ఎస్‌బీఐ కార్డు లేకపోయినా, కస్టమర్లు తమ యోనో యాప్ సాయంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణల సేవను ఆరంభించిన విషయం తెలిసిందే.

# మార్కెట్‌కు ప్యాకేజీ జోష్..



- ప్రభుత్వ ఉద్దీపన చర్యలతో గ్యాప్ అప్ ఓపెనింగ్
- అగ్రరాజ్యాల పరస్పర సుంకాల పోరుతో నష్టాలు
- వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు మళ్లీ షురూ కానున్న చర్చలు
- దీంతో మళ్లీ లాభాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీలు
- 793 పాయింట్ల లాభంతో 37,494కు సెన్సెక్స్
- 229 పాయింట్లు పెరిగి 11,058కు నిఫ్టీ

**మం**దగమనంలో ఉన్న వృద్ధికి జోష్‌నివ్వడానికి ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ స్టాక్ మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపించింది. వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం అమెరికా–చైనాల మధ్య తాజాగా చర్చలు ప్రారంభం కానున్నాయన్న వార్తలు మధ్యాహ్నం తర్వాత వెలువడ్డాయి. దీంతో కొనుగోళ్లు మరింత జోరుగా సాగాయి. సెన్సెక్స్ 37,000 పాయింట్లు, నిఫ్టీ 11,000 పాయింట్లపైకి ఎగబాకాయి. లోహ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు పెరిగాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 793 పాయింట్లు పెరిగి 37,494 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 229 పాయింట్లు పెరిగి 11,058 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీలు ఒక్క రోజులో ఇన్నేసి పాయింట్లు పెరగడం గత మూడు నెలల్లో ఇదే మొదటిసారి. ఆసియాలోని ప్రధాన స్టాక్ మార్కెట్ సూచీలు 3 శాతం మేర పతనమైనా, మన స్టాక్ సూచీలు 2 శాతం మేర లాభపడటం విశేషం.

**భారీ లాభాలతో బోణి...**

మందగమనం నుంచి మరింత వృద్ధి దిశకు ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించడానికి కొన్ని చర్యలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. ఈ చర్యలే కాకుండా సరైన సమయంలో మరిన్ని చర్యలు కూడా తీసుకుంటామని ఆమె అభయం ఇచ్చారు. ఇక అమెరికా–చైనాలు పరస్పరం సుంకాలు విధించుకున్న నేపథ్యంలో సోమవారం ఆసియా మార్కెట్లు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నా, ప్యాకేజీ జోష్‌తో మన మార్కెట్ మాత్రం భారీ లాభాల్లో ఆరంభమైంది. సెన్సెక్స్ 663 పాయింట్లు, నిఫ్టీ 171 పాయింట్ల లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. వెంటనే సెన్సెక్స్ 843 పాయింట్లు, నిఫ్టీ 259 పాయింట్ల లాభాలను తాకాయి. కానీ ప్రపంచ మార్కెట్ల పతనం కారణంగా ఈ లాభాలన్నీ ఆవిరై సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లోకి జారిపోయాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 208 పాయింట్లు, నిఫ్టీ 72 పాయింట్ల మేర నష్టపోయాయి. వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం అమెరికా–చైనాల మధ్య మళ్లీ చర్చలు జరగనున్నాయన్న వార్తలతో స్టాక్ మార్కెట్ మళ్లీ లాభాల బాట పట్టింది. మొత్తం మీద రోజంతా సెన్సెక్స్1,051 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు భారీగా నష్టపోగా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

**మరిన్ని విశేషాలు....**

- యస్ బ్యాంక్ షేర్ 6.3 శాతం పెరిగి రూ.63 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా పెరిగిన షేర్ ఇదే.
- స్టాక్ మార్కెట్ లాభాల కారణంగా పదికి పైగా షేర్లు ఏడాది గరిష్ట స్థాయిలకు చేరాయి. బాటా ఇండియా, ఫోర్స్ మోటార్స్, జీఎస్‌కే కన్సూమర్ ఈ జాబితాలో ఉన్నాయి. మరో వైపు అలోక్ ఇండస్ట్రీస్, అబన్ ఆఫ్‌షోర్, డీబీ రియల్టీ, సీజీ పవర్, ఈక్లర్క్స్ సర్వీసెస్, ఖదిమ్ ఇండియా వంటి 180కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి.

**స్టాక్ మార్కెట్ భారీ లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.2.41 లక్షల కోట్లు పెరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా**

**ఇన్వెస్టర్ల సంపద 2.41 లక్షల కోట్లు అప్**

**పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.2.41 లక్షల కోట్లు పెరిగి రూ.1,40,33,462 కోట్లకు పెరిగింది.**

**బ్యాంక్, హెచ్‌ఎఫ్‌సీ షేర్ల జోరు**

మొండి బకాయిలతో కుదేలైన ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను ఆదుకోవడానికి తాజాగా రూ.70,000 కోట్ల మూలధన నిధులందించగలమని కేంద్రం అభయం ఇవ్వడంతో బ్యాంక్ షేర్లు జోరుగా పెరిగాయి. ఈ నిధుల కారణంగా రూ.5 లక్షల కోట్ల మేర లిక్విడిటీ అందుబాటులోకి వస్తుందని అంచనా. ఫలితంగా మరిన్ని రుణాలు అందుబాటులోకి వచ్చి, వ్యవస్థలో లిక్విడిటీ సమస్య ఒకింత తీరగలదన్న అంచనాలతో బ్యాంక్ షేర్లలో జోరుగా కొనుగోళ్లు సాగాయి. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 10 శాతం, అలహాబాద్ బ్యాంక్ 8 శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 6 శాతం, బ్యాంక్ ఆఫ్ ఇండియా 4 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.6 శాతం, ఎస్‌బీఐ 3 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 3..4 శాతం, కెనరా బ్యాంక్ 3.3 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 1.7 శాతం చొప్పున లాభపడ్డాయి. బ్యాంక్ షేర్లతో పాటు హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు కూడా జోరుగా పెరిగాయి. హెచ్‌ఎఫ్‌సీలకు నేషనల్ హౌసింగ్ బ్యాంక్(ఎన్‌హెచ్‌బీ) రూ.20,000 కోట్ల మేర నిధులు అందజేయనున్నది. ఈ నిర్ణయం కారణంగా హెచ్‌ఎఫ్‌సీలు లాభపడ్డాయి. ఎమ్ అండ్ ఎమ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 5 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 4 శాతం, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్3 శాతం మేర ఎగిశాయి.

### లాభాలు ఎందుకంటే...




**▸ ఎట్టకేలకు ఉద్దీపన ప్యాకేజీ...**

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లపై విధించిన సూపర్ రిచ్ సర్‌చార్జీని రద్దు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్దీపన ప్యాకేజీలో భాగంగా ప్రకటించారు. అంతేకాకుండా వాహన రంగానికి ఊరటనిచ్చే నిర్ణయాలను, బ్యాంక్‌లకు రూ.70,000 కోట్ల మూలధన నిధుల అందించడం, తదితర నిర్ణయాల కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది.

**▸ మళ్లీ అమెరికా–చైనాల చర్చలు....**

అమెరికా–చైనాలు తాజాగా పరస్పరం సుంకాలు విధించుకున్నాయి. వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం మళ్లీ చర్చలు ఆరంభం కాగలవని అమెరికా అధ్యక్షుడు ట్వీట్ చేయడం మన మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపించింది.

**▸ చల్లబడ్డ చమురు ధరలు...**

చమురు ధరలు తగ్గాయి. బ్రెంట్, నైమెక్స్ ముడి చమురు ధరలు దాదాపు 1 శాతం మేర తగ్గాయి.

**▸ ఆర్‌బీఐ బోర్డ్ సమావేశం...**

ఆర్‌బీఐ మిగులు నిధులపై అధ్యయనం చేసిన బిమల్ జలాన్ కమిటీ సమర్పించిన నివేదికపై చర్చించడానికి సోమవారం ఆర్‌బీఐ బోర్డ్ సమావేశమైంది. మార్కెట్ ముగిసే సమయానికి ఎలాంటి నిర్ణయం వెలువడకపోయినప్పటికీ, సానుకూల నిర్ణయం ఉండొచ్చన్న అంచనాలు మార్కెట్‌కు కలసివచ్చాయి.

**▸ పెరిగిన రేటింగ్**

అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ, నొముర.. భారత్ రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్'కు అప్‌గ్రేడ్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, దేశీయంగా సానుకూల పరిణామాలు చోటు చేసుకుంటుండటంతో భారత్ రేటింగ్‌ను నొముర అప్‌గ్రేడ్ చేసింది. మరోవైపు ఈ ఏడాది డిసెంబర్ నాటికి సెన్సెక్స్ 40,500 పాయింట్లకు చేరగలదని మరో బ్రోకరేజ్ సంస్థ, బీఎన్‌పీ పారిబా వెల్లడించడం కూడా సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపించింది.

**▸ షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు...**

ఆగస్టు సిరీస్ డెరివేటివ్స్(ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్) కాంట్రాక్టులు ఈ వారంలోనే ముగియనున్న నేపథ్యంలో సానుకూల ప్యాకేజీ కారణంగా షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చోటు చేసుకున్నాయని నిపుణులంటున్నారు.

### ఆ మూడు షేర్ల వల్లే భారీ లాభాలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ ఈ మూడు షేర్లు 4–5 శాతం రేంజ్‌లో లాభపడ్డాయి. సెన్సెక్స్ మొత్తం లాభంలో ఈ మూడు షేర్ల వాటాయే 61 శాతంగా ఉండటం విశేషం. మొత్తం 793 పాయింట్ల సెన్సెక్స్ లాభంలో హెచ్‌డీఎఫ్‌సీ వాటా 195 పాయింట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వాటా 180 పాయింట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ వాటా 102 పాయింట్లుగా ఉన్నాయి. వెరసి ఈ 3 షేర్ల వాటా 477 పాయింట్లుగా ఉంది.



పురుగుల మందు పిచికారి చేసేటప్పుడు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు రాకుండా ఉండేందుకు ఓ రైతు వినూత్నంగా ఆలోచించాడు. ఆదిలాబాద్ మండలం తంతోలి గ్రామానికి చెందిన సంతోష్ తలకు హెల్మెట్ పెట్టుకుని ఇలా పత్తి పంటకు పురుగు మందు పిచికారి చేస్తూ కనిపించాడు.
–చింతల అరుణ్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# నిరుద్యోగులకు 'డీట్'గా జాబ్!

- ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలకు సరికొత్త పరిజ్ఞానం
- అందుబాటులోకి మొబైల్ యాప్, వెబ్‌సైట్
- యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. కొలువుల చిట్టా ప్రత్యక్షం

**సాక్షి, హైదరాబాద్:** ఇకపై ఉద్యోగ ప్రయత్నం మరింత సులభతరం కానుంది. ఇందుకు కార్మిక ఉపాధి కల్పన శాఖ సరికొత్త పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో ప్రత్యేకంగా మొబైల్ యాప్, వెబ్‌పేజీ తెరిచింది. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న అభ్యర్థులు ఈ యాప్ లేదా వెబ్‌పేజీలో వివరాలు నమోదు చేసుకుంటే చాలు.. వారి అర్హతకు తగ్గ ఉద్యోగాల జాబితా ప్రత్యక్షమవుతుంది. ఇంతకుముందుకు కొన్ని ప్రైవేటు సంస్థలు ఇలాంటి సేవలను అందుబాటులోకి తెచ్చినప్పటికీ... అవన్నీ ఖర్చుతో కూడుకున్నవే. ఉద్యోగం వచ్చిన తర్వాత.. లేదా ఉద్యోగాల జాబితా ప్రచురణకు వెబ్‌సైట్ నిర్వహణ సంస్థకు రుసుము చెల్లించాల్సి వచ్చేది. తాజాగా కార్మిక ఉపాధి కల్పన శాఖ తీసుకొచ్చిన డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ అఫ్ తెలంగాణ (డీట్) యాప్ మాత్రం పూర్తిగా ఉచితం. కంపెనీలల్లో ఖాళీల నమోదుకు ఎలాంటి




చెల్లింపులుండవు. ఉద్యోగ ప్రయత్నం చేసే అభ్యర్థికి సైతం పూర్తిగా ఉచిత సేవలందిస్తారు.

**గుర్తింపు ఉన్న కంపెనీల్లోనే..**

డీట్ యాప్, వెబ్‌పేజీల్లో గుర్తింపు ఉన్న కంపెనీల్లో ఖాళీల ప్రదర్శనకు కచ్చితమైన నిబంధనలు పాటిస్తుంది. ఉద్యోగ ఖాళీలున్నట్లు వచ్చే నోటిఫికేషన్లతాలూకు కంపెనీ పూర్వాపరాలు ముందుగా యాప్ నిర్వాహకులు పరిశీలిస్తారు. మొబైల్ ఫోన్ వెరిఫికేషన్, ఈ–మెయిల్ వెరిఫికేషన్ చేసిన తర్వాత క్షేత్ర పరిశీలన చేసి నిర్ధారిస్తారు. అలా మూడు దశల్లో ఆమోదం పొందాకే సదరు నోటిఫికేషన్లను యాప్, వెబ్‌పేజీల్లో ప్రదర్శిస్తారు. ప్రభుత్వ అనుమతి తీసుకుని నిర్వహించే కంపెనీలకే ప్రాధాన్యమిస్తామని అధికారులు చెబుతున్నారు.

**డీట్ యాప్, వెబ్‌పేజీలను ఆవిష్కరించిన మంత్రి మల్లారెడ్డి**

డీట్ యాప్, డీట్ వెబ్‌పేజీలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సోమవారం సచివాలయంలో ప్రారంభించారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలను సులభంగా తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ యాప్, వెబ్‌పేజీ నిర్వహణ కోసం ఏటా రూ.10 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, కార్మిక ఉపాధి కల్పన డైరెక్టర్ కేవై నాయక్, మోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

### యాప్ డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గూగుల్ ప్లేస్టోర్‌లో డీట్ (deet) అని టైప్ చేసి సెర్చ్ చేస్తే డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ పేరుతో యాప్ ప్రత్యక్షమవుతుంది. ఇన్‌స్టాల్ చేసుకుని.. వివరాలు నమోదు చేసుకున్నాక ఉద్యోగావకాశాలు ప్రత్యక్షమవుతాయి. వాటిని ఎంపిక చేసుకున్న తర్వాత అవకాశాలను బట్టి ఉద్యోగం ఇచ్చే కంపెనీతో చాట్ చేసే వీలుంటుంది. https://tsdeet.com వెబ్ సైట్ ద్వారా కూడా ఉద్యోగాలు శోధించొచ్చు.

### ఒకే చోట పరిశీలన

**చల్లా మణికాంత్, సీఈవో స్టోరీటెక్**

ఉద్యోగావకాశాల కోసం కంపెనీల చుట్టూ తిరిగితే సమయం వృథా అవుతుంది. అక్కడ ఉద్యోగాలున్నా అవి అభ్యర్థి అర్హతలకు సరిపోతాయో లేదోనన్న సందేహం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే కంపెనీలు వెబ్‌పేజీల ద్వారా నోటిఫికేషన్లు ఇస్తున్నా.. ఆయా కంపెనీల పేజీలను ఒక్కొక్కటిగా వీక్షించడంతో సమయం ఎక్కువ పడుతుంది. వీటన్నింటిని అధిగమించి సులభంగా ఒకే వేదికగా ఉద్యోగాలను చూసుకునే వీలు కల్పిస్తున్నాం. ప్రస్తుతం ఈ యాప్/వెబ్‌పేజీలు ప్రారంభదశలో ఉన్నాయి. ఇప్పటికే 45 వేలకు పైగా ఉద్యోగ ఖాళీలకు సంబంధించిన సమాచారం ఉంది.









Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792